'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

న్యాయం పేరిట అన్యాయం

ఢిల్లీ మద్యం కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు జోక్యంతో బెయిలు లభించడం న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని మరింత బలోపేతం చేసే అంశమని చెప్పాలి. అయితే అందుకు ఆమె అలుపులేని పోరాటం సాగించారనేది మరువరాదు. దిగువ కోర్టుల్లో బెయిలు కోసం జరిపిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో కవిత సర్వోన్నత న్యాయస్థానం తలుపు తట్టారు. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం కవితకు బెయిలు మంజూరు చేస్తూ కీలక తీర్పు వెలువరించింది. ఇందులో ముందుగా చెప్పుకోవాల్సింది ఢిల్లీ హైకోర్టు బెయిలు నిరాకరణకు చూపిన కారణాలను సుప్రీంకోర్టు తిరస్కరించడం. బెయిల్‌కు కవిత అన్ని విధాలా అర్హురాలని ధర్మాసనం గట్టిగా సమర్థించింది. సీబీఐ చార్జిషీట్ దాఖలైంది. ఈడీ దర్యాప్తు పూర్తయింది. దర్యాప్తు సంస్థల నుంచి కేసు విచారణ కోర్టుకు వచ్చింది. విచారణ ప్రారంభమయ్యాక నిందితులను ఇంకా జైలులో ఉంచడం ఏమిటి? దీంతో పాటు మహిళలకు ఉండే ప్రత్యేక వెసులుబాటును గుర్తిస్తూ సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

ఇదంతా ఒకెత్తు అయితే ఢిల్లీ మద్యం కేసును జాతీయ దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ నడిపిస్తున్న తీరును సర్వోన్నత న్యాయస్థానం ఎండగట్టడం ఒకెత్తు అని చెప్పాలి. ఆ రెండు సంస్థలపై అసాధారణమైన రీతిలో సుప్రీంకోర్టు విరుచుకుపడటం గమనార్హం. వాటి తీరుతెన్నులను ఎండగడుతూ తలవాచేలా చీవాట్లు పెట్టింది. న్యాయం పేరిట నడిపిస్తున్న కేసులో న్యాయమెంత? అనేది ప్రధాన చర్చనీయాంశమైంది. ఈ మొత్తం దర్యాప్తు వ్యవహారంలో 'న్యాయబద్ధత' ఉన్నదా? అనే నిలదీత ధర్మాసనం తీర్పులో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఎడతెగని దర్యాప్తు, ఎటూ తేలని సాక్ష్యంతో సాగదీస్తున్న కేసులో నిందితులను నిరవధికంగా జైలులో మగ్గబెట్టడం ఎలా కుదురుతుందని ప్రశ్నించింది. 'కేవలం అప్రూవర్‌గా మారిన నిందితుల వాంగ్మూలమే సాక్ష్యంగా చూపుతూ దర్యాప్తు నడిపించడం సబబేనా?' అని ధర్మాసనం నిలదీసింది.

ఒక నిందితుడు చేసే ఆరోపణలతో ఎవరినైనా నిందితులను చేయడమనేది ఇక్కడ ప్రధాన సమస్య. కేంద్ర దర్యాప్తు సంస్థలు అనుసరిస్తున్న ఈ ప్రక్రియ సర్వదా విమర్శలకు గురవుతున్న సంగతి తెలిసిందే. ఆధారాలు లేని అభియోగాలతో రోజులు, నెలలు, సంవత్సరాలు అన్నట్టుగా గడిపేస్తున్న తీరు దర్యాప్తు సంస్థల ప్రావీణ్యాన్ని సందేహాస్పదం చేస్తున్నది. 50 వేల పేజీల డాటా సేకరించామని అంటున్నారు. కానీ, ఒక్క రూపాయి కూడా స్వాధీనం చేసుకోలేదు. ఆరోపణలు కాకుండా కనీసం ఒక్కటంటే ఒక్క ఆధారాన్ని చూపలేకపోయారనేది సుప్రీంకోర్టు దర్యాప్తు సంస్థలకు శరపరంపరగా సంధించిన ప్రశ్నల్లో ఒకటి. ఈ సందర్భంగా సెల్‌ఫోన్ డాటాను కవిత ధ్వంసం చేశారన్న ఆరోపణను కూడా ధర్మాసనం తిరస్కరించింది. ఫోన్‌లో చాటింగ్‌ను తొలగించడం నేరం కాదని.. ఫోన్ ఫార్మాటింగ్, ఫోన్ ట్యాంపరింగ్ ఒకటి కాదని తేల్చిచెప్పింది. ఈ విచారణ ఎప్పుడు ముగుస్తుందో తెలియదని అయోమయాన్ని వ్యక్తం చేయడం మరో హైలైట్. అయితే ఈ కేసులో కోర్టు చేసిన వ్యాఖ్యలు భవిష్యత్తులో మార్గదర్శకంగా ఉంటాయని చెప్పవచ్చు. కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన తరుణమిది. ఎడాపెడా కేసులు పెట్టి, ఇష్టారాజ్యంగా అరెస్టులు సాగించే ధోరణిని ఇకనైనా ఆపితే మంచిది.

ధ్వంస రచనపై న్యాయవ్యవస్థ కొరడా

ఇంగ్లీష్‌లో poetic justice అనే పదబంధం ఉన్నది. కవితా న్యాయం అని అర్థం. ఆధ్యాత్మికులు దీన్ని law of karma అని కూడా అంటారు. ఘనత వహించిన సీబీఐ, ఈడీకి దేశ అత్యున్నత న్యాయస్థానం మంగళవారం చేసిన వ్యాఖ్యలు కవితా న్యాయం! రాజ్యాంగబద్ధ వ్యవస్థలను తమ జేబు సంస్థలుగా మార్చుకొని దుష్ట రాజకీయానికి తెగబడిన బీజేపీకి కొట్టిన సుప్రీం దెబ్బ నిశ్చయంగా గొప్ప ప్రజాస్వామ్య విజయం. ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని ధ్వంసం చేద్దామనే బీజేపీ కూహకాన్ని విధ్వంసం చేసిన చారిత్రక ఘటన తెలంగాణ ఉద్యమకారిణి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ రావడం! Nothing more, nothing less!!



శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
90309 97371



'మీ ఇష్టారాజ్యం నడువదు' అన్న సుప్రీం హెచ్చరిక పొయెటిక్ జస్టిస్ లాంటి కర్మ ఫలమే. 'మొండిదానిని జగమొండి చేసిన్ర'ని కవిత అన్న మాటలు మనకు సంకేతం, స్ఫూర్తి కావాలి. తమపై కక్ష గట్టిన బీజేపీపై తెలంగాణ సమాజం జగమొండిగా కొట్లాడాల్సిన సందర్భం ఇది. ఎందుకంటే కేసీఆర్‌కు కవిత ఒక్కరే బిడ్డ కాదు. రాష్ట్ర సాధకుని పిల్లలమే మనమంతా! మన చైతన్యమే అసలు సిసలు కవితా న్యాయం!

> **'సామాజిక సేవారంగంలో కృషి చేస్తూ, ఎంపీగా, ఎమ్మెల్సీగా సేవలందించే మహిళ ఎక్కడికీ పారిపోదు. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ విచారణ కోసం ఆమెను నిరంతరం జైలులో ఉంచడం తగదు' అని కవిత బెయిల్ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.**

తెలంగాణలో ఏ మూలకు పోయినా బతుకమ్మ అనగానే గుర్తొచ్చే రూపం కల్వకుంట్ల కవిత. 'జాగృతి' ద్వారా సమాజాన్ని తట్టిలేపడం ముమ్మాటికీ సామాజిక సేవయే. సేవ కంటే సామాజిక సంస్కరణ అనడం సమంజసం. నది తను ప్రవహించే నేలంతా సారవంతం చేసినట్టు... కేసీఆర్ తెలంగాణను చైతన్యపరుస్తూ, తానూ పులకిస్తూ మొక్కవోని దీక్షతో తెలంగాణ రాష్ట్రం సాధించిన్రు. ఆయన తనయగా, బాధ్యత గల్ల తెలంగాణ బిడ్డగా కవిత తన వంతు పాత్ర అజేయంగా పోషించిన్రు. సాధించుకున్న తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన్రు కేసీఆర్. 'ప్రగతిలో మీరు నెంబర్ వన్' అంటూ అలుపు లేకుండా ప్రతిరోజూ తెలంగాణకు అవార్డులు, రివార్డులు పదేండ్ల పాటు ఇచ్చిన ఆర్బీఐ, నీతి ఆయోగ్, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల దగ్గర ఆ సమాచారం ఉంటుంది, ఎవరైనా తెప్పించుకోవచ్చు!

అట్లా ధగద్ధగాయమానంగా, జగజ్జేయంగా వెలుగుతున్న తెలంగాణ మాడల్‌ను దేశవ్యాప్తం చేయాలని టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చిన్రు కేసీఆర్. రాజకీయాల్లో గుణాత్మక మార్పు ద్వారా దేశ నవ నిర్మాణం కోసం కేసీఆర్ ఎత్తుకున్న 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' యజ్ఞం నుంచి పైకి రేగిన నిప్పు రవ్వలు బీజేపీకి కలవరం పుట్టించినై! పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌ల్లాగ భిక్షుక దేశం కాదు.. చైనా, సింగపూర్, మలేషియాల్లాగ సుభిక్ష దేశం కావాలని ఆశించే మీరూ, నేనూ, మనందరి లాగ కవిత కూడా బీఆర్‌ఎస్ యజ్ఞంలో భాగస్వామి.

మరోవైపు మోదీకి పక్కనే బల్లెంలా కేజ్రీవాల్ మారిన్రు. మొహల్లా క్లినిక్‌లు, అందరికీ స్వచ్ఛమైన నీళ్లు, నాణ్యమైన విద్యుత్తు, దేశం అంతకు ముందు ఎప్పుడూ చూడని స్థాయిలో విద్యాలయాల ద్వారా ఢిల్లీ ప్రజల జీవన ప్రమాణాలు 'ఆప్' సర్కార్ పెంచడం, ప్రజల మద్దతుతో వెలిగిపోతున్న 'ఆప్' ప్రభ బీజేపీకి కంటగింపైంది.

తన మాట వినని, తనకు నచ్చని ప్రభుత్వాలను తొమ్మిదింటిని కూల్చింది బీజేపీ. ఆ పనే చేయబోయి తెలంగాణలో చేతులూ, మూతీ అన్నీ కాల్చుకున్నది. ఇక అప్పటి నుంచి వారికి కునుకు లేదు. కేసీఆర్, కేజ్రీవాల్‌ను కట్టడి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నది. 'లిక్కర్ కేసు' పేర అభియోగం మోపి కల్వకుంట్ల కవితను అరెస్టు చేసి, 165 రోజులు జైలులో ఉంచింది. నిన్న సుప్రీంకోర్టు సీబీఐ, ఈడీలపై చేసిన వ్యాఖ్యలు నిజానికి నరేంద్ర మోదీకి తగులుతయి.

మనం ఏయే అభివృద్ధి సూచీలలో ఎంతెంత వెనుకబడి ఉన్నామో, ఎట్లా మన దేశాన్ని ప్రపంచంలో మేటి శక్తిగా తయారు చేయవచ్చో మీకందరికీ తెలుసు. గణాంకాల సైతంగా కేసీఆర్ ఎన్నో సార్లు చెప్పి ఉన్నరు. అవన్నీ ఒక్క క్లిక్‌తో మీకు దొరుకుతయి కాబట్టి ఆ వివరాల్లోకి పోవడం ఈ వ్యాసం ఉద్దేశం కాదు.

> **సకల వనరులు ఉన్నై, వాటిని ఉపయోగంలో పెట్టే సకల జనమూ ఉన్నరు, ప్రపంచం ఆశ్చర్యపోయే అభివృద్ధి సాధ్యమే, పదేండ్ల తెలంగాణ నిలువెత్తు ఉదాహరణగా ఉన్నది, దేశానికి దివిటీ చూపిస్తున్నది... పదండి దేశాన్ని బాగు చేసుకుందాం' అని కేసీఆర్ పిలుపు ఇచ్చిన్రు. దేశభక్తి మీద భక్తి తప్ప దేశం మీద భక్తి లేని మూకలు సహజంగానే సహించలేని రాజకీయం కేసీఆర్‌ది. ఆ టాస్క్ మాస్టర్ గొంతు నులమాలని బీజేపీ కంకణం కట్టుకున్నది. అందులో భాగమే ఎమ్మెల్సీ కవిత అరెస్టు.**

https://www.indiabudget.gov.in/doc/rec/annex9.pdf ఈ ఫైల్ ఓపెన్ చేయండి విజ్ఞులారా. భారత ప్రభుత్వ ఆర్థిక శాఖ వెబ్‌సైట్‌లో ఉన్న అధికార అప్పుల చిట్టా అది. మన దేశ అప్పు రూ.1,81,68,456 కోట్లు!. ఈ తెచ్చిన పైసలన్నీ ఏమైనయి? ఎవరికి పెట్టిన్రు? మీకు ఎవరికన్నా గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపునకు వాడిండా మోదీ? జేబులో పర్సును చూసి రెండొందలా లేక ఒక వంద చాలేమో అంటూ చింతలు పడుతూ బండిలో పెట్రోల్ పోయించే మిమ్మల్ని ఏమన్నా ఆదుకోవడానికి విదిలిస్తున్నడా ఆ పైసలు? పెన్సిల్, షార్ప్‌నర్‌పై జీఎస్టీ వేసి మీ చిన్నారుల చదువును మొద్దుబార్చడం తప్ప వారికేమన్న తాతలా సహాయపడుతున్నడా? 'యోగక్షేమం వహామ్యహమ్' అని లోగో పెట్టుకుని జీవనంలోనూ, జీవనం అనంతరమూ భరోసా పడే ఎల్ఐసీని భక్షిస్తూ మీ భద్ర జీవనానికి తూట్లు పొడిచే పాలసీ ఎందుకు తెచ్చిండు? అన్నేసి కోట్ల అప్పు లు మన మీద రుద్ది ఇంకా కక్కుర్తి ఎందుకు? మీ అవ్వాతాతలకు రైళ్లలో రాయితీ ఎత్తేసి మిగిల్చిన పైసలు ఏమి చేస్తున్నడు? ఎందుకు అందరికీ తాగునీరు లేదు. ఎందుకు వ్యవసాయ భూము లు ఎండిపోతున్నయి? ఎందుకు కరెంటు లేక చీక ట్లో వేలాది గ్రామాలు మగ్గుతున్నయి? ఏమి చేస్తున్నరు ఆ పైసలన్నీ? ఎవరికి దోచిపెడుతున్నరు?

ఇగో... ఈ ప్రశ్నలడిగిండు కేసీఆర్. ఆ ప్రశ్నలను సమాధి చేయడానికి, అడుగుతున్నవారిని దెబ్బ కొట్టడానికి సినిమాలో చీప్ విలన్ చేసే పనే మోదీ చేస్తున్నడు. అదే కల్వకుంట్ల కవితపై దాడి. దేశం నివ్వెరపోయే మహా దోపిడీ వ్యవహారం నుంచి అదానీని రక్షించే పనిలో ఉన్న మోదీ... పార్లమెంట్‌లో సరైన ప్రశ్నలు రావొద్దు అనుకుంటున్నడు. అందుకే కుత్సితమైన ప్రశ్నలు ఈడీ ద్వారా వేయిస్తున్నడు. మనమైనా ఆలోచించవద్దా, ప్రశ్నలు ఏవి, ప్రశ్నలను ప్రశ్నించాల్సిన ప్రశ్నలేవి అని, మేధావులారా?!

'20 నెలల పాటు విచారణ జరిపి, 493 మంది సాక్షులను, 57 మంది నిందితులను విచారించామని చెప్తున్నరు. 50 వేల పేజీల కొద్దీ సాక్ష్యాలు సేకరించినట్టు రికార్డుల్లో పేర్కొన్నరు. మీరన్నట్టు.. ఇంత పెద్ద స్కామ్ జరిగితే, ఒక్క రూపాయి కూడా రికవరీ చేయకపోవడమేంటి? అసలు స్కామ్ జరిగినట్టు రుజువులేమిటి? పిటిషనర్ అయిన మహిళ ఐదు నెలలుగా విచారణ ఖైదీగా జైల్లోనే ఉన్నరు. పూర్తి కేసు తేలేందుకు చాలా సమయం పడుతుంది. విచారణ భవిష్యత్తులో ముగిసే అవకాశం కనిపించడం లేదు. ఈ విచారణ ఎప్పుడు ముగుస్తుందో తెలియదు' అన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలను మనం జాగ్రత్తగా గమనించాలి. ఈడీ దాడులకు గురై ఆ తర్వాత బీజేపీ తీర్థం పుచ్చుకొని కేసులలోంచి బయట పడ్డ ఎందరో నాయకుల పేర్లు ఈ వాక్యాలు చదువుతుండగానే మీకు స్ఫురిస్తాయి. అంటే బీజేపీ రిక్రూట్‌మెంట్ సెల్‌గా ఈడీ ఎంతటి నీచ పాత్ర పోషిస్తున్నదో తెలుస్తున్నది కదా. సుప్రీం కొరడా ఝళిపింపు అందుకే!

'నిందితులను ఇష్టమొచ్చిన రీతిలో అప్రూవర్లుగా మార్చి, వారిచే అనైతిక స్టేట్మెంట్లు ఇప్పించారంటూ సుప్రీం వాడిన పదజాలం బీజేపీకి సిగ్గుచేటు. అయినా కేంద్ర మంత్రి బండి సంజయ్ వదరుబోతు మాటలు మానలేదు. సుప్రీంకోర్టుకే తప్పుడు ఉద్దేశాలు ఆపాదిస్తూ రాజకీయ పార్టీలకు తలొగ్గుతోందనే ధ్వని వచ్చేట్టు బాధ్యతారాహిత్యంగా మాటలాడిండు! అటు కాంగ్రెస్ ఏమీ తక్కువ తినలేదు. సోనియా, రాహుల్, రేవంత్‌ల బెయిళ్లు కూడా సుప్రీం రాజకీయమేనా? ఇంత వాచాలతను సహించాలా? సుప్రీంకోర్టుపై ప్రజల విశ్వాసం సన్నగిల్లితే రాజ్యాంగానికే ప్రమాదం కదా? వీధి రౌడీల్లాంటి ఈ రెండు పార్టీలపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ చేపట్టాలి. మినుకు మినుకు మనే ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయాలి.

ఒకటే కేసులో కేజ్రీవాల్‌పై ఒకరకంగా, కవితపై మరొక రకంగా వ్యవహరిస్తున్నది కాంగ్రెస్. ఇలాంటి చిల్లర పార్టీలతో బీఆర్‌ఎస్ విలీనం అవుతుంది అని ఇద్దరూ పోటీ పడి ప్రచారం చేయడం హాస్యాస్పదం. మురికి కూపాలలో మునిగి తేలడానికి బీఆర్‌ఎస్ చరిత్ర లేని పార్టీ కాదు, చరిత్రా, భూగోళమూ సృష్టించిన సునామీ బీఆర్‌ఎస్! అలాంటి పార్టీపై, కేసీఆర్ కుటుంబంపై రాజకీయ పార్టీలకంటే అధ్వాన్నపు విష ప్రచారానికి ఒడిగట్టిన యూట్యూబ్ ఛానెళ్లు, సోషల్ మీడియా వేదికలు పునరాలోచించుకోవాలి. మీ వ్యక్తిగత కోపాలు వ్యవస్థలను నాశనం చేసే శక్తులకు ఆయుధాలైతున్నయి. ఆయుధాలకు విచక్షణ ఉండదు. అవి రేపు మీపై కూడా విరుచుకుపడుతయి. చరిత్రలో అలాంటి దృష్టాంతాలు కోకొల్లలుగా ఉన్నయి. గమనించండి, తెలివి తెచ్చుకోండి, బాధ్యతగా మెలగండి.

> **విజ్ఞులైన ప్రజావళి లోతుగా ఆలోచించాలి. తెలంగాణను, దేశాన్ని కబళించాలని చూస్తున్న రెండు జాతీయపార్టీల పట్ల అప్రమత్తత అవసరం. అందుకోసమైనా పార్టీలకతీతంగా కవితకు దన్నుగా నిలవాలి, కేసీఆర్‌కు అండగా ఉండాలి.**

సుప్రీం ఒక దారి చూపించింది. ముళ్లుంటై ముప్పులుంటై, కానీ తప్పదు- ఈ దేశం కోసం! సిద్ధమే కదా?! జై భారత్!!

మేధావులు ఏమైపోయినట్టు?



డాక్టర్ చెన్నమనేని హన్మంతరావు
98490 18120

ఇంతకీ ఎవరు మేధావులు? బాగా చదువుకొని పీహెచ్‌డీ పట్టా పొందినవారా? సామాజిక స్పృహతో సమాజంలో ఉన్న, సమాజానికి పట్టిన రుగ్మతలను ఎలా నయం చేయాలనే సంకల్పం గలవారా? అలాంటి రుగ్మతలను కలిగిఉన్న, వ్యాధిగ్రస్థమైన అవయవానికి లేదా వ్యక్తికి ఇక మందులు పనిచెయ్యవు, శస్త్రచికిత్స ఒక్కటే మార్గమని, అవయవ ఛేదనే దానికి సరైన చికిత్స అని నిర్ణయం తీసుకునేవారా? లేదా ఒక వ్యవస్థకు, ఒక వ్యక్తికి బందీ అయిపోయి వారి వ్యతిరేక వర్గాన్ని పొద్దునలేచిన దగ్గర్నుంచి విమర్శిస్తూ (తిడుతూ) బాగుపడేవారా? (బతకనేర్చినవారా?). వీరిలో ఎవరు మేధావులు? ఒక దృశ్య మాధ్యమం వారి వ్యతిరేకులను ఎలా ఉతికిపారేసిందో మొన్నటివరకు మనం చూశాం. అలాంటి కొందరు వ్యతిరేకులను కూడా మనం ఇంకా చూస్తున్నాం.

పొద్దునలేచిన దగ్గర్నుంచి సాయంత్రం దాకా ఏ మాధ్యమం దొరికితే ఆ మాధ్యమంలో వారి పోషకులకు అనుకూలంగా ఉతికివేయడం, ఇప్పటికీ ఆ చాకిరేవు ఇంకా నడుస్తుండటం కూడా చూస్తున్నాం. మేధావులంటే వీరేనా? కావొచ్చు. కాకపోతే నానారకాల ప్రజలకు నానా రకాల పథకాల్ని రచించి, నిరంతరం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే దాకా ఆలోచించినవారిని.. మాధ్యమాల్లో ఊదరగొట్టి దించేసేదాక వదల్లేదు కదా! ఆ మేధావుల మూతులు కొన్ని ఇప్పుడు మూతబడ్డాయి. ఎందుచేత? అది వారికి తెలుసు, మనకు తెలుసు. ఇక్కడో రకం మేధావులున్నారు.

నేతన్నలకు ఒక పథకం, దళితులకు ఒక పథకం, గొల్లకుర్మవారికి ఒక పథకం అంటూ సమాజానికి ఏదో చేయబోతే.. గడీల పాలన, దొరల పాలన అంటూ కల్లబొల్లి మాటలతో ఊదరగొట్టిన నోర్లు ఇప్పుడెందుకు మూతబడ్డాయో మరి! మేధావుల మెదళ్లలో ఉన్న తెలివి అయిపోయిందా, లేక మేత మేస్తున్నాయా? ధర్మాన్ని మరిచి స్వార్థమొక్కటే రాజ్యమేలితే ఇటువంటి ఫలితాలే కనిపిస్తాయి.

సమాజానికి ధర్మం చెప్పి, ధార్మిక చింతన నేర్పే కర్తవ్యమున్నవారు ఇంకొక రకం మేధావులు. వారి మేధల్ని అమ్మకానికి పెట్టారా? మరి చేతి ఐదు వేళ్లకు ఐదు ఉంగరాలు కావాలి, మెడలో బంగారు హారాలు కావాలి, ముంజేతి కడియాలు కావాలి. అయినా సమాజమంతా అలానే పోతుంటే వారు మాత్రం ఏం చేస్తారు? కానీ, నాకొక అనుమానం. సమాజంలో విలువ వీటిని ధరిస్తేనే వస్తుందా? గతంలో మహామహోపాధ్యాయుల్ని చూశాం, పుంభావ సరస్వతుల్ని చూశాం. వారికి ఏం లేవు. వారిప్పుడు లేకున్నా వారిని తలుచుకుంటున్నాం. ఇదిగో మేధావులు ఒక్కడ కొందరున్నారు. 'నాకిదివ్వు, నీకిదిస్తా' అనే ఒక రకం మేధావి వర్గం దేవునితో బేరమాడుతూ, ఆయన ఇంటర్వ్యూ కోసం వెంపర్లాడుతూ దేవాలయాల్ని నింపేస్తున్నది. ఇదొక రకం మేధావివర్గం. ఇదిగో ఇక్కడుంది. చాలా రోజుల కిందట ఒక కవిత చదివాను. దాని కింద రాసిన కామెంట్ వల్ల జ్ఞాపకం వస్తూ ఉంటుంది. పుచ్చిపోయిన సమాజాన్ని విమర్శించిన కవిత కింద ఒక మేధావి రాసిన కామెంట్ ఇలా ఉంది. 'కవిత బాగుంది! చదువుకోవడానికి హాయిగా ఉంది. యతిప్రాసలు, భాష అద్భుతం. కానీ, ఆయన వివరించిన సమస్యకు జవాబు లేదు. ఆ సమస్యను ఎలా పరిష్కరించాలి? ఎవరు పరిష్కరించాలి? చెప్పలేదు. కవితాప్రియులు చదివి అనుభవించారు. అంతే, మరిచిపోయారు. కొందరు పాపం! సమస్యల్ని పరిష్కరిద్దామని సమాజంలో ఉంటూ కాదు, అడవిలో ఆలోచిద్దామని అడవికి వెళ్లారు. ఏదేదో చేశారు. ఏమైంది. కొందరు ఆ రుగ్మతలు వారికంటుకొని కనుమరుగయ్యారు. మానవులకున్న సహజ బలహీనతలు కొందర్ని బలిచేశాయి. కొందరు చట్టానికి బలైపోయారు. ఇదొక రకం మేధావి వర్గం.

ఒక పెగ్గు వేసి, ఒక సిగరెట్ వెలిగించి కొందరు మేధావులు అర్థవంతమైన కవితలు వెలువరించారు (నిజంగా బాధతోనే కావొచ్చు). కానీ, అవి కాలగర్భంలో కలిసిపోయాయి. వారూ వెళ్లిపోయారు. కానీ, సనాతన కావ్యాలు రామాయణ, భారతాలు కనుమరుగు కాలేదు. అవి నిత్యనూతనంగా (కొందరికి) వెలుగుతూనే ఉన్నాయి. కొందరికి అధికార పీఠమెక్కడానికి సోపానాలుగా కూడా పనికొస్తున్నాయి. అవి కనుమరుగు కాకపోవడానికి కారణం అందులో సమాజ రుగ్మతల్ని వర్ణిస్తూ వాటి నివారణకు, చికిత్సలకు మార్గాల్ని కూడా చూపుతున్నాయి. ఇదీ కారణం. మరి వీటిని విరివిగా ప్రచారం చేద్దామని ఎవరికైనా తడుతున్నదా? (ప్రచారం చేసే కర్తవ్యమున్న మేధావులు దీనికి జవాబులు చెప్తారా?) ఇదొక రకం మేధావి వర్గం.



> **రాజమండ్రిలో గోదావరి ఆనకట్టను కట్టిన కాటన్ దొర పేరును ఇప్పటికీ చాలామంది తలుచుకుంటారు. కొందరైతే నిత్య పూజలో ఆయన పేరును చేర్చి సంకల్పం చెప్పకుంటారట. 'కావేరి వర్ధతాం, గోదావరి వర్ధతాం, కాటన్ దొర వర్ధతాం, కాలేవర్షతు వాసవా శ్రీరంగనాథో జయతు శ్రీరంగవర్ధతాం' అంటూ. వీరు తెలివికలవారు కానీ, మేధావులు కారు.**

మరి మన మేధావులు 'కావేరి వర్ధతాం! కాళేశ్వరం వర్ధతాం, కేసీఆర్ వర్ధతాం, కాలేవర్షతు వాసవా' అంటూ సంకల్పం చేస్తారా? ఎందుకు చేయరు? 'తొక్కేస్తాం, బొంద పెడతాం, పేరు లేకుండా చేస్తాం' అనే సంకల్పం మాత్రం చెప్తారు. ఎందుకంటే, వీరు 'కావేరి వర్ధతాం, కాళేశ్వరం వర్ధతాం, కేసీఆర్ వర్ధతాం' అని అంటే ఇంకేమన్నా ఉందా? అబ్బో బ్రహ్మాండం బద్దలైపోదు!

ఆశలు తప్ప, ఆశయాలకు దూరమైపోతే మేధోసంపత్తి ఇలానే భ్రష్టుపడుతుంది. ఇక యువ మేధావులు.. వారి ఆశలు ఎలా అయినా నెరవేరాలి తప్ప, ఇంకో మార్గం లేదంటారు. అయితే ఎదుటివారిని చంపుతారు, లేదా వారే ఆత్మహత్య చేసుకుంటారు. వీరితో మాట్లాడి వారిని సముదాయపరిచే వయసు మళ్లిన మేధ ఎక్కడుంది? తల్లిదండ్రులైతే వారి యువత జీవితంలో స్థిరపడితే చాలంటారు. ఆ తర్వాత వారు (యువత) ఎదుర్కొనే సమస్యల్ని మొదటే వారికి చెప్పి, వాటిని ఎదుర్కొన్నప్పుడు ఎలా పరిష్కరించుకోవాలనే చెప్పే సోయి ఎంతమంది పెద్దలకుంది? మొదట జీవితం గురించి చెప్పి (ఇది అందరికీ వడ్డించిన విస్తరి కాదని) ఆ తర్వాత పరికర్తవ్యం గురించి వివరించి, కొంత ధర్మం గురించి చెప్పి వారిని సమాజంలో వదిలిపెడితే యువత ఇంత ఒత్తిడి ఎదుర్కోదు. కానీ, చెప్పేవారెవ్వరు? వారిని, వారి ఉద్రేకాన్ని రెచ్చగొట్టి తమ స్వార్థం కోసం వాడుకునేవారు కొందరైతే, వారి బాధలను అర్థం చేసుకోకుండా 'ఎందుకు?, బలిసి, ఒళ్లు పొగరని, తెలివితక్కువని' రకరకాలుగా కామెంట్ చేసేవారే అధికం కాదా? ఒక్కసారి సమాజంలోకి వెళ్లండి. ఎన్ని కుటుంబాలు సంతోషంగా ఉన్నాయో సర్వే చేయండి. ఆర్థికంగా బాగానే ఉంటారు. కానీ, సంతోషంగా ఎందరున్నారు? అసలు సంతోషం, సుఖం, ఆనందం అన్న భావాల్లో తేడా ఎంతమందికి తెలుసు. ఈ విషయమై మేధావులు ఆలోచించారా?

'ధర్మం, ధర్మం' అని మాట్లాడుతున్నారు అదెక్కడుందని అంటారా. చూడాలనుకుంటే మన జీహెచ్ఎంసీలో స్వీపర్ నారాయణమ్మను చూడండి. ఆమె ఏం చదువుకోలేదు. వెనుకబడినవర్గానికి చెందిన మహిళ. ఆమెతో మాట్లాడితే ధర్మం అంటే ఏమిటో చెప్తుంది ఆమె ఆచరిస్తూ. కల్లు గీసుకుంటూ బతుకువెళ్లదీసి అంతటా పరతత్త్వాన్నే చూసిన భూమాగౌడ్ గురించి తెలుసుకోండి. చిన్న ఉద్యోగం చేసి, శతకం రాసి, అక్షరాలతో పరతత్త్వాన్ని వర్ణించిన రామస్వామిని చదవండి. రూ.47 జీతంతో చప్రాసి ఉద్యోగం చేసి, తన క్రమశిక్షణ, తన కర్తవ్య నిర్వహణ, తాను పనిచేస్తున్న బడి, పిల్లల బాగోగులు తప్ప వేరొకటి పట్టక, ఊరి వారందరితో 'చప్రాసి సార్' అని పిలిపించుకున్న అటెండర్ గజ్జెల బాలయ్య గురించి తెలుసుకోండి. ధర్మమంటే ఏమిటో తెలుస్తుంది. (వీరిలో కొందరున్నారు, కొందరు పరమపదించారు) అది (ధర్మం) నిరంతరంగా తనను ఆశ్రయించుకున్న వాళ్లను రక్షించుకుంటూ పయనిస్తూనే ఉంటుంది. ఎందుకంటే, 'ధర్మో రక్షతి రక్షితః' కాబట్టి. కాకపోతే మనం (మేధావులం) దాని గురించి ఆలోచించాలంతే. మన పిల్లలకు వారి చిన్నతనం నుంచి చెప్పాలంతే.


> **చెప్పేవారు లేక, సమాజంలో కనిపించిన ఆకర్షణలకు లోబడి భోగలాలసత్వం పెరిగి, దాని కోసం డబ్బు ఎలా సంపాదించాలా? అనే ఆలోచన తప్ప ఇంకే ఆలోచన లేకుండా యువత పోతుంటే మనం ఏం చేస్తున్నాం? ఈ ఒకవడిలో 27 సార్లు బంగారు హారం మెడల్లో నుంచి దొంగిలించి, జైలుకు వెళ్లి, తిరిగి వచ్చాక 28వ సారి మళ్లీ దొంగిలిస్తే! మార్గం ఏమిటి? మేధావులమైన మనకు ఇవేవీ పట్టవు. ఎందుకంటే, అది మన బాధ్యత కాదు, ప్రభుత్వానిదని అనుకుంటాం.**

మేధావులంతటా ఉన్నారు. కర్తవ్యం, బాధ్యత అనే విషయాలు మనవి కావని అనుకుంటూ, మన జీవితాలు మనవి, ఇంకొకరి విషయం మనకెందుకంటూ, కబుర్లు చెప్తూ, ఉన్న తవర్గాల్లో తిరగాలని ఆశిస్తూ ప్రయాణం చేస్తున్నాం.'ఇక్కడ ఓ మేధావి వర్గం ఉంది' అంటూ టంకశాల వారు మేధావుల గురించి మధనం చేస్తూ తిరుగాడుతుంటే ఈ వ్యాసం రాయాలనిపించింది. వారికి కృతజ్ఞతలతో.

(వ్యాసకర్త: రిటైర్డ్ సర్జన్)

> **నేతన్నలకు ఒక పథకం, దళితులకు ఒక పథకం, గొల్లకుర్మవారికి ఒక పథకం అంటూ సమాజానికి ఏదో చేయబోతే.. గడీల పాలన, దొరల పాలన అంటూ కల్లబొల్లి మాటలతో ఊదరగొట్టిన నోర్లు ఇప్పుడెందుకు మూతబడ్డాయో మరి! మేధావుల మెదళ్లలో ఉన్న తెలివి అయిపోయిందా, లేక మేత మేస్తున్నాయా? ధర్మాన్ని మరిచి స్వార్థమొక్కటే రాజ్యమేలితే ఇటువంటి ఫలితాలే కనిపిస్తాయి.**

తేనె తెలుగు



సీ|| సంగీత సౌరభ సాహిత్య పవనమ్ము
ఈడుజోడు చెవుల జాడలడుగ
రాగతానమ్ములు రవళింప పల్లవి
త్యాగయ్య కృతికి కీర్తనము సేయు
దక్షిణ భారతి ద్రావిడ భాషలు
తెలుగు బాసకు తేనె లలుగులెత్త
సంగీత నామమ్ము సంకీర్ణ వర్ణాలు
కర్ణాటకంబుగా కళవళింప

తే.గీ.|| తెలుగు తేనెల పల్కులన్ కలర వింప
మావి చివురులు మేసిన కోవిలమ్మ
పంచమస్వరాల్ వరహాలు పంచుచుండ
తెలుగు భారతి నొజ్జయై కులుకుచుండె||



గొల్లపల్లి రఘురామ శర్మ
99891 49454

(నేడు గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవం)

అతిథి అధ్యాపకులను కొనసాగించాలె

స్వరాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత బడుగు, బలహీనవర్గాల పిల్లలకు మెరుగైన విద్యనందించేందుకు అప్పటి ప్రభుత్వం గురుకులాల సంఖ్యను వెయ్యికి పెంచింది. నాటి సర్కార్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నెలకొల్పిన గురుకులాల వృద్ధి వెనుక అధ్యాపకుల కృషి మరువలేనిది. అందులోనూ అహర్నిశలు శ్రమించి గురుకులాల అభివృద్ధికి ఆలంబనగా నిలిచిన అతిథి అధ్యాపకుల కృషి ఎనలేనిది. ఒక్కమాటలో చెప్పాలంటే వారు గురుకులాలకు పునాదిరాయి లాంటివారు. 5 వేల మందికి పైగా ఉన్న వీరికి 3- 10 ఏండ్ల వరకు సీనియారిటీ ఉన్నది. ఎంతో నిబద్ధత గల వీరిని సీనియారిటీ లేదనే సాకుతో మహాత్మా జ్యోతిబా బీసీ గురుకుల సొసైటీ యాజమాన్యం తొలగిస్తుండటం శోచనీయం.

ఈ తొలగింపుల వెనుక కుట్ర దాగి ఉన్నదనే అనుమానాలు కలుగుతున్నాయి. అతిథి అధ్యాపకుల శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వాలని, పన్నెండు నెలల వేతనాలు చెల్లించాలని, సీనియారిటీ ఉన్నవారిని రెగ్యులర్ చేయాలనే డిమాండ్ చాలాకాలంగా ఉన్నది. ఈ డిమాండ్లను పక్కదారి పట్టించేందుకే ఇప్పుడు తొలగింపులను సొసైటీ ముందేసుకున్నదనే వాదన వినిపిస్తున్నది.

పలువురు ప్రిన్సిపల్స్, రీజినల్ కో ఆర్డినేటర్లు (ఆర్సీవో) ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ఈ క్రమంలో రెగ్యులర్ అధ్యాపకుల బదులుగా డ్యూటీలు చేస్తామని హామీ ఇచ్చేవారిని, బంధువులను, అవినీతికి అంటకాగి గతంలో తొలగింపునకు గురైనవారిని, కులం, మతం ప్రాతిపదికన రిక్రూట్ చేసుకుంటున్న ప్రిన్సిపల్స్, రీజినల్ కో ఆర్డినేటర్లు (ఆర్సీవో).. సీనియర్లను తొలగిస్తున్నారు. ఈ విషయమై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంజేపీటీబీసీ గురుకుల సొసైటీ సెక్రెటరీ, ఆయా జిల్లాల కలెక్టర్లకు అతిథి అధ్యాపకులు వినతిపత్రాలు సమర్పించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు.

విద్యా వ్యవస్థ మెరుగ్గా ఉండాలంటే విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా టీచర్ల సంఖ్య ఉండాలి. సాధారణంగా మన దేశంలో టీచర్, విద్యార్థుల నిష్పత్తి చాలా తక్కువగా ఉంటుంది. ప్రజాపాలన అని చెప్పుకొనే ప్రభుత్వం.. నియామకాలు చేపట్టాలే గానీ, ఇలా తొలగింపులు చేయడం సబబు కాదు. ఒకవేళ అనర్హులను తొలగించాలనుకున్నా శాస్త్రీయ పద్ధతిని అవలంబించాలి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, మంత్రులు ఇప్పటికైనా స్పందించి అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి.

- కె.రేణుక, 90001 80941

• రుణమాఫీ చేయాలని రైతుల ధర్నా



కొర్రీలు పెట్టకుండా అర్హులైన రైతులందరికి రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎస్ ఆధ్వర్యంలో భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట బుధవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నేతలు ముత్యాల విశ్వనాథం, చంద్ర నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. రైతుల రుణాలు మాఫీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం షరతులు విధించడం సరికాదన్నారు. – కొత్తగూడెం అర్బన్

• బ్యాంకు వద్ద రైతుల నిరసన



ములుగు జిల్లా ఏటూరునాగారంలోని కెనరా బ్యాంకు వద్ద రైతులు బుధవారం ధర్నా చేపట్టారు. బ్యాంకులో సరిపడా సిబ్బంది లేకపోవడంతో తాము ఇబ్బంది పడుతున్నామని, ఉన్నవారు సరిగా స్పందించడం లేదంటూ రైతులు వాపోయారు. రుణాల మాఫీ, కొత్త రుణాలు తీసుకోవడం, బంగారంపై పంట రుణాలు తీసుకునేందుకు వస్తే ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో తరచూ తిరగాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. – ఏటూరునాగారం

• రుణమాఫీ తిప్పలు..



రుణమాఫీ డబ్బులు తీసుకునేందుకు, రెన్యువల్ చేసుకునేందుకు రైతులు తిప్పలు పడుతున్నారు. 20 రోజులుగా ఆడిట్ పేరుతో ఆలస్యం కావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలోని ఎస్బీఐకి పెద్ద సంఖ్యలో రైతులు రావడంతో గేట్లు మూసివేశారు. దీంతో రైతులు అక్కడే గుమికూడారు. కొందరు బయటకు వచ్చాక మరికొందరిని లోపలికి అనుమతించారు. – నర్సింహులపేట

మంత్రి సొంతూర్లో రుణమాఫీ పెద్ద‘దగా’డ

- జూపల్లి స్వగ్రామంలో అసంపూర్తిగా మాఫీ
- 1,780 మందికిగానూ 1,170 మందికే వర్తింపు
- ఇంకా 40 శాతం మందికి మాఫీకాని రుణాలు
- కాంగ్రెస్ సర్కారుపై మండిపడుతున్న అన్నదాతలు



మంత్రి జూపల్లి కృష్ణారావు సొంతూరు వనపర్తి జిల్లాలోని పెద్దదగడ గ్రామం

జూపల్లి ఇలాకా.. రైతుకు ధోకా

వనపర్తి, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలన్నీ మాఫీ చేశామని చెప్తున్నా.. ఎక్కడా పూర్తిస్థాయిలో మాఫీ అయిన దాఖలాలు కనిపించడం లేదు. అందుకు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత గ్రామంలో జరిగిన రుణమాఫీ తీరే ఉదాహరణ. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్దదగడలో మొత్తం 2,194 మంది రైతు కుటుంబాలున్నాయి. ఈ గ్రామానికి చెందిన రైతులు కొప్పునూరు సహకార సంఘం, పెంట్లవెల్లి మండలం జటప్రోల్ యూనియన్ బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్నారు. కొప్పునూరు సంఘంలో 180 మంది క్రాప్‌లోన్లు తీసుకుంటే.. వీరిలో 120 మందికి మాత్రమే మాఫీ వర్తించింది. పెంట్లవెల్లి మండలం జటప్రోల్ యూనియన్ బ్యాంక్ నుంచి 1,600 మంది రుణం పొందితే.. వీరిలో 1,050 మందికి మాఫీ అయ్యింది. ఇంకా 550 మందికి రుణాలు మాఫీ కాలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలా గ్రామంలో రుణాలు తీసుకున్న మొత్తం రైతులు 1,780 మంది ఉంటే.. 1,170 మందికి మాత్రమే మాఫీ వర్తించిందని వ్యవసాయ శాఖ లెక్కలు చెప్తున్నాయి. దీని ప్రకారం.. పెద్దదగడలో ఇంకా దాదాపు 40 శాతం రైతులకు పంట రుణాలు మాఫీ కావాల్సి ఉంది. వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ వారి బాధలు తొలగడం లేదు. అన్ని అర్హతలు ఉండి కూడా మాఫీ రాని రైతుల పాట్లు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. రేషన్ కార్డులు లేవని, ఆధార్‌లో తప్పులున్నాయని కొందరి పేర్లు లిస్టులో లేకపోవడంతో.. రుణమాఫీ పెద్ద దగా అంటూ రైతులు మండిపడుతున్నారు.

మాఫీ చేయలే..



నాకు ఎకరా 20 గుంటల భూమి ఉంది. దీనిపై 50 వేల పంట రుణం తీసుకున్నా. మాఫీ లిస్టులో నా పేరు రాలేదు. బ్యాంకులో అడిగితే మీ తండ్రి పేరుతో కూడా రుణం ఉందంటున్నారు. ఇద్దరిది కలిపి రూ.2.08 లక్షలని చెప్తుండ్రు. ప్రభుత్వం రూ.2 లక్షలిస్తే.. రూ.8 వేలు మేము కట్టుకుంటం. అధికారుల చుట్టూ తిరిగి అలసిపోతున్నాం. మా బాధలు అర్థం కేసుకుని రుణమాఫీ చేయండి.

-కంచి శివ, యువ రైతు, పెద్దదగడ

వస్తే ఇస్తాం అంటున్నరు



నాకు ఆరెకరాల పొలం ఉంది. 2 లక్షల రుణం తీసుకున్నా. మాఫీ లిస్టులో నా పేరు లేదు. ఎందుకు లేదని సొసైటీ వద్దకు వెళ్లి అడిగితే.. లిస్టులో వస్తే ఇస్తాం.. రాలేదు అంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. దరఖాస్తు చేసుకోవాలంటున్నారు. ఈ గోస మాకు అర్థం కావడం లేదు. మీరు చెప్పిన 2 లక్షల మాఫీ చేస్తే.. మాకు ఇదంతా దండగ ఉండదు. మాఫీ చేస్తామని చెప్పి చివరకు మా కడుపులో మంటలు పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం.

-బాలీశ్వరయ్యగౌడ్, రైతు, పెద్దదగడ

మళ్లీ దరఖాస్తు చేసుకోవాలట



నాకు ఐదెకరాల 12 గుంటలున్నది. జటప్రోల్ బ్యాంకులో రూ.1.75 లక్షల రుణం తీసుకున్నా. మాఫీ లిస్టులో నా పేరు లేదు. అధికారులను అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటున్నారు. మేమూ రైతులమే.. మాకూ అప్పు ఉంది. ఒక ఊరిలోనే ఇలా ఇన్ని తేడాలు చూపుతున్నారు. 2 లక్షల వరకు మాఫీ అన్నరు. అది చేస్తే మిమ్మల్ని మళ్లా అడుగుతామా? ఈ సర్కారు చేసేది ఒకటి.. చెప్పేది మరోటి అన్నట్టు ఉంది.

-చేపల సహదేవుడు, పెద్దదగడ గ్రామం



రేషన్‌కార్డు లేనివారికీ రుణమాఫీ

- రాజన్న ఆలయంలో కార్తీకమాసం నుంచే నిత్యాన్నదానం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

వేములవాడ, ఆగస్టు 28: రేషన్‌కార్డు లేని రైతులందరికీ రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టంచేశారు. బుధవారం ఆయన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి వేములవాడలో రూ.15 లక్షలతో నిర్మించిన సహకార సంఘం గోదాం, రూ.80.66 లక్షలతో నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ భవనాన్ని ప్రారంభించారు. తర్వాత ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 59 వేల మంది రైతులకు రూ.444 కోట్ల రుణాలు మాఫీ చేశామని తెలిపారు. రేషన్‌కార్డు లేనివారికి ప్రభుత్వం కుటుంబ నిర్ధారణ ప్రారంభించిందని, అధికారులు విచారణ చేసిన తర్వాత వారికి కూడా రుణమాఫీ అవుతుందని భరోసా ఇచ్చారు. రాజన్న ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని వచ్చే కార్తీకమాసం నుంచి ప్రారంభిస్తామని మంత్రి పొన్నం తెలిపారు.

రుణమాఫీ కాకపోతే రైతే బాధ్యుడా?

- కుటుంబ నిర్ధారణ ఉద్దేశం ఇదేనా?
- రైతు సంఘాల సందేహాలు
- కుటుంబాన్ని ధ్రువీకరిస్తేనే మాఫీ
- ఐటీ చెల్లిస్తే రుణమాఫీ బంద్
- రేషన్‌కార్డు లేని 2 లక్షల మందికి కోత
- సీఎం లెక్కల్లో రేషన్‌కార్డు లేనివారు 6.36 లక్షలు
- కుటుంబ సర్వే చేస్తున్నది 4.24 లక్షల మందికే

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాకపోవడానికి రైతులనే బాధ్యులను చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదా? ఇందుకోసమే కుటుంబ నిర్ధారణ సర్వే చేపడుతున్నదా? రైతు తెలిపిన వివరాల ప్రకారం ఆ రైతుకు రుణమాఫీ కాకపోతే వారినే బాధ్యులుగా చేయనున్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కుటుంబ నిర్ధారణ కోసం చేపట్టిన సర్వేపై రైతు సంఘాలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నాయి. రేషన్‌కార్డు లేని రైతులకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కుటుంబ నిర్ధారణ చేపట్టింది. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక యాప్ ద్వారా సర్వేను ప్రారంభించింది. క్షేత్రస్థాయి అధికారులు ఎంపిక చేసిన రైతుల వద్దకు వెళ్లి ఆ రైతు కుటుంబసభ్యుల వివరాలను సేకరించనున్నారు. కుటుంబ సభ్యుని పేరు, ఆధార్ నంబర్, వయసు, కుటుంబ పెద్దతో సంబంధం వివరాలను సేకరించనున్నారు. ఈ ఫారంపై రైతుతో సంతకం కూడా చేయించుకుంటున్నారు. దీని మీద సంతకం పెడితే తాను ఇచ్చిన వివరాలన్నీ సరైనవేనని, తప్పుడు వివరాలతో రుణమాఫీ పొందితే అందుకు తానే పూర్తి బాధ్యత వహిస్తానని రైతు ఒప్పుకొన్నట్టే. రుణమాఫీ సొమ్మును రికవరీ చేసేందుకు కూడా అంగీకరించినట్టే. కుటుంబ సభ్యులందరి ఆధార్ వివరాలను ప్రభుత్వం సేకరిస్తున్నది. ఆయా ఆధార్ నంబర్లకు రుణమాఫీ నిబంధనలను అమలుచేస్తుంది. కుటుంబంలో ఏ ఒక్కరైనా ఆదాయపన్ను చెల్లిస్తే.. ఆ కుటుంబం మొత్తానికి రుణమాఫీ అమలు కాదు. దీనిపై రైతులు ప్రశ్నించడానికి కూడా వీలులేదు. ఎందుకంటే ఆ రైతే అన్ని వివరాలను ఫారంలో రాసి సంతకం పెట్టారు కాబట్టి. ఈ విధంగా సర్వే ద్వారా రుణమాఫీ కాకపోతే రైతులు గోల చేయకుండా, ప్రభుత్వాన్ని నిందించకుండా వారి చేతులు వారిపైనే పెట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదనే విమర్శలొస్తున్నాయి. రుణమాఫీ కాని రైతులు ప్రశ్నించకుండా వాళ్లనే బాధ్యుల్ని చేసే వ్యూహాన్ని ప్రభుత్వం అనుసరిస్తున్నదని రైతు సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

సీఎం చెప్పిన లెక్కకు చేస్తున్న లెక్కల్లో తేడా

రుణమాఫీకి సంబంధించి రేషన్‌కార్డు లేని రైతుల లెక్కలోనూ ప్రభుత్వం కోతలు పెడుతున్నది. మొదట సీఎం చెప్పిన లెక్కకు, ఇప్పుడు కుటుంబ నిర్ధారణ చేస్తున్న లెక్కకు పొంతన లేకపోవడంతో రైతు సంఘాలు అనుమానం వ్యక్తంచేస్తున్నాయి. మొదటి విడత రుణమాఫీ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రేషన్‌కార్డు లేని 6.36 లక్షల మందికి తర్వాత కుటుంబ నిర్ధారణ చేసి రుణమాఫీ చేస్తామని వెల్లడించారు. కానీ ప్రభుత్వం ప్రస్తుతం చేస్తున్న కుటుంబ సర్వేలో 4.24 లక్షల మంది రైతులను మాత్రమే చూపిస్తుండటం అనుమానాలకు తావిస్తున్నది. సీఎం చెప్పిన లెక్కకు ప్రస్తుతం సర్వే చేస్తున్న లెక్కతో పోల్చితే 2.12 లక్షల మంది రైతుల పేర్లు గల్లంతయ్యాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరంతా ఎక్కడకు పోయారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ 4.24 లక్షల మందిలో కూడా ఇంకెంత మందికి కోత పెడతారోననే చర్చ జరుగుతున్నది.

గురుకుల విద్యార్థులను కరిచిన ఎలుకలు

నల్లగొండ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి

దేవరకొండరూరల్, ఆగస్టు 28: నల్లగొండ జిల్లాలోని గురుకుల వసతి గృహ విద్యార్థులను ఎలుకలు భయపెడుతున్నాయి. నాలుగు నెలల క్రితం డిండి బీసీ గురుకుల బాలిక వసతి గృహ విద్యార్థినులు ముగ్గురిని ఎలుకలు కొరకగా.. తాజాగా మరో ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దేవరకొండ మండలం కొండభీమనపల్లి శివారులో గల ఖాదర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న బీసీ గురుకుల బాలుర పాఠశాలలో నిద్రిస్తున్న 13 మంది విద్యార్థులను సోమవారం రాత్రి ఎలుకలు కరిచాయి. ఈ విషయాన్ని నిర్వాహకులు గోప్యంగా ఉంచారు. ఎలుకలు కరిచిన విషయాన్ని విద్యార్థులు.. ఉపాధ్యాయుడు, హెల్త్ సూపర్‌వైజర్‌కు చెప్పడంతో దగ్గరలో ఉన్న తూర్పుపల్లి పీహెచ్‌సీలో వైద్యం చేయించారు. ఆ విద్యార్థులకు ఏఆర్‌వీ ఇంజక్షన్ ఇచ్చినట్టు తల్లిదండ్రులు తెలిపారు. వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా లేక ఎలుకలు విపరీతంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

ఎట్టకేలకు వైద్యశాఖలో చలనం!

- సీజనల్ వ్యాధులపై వైద్యాధికారుల క్షేత్రస్థాయి పర్యటన
- విపక్షం హెచ్చరికలు.. సీఎం వార్నింగ్ తర్వాత కదలిక



ఉస్మానియా దవాఖానను సందర్శిస్తున్న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్, దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్ తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వైద్యారోగ్యశాఖలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సీజనల్ వ్యాధులు విజృంభించినా పట్టించుకోని ఉన్నతాధికారులు సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరికతో మేల్కొన్నారు. ‘ప్రజల ఆరోగ్య పరిరక్షణను పట్టించుకోని అధికారులను సస్పెండ్ చేస్తామని’ సీఎం చెప్పడంతో హడావుడిగా దవాఖానల్లో పర్యటించి సదుపాయాలపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడి సమీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రారంభంకాగానే ఈ పని చేసి ఉంటే.. పరిస్థితి ఈ స్థాయిలో ఉండేదికాదని వైద్య నిపుణులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. డెంగ్యూ, చికున్ గున్యా, విష జ్వరాలు ప్రబలుతున్నాయని, దవాఖానల్లో పడకలు, సిబ్బంది, మందులు సరిపోవడంలేదని వైద్య సిబ్బంది ఎంత మొత్తుకున్నా ఇన్నాళ్లూ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సీజనల్ వ్యాధుల కట్టడికి సరైన కార్యాచరణ రూపొందించి, అమలు చేయడంలో విఫలం అయ్యారని వైద్యవర్గాలే పేర్కొంటున్నాయి. విషజ్వరాలు విజృంభణపై మీడియాలో వరుస కథనాలు వచ్చినా ఫలితం కనిపించలేదు. పరిస్థితి అదుపు తప్పడంతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని, పట్టణాలు, గ్రామాల్లో ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్యాధికారుల నిర్లక్ష్యాన్ని ప్రస్తావిస్తూ.. ‘పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం చేపట్టే చర్యలపై ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేస్తాం’ అని హెచ్చరించారు. దీంతో హుటాహుటిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అయితే.. సీజనల్ వ్యాధుల యాక్షన్ ప్లాన్‌కు నేతృత్వం వహించాల్సిన డీపీహెచ్ ఈ సమీక్షలో లేకపోవడం గమనార్హం. మంత్రి ఆదేశాల మేరకు వైద్యశాఖ ఉన్నతాధికారులు బుధవారం వివిధ దవాఖానలను పరిశీలించాలని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం డీపీహెచ్ రవీందర్ నాయక్ ఉస్మానియా దవాఖానకు, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్ గాంధీ దవాఖానకు, డీఎంఈ వాణి కోఠి జిల్లా దవాఖానకు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఫీవర్ హాస్పిటల్‌ను సందర్శించారు. జ్వర కేసుల నమోదుపై ఆరా తీసి, దవాఖానల్లో వసతులు, పరికరాలు, మందుల నిల్వ వంటివి అడిగి తెలుసుకున్నారు. గురువారం హైదరాబాద్ శివారులోని దవాఖానల్లో వారు పర్యటించనున్నారు.

దవాఖానల్లో సరిపడా మందులున్నాయి

‘నమస్తే తెలంగాణ’ కథనానికి టీజీఎంఎస్ఐడీసీ ఎండీ వివరణ

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల్లో సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యారోగ్యశాఖ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా జ్వరాల పరిస్థితి, దవాఖానల్లో మందుల కొరతపై ‘నమస్తే తెలంగాణ’లో మంగళవారం ప్రచురితమైన ‘ఇంటికి ఇద్దరికి విషజ్వరం’ కథనానికి టీజీఎంఎస్ఐడీసీ ఎండీ స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ మెడిసిన్ స్టోర్లలో(సీఎంఎస్) తగినన్ని ఔషధాలు నిల్వ ఉన్నట్టు తెలిపారు. నిత్యం దవాఖానలకు సరఫరా అవుతున్నట్టు వెల్లడించారు. డీఎంఈ, టీవీవీపీ పరిధిలోని దవాఖానలు కూడా సొంత నిధులతో కొన్ని రకాల ఔషధాలు కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. ఔషధాల సరఫరాదారులకు రూ.600 కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయనడం కూడా సరికాదని చెప్పారు. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటివరకు రూ.213 కోట్ల బిల్లులు చెల్లించినట్టు స్పష్టంచేశారు.

జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని ఏర్పాటు చేయనుంది. బుధవారం ఢిల్లీలో ప్రధాన మంత్రి మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ(సీసీఈఏ) ఇం దుకు ఆమో దం తెలిపింది. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రూ.28,602 కోట్ల తో దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీలను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా రూ.2,361 కోట్లతో జహీరాబాద్‌లో పారి శ్రామిక స్మార్ట్ సిటీ ఏర్పాటు కానుంది. . రెండు దశల్లో దాదాపు 12,500 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు విస్తరించనుంది.

కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలు

- రూ.6,456 కోట్ల వ్యయంతో ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్‌లో రెండు కొత్త రైల్వే లైన్లు, ఒక మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టు
- ప్రైవేటు ఎఫ్‌ఎం రేడియో ఫేజ్-3 పాలసీలో భాగంగా 234 కొత్త నగరాల్లో 730 ఎఫ్‌ఎం చానళ్ల కోసం ఈ-వేలం నిర్వహణ
- ఈశాన్య రాష్ట్రాల్లో రూ.4,136 కోట్లతో 15,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జలవిద్యుత్తు కేంద్రాల నిర్మాణం



ఆదిలాబాద్‌లో ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కలెక్టరేట్ల ఎదుట ఉద్యోగుల నిరసన దీక్ష

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రెగ్యులర్‌తోపాటు మినిమం టైంస్కేల్ అమలుచేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులు భారీ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ల ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. సిద్దిపేటలోని నిరసన దీక్షలో పాల్గొన్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి మాట్లాడుతూ.. నిరుడు సెప్టెంబర్‌లో హనుమకొండలో సమ్మె చేస్తున్న సందర్భంగా టీపీసీసీ హోదాలో రేవంత్‌రెడ్డి తమ వద్దకు వచ్చి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 30 రోజుల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, బేసిక్ పే అమలు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. నాడు ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలకాలంలో అనేకసార్లు కలిసి న్యాయం చేయాలని వినతిపత్రాలు ఇచ్చినా స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికే 169 మంది ఉద్యోగులు వివిధ కారణాలతో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు.



విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జాక్ నేతలు

ఎస్జీటీలకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలి

ఉపాధ్యాయ జేఏసీ నేతల వినతి

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న, విద్యాపరంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డికి జాక్ నేతలు వినతిపత్రం సమర్పించారు. బీఈడీ/డీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్లుగా ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలకు పదివేల పీఎస్ హెడ్ మాస్టర్ పోస్టులను మంజూరు చేయాలని విన్నవించారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు, స్కావెంజర్లను నియమించాలని డిమాండ్ చేశారు. పదోన్నతి పొందకుండా మిగిలిపోయిన 600 మంది పండితులను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. మాడల్ స్కూళ్లలో ఔట్ సోర్సింగ్ ఫిజికల్ డైరెక్టర్లను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

• తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



మూడు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. రాస్తారోకో చేశారు. – రామారెడ్డి

• ఎస్సారెస్పీ కాల్వకు నీరివ్వాలని ఆందోళన



ఎస్సారెస్పీ కాల్వ ద్వారా సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మెగ్గయ్యగూడెం శివారులోని ఎస్సారెస్పీ కాలువ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు. – చివ్వెంల

లైంగిక దాడి కేసులో 20 ఏండ్ల జైలు

బాలిక కుటుంబానికి 10 లక్షల పరిహారం

దేశంలోనే అత్యధిక జరిమానా

వరంగల్ లీగల్, ఆగస్టు 28: రెండోతరగతి చదువుతున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడిన దుండగుడికి 20 ఏండ్ల కఠిన కారాగార శిక్ష, 20 వేల జరిమానా విధిస్తూ వరంగల్‌లోని ప్రత్యేక పోక్సో కోర్టు బుధవారం తీర్పు ప్రకటించింది. పోక్సో చట్టం కింద ఈ కేసులో బాధిత కుటుంబానికి ప్రభుత్వమే రూ.10 లక్షలను పరిహారంగా అందజేయాలని తీర్పు ప్రకటించి దేశంలో అత్యధిక పరిహారాన్ని ప్రకటించిన న్యాయమూర్తిగా మనీషా శ్రావణ్ నిలిచినట్టు పీపీ మోకీల సత్యనారాయణ తెలిపారు. రామన్నపేట పరిసరాల్లో 2019 ఫిబ్రవరి 5న చర్చికి వెళ్లిన ఏడేండ్ల చిన్నారిపై ఓ వ్యక్తి చాక్లెట్ కొనిస్తానని లైంగిక దాడికి పాల్పడ్డాడు. నేరం రుజువైందని భావించిన న్యాయస్థానం నిందితుడు ప్రభుచరణ్‌కు 20 ఏండ్ల జైలు శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

• యూరియా కోసం డీలర్ల నిరసన



మార్క్‌ఫెడ్ నుంచి తమకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జనగామ కలెక్టరేట్ ఎదుట ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీలర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పజ్జూరి గోపయ్య, సీహెచ్ సదానందం తదితరులు పాల్గొన్నారు. – జనగామ చౌరస్తా

• 6 వేల పింఛన్ కోసం దివ్యాంగుల ధర్నా



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని, తమ సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.-ఎదులాపురం

కరెంట్ షాక్‌తో చిరుత మృత్యువాత

కామారెడ్డి జిల్లాలో ఘటన

ఎల్లారెడ్డి, ఆగస్టు 28: అడవి పందుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్తు కంచెకు తగిలి ఓ చిరుత కరెంట్‌షాక్‌తో మృత్యువాత పడింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ పంచాయతీ పరిధిలోని కట్టకింది తండాలో మంగళవారం చోటు చేసుకొన్నది. అయితే సదరు రైతు దూప్య విషయం బయటకు రాకుండా తన పొలంలోనే చిరుత కళేబరాన్ని పాతిపెట్టాడు. విషయం తెలుసుకున్న అటవీ, పోలీస్ అధికారులు బుధవారం అక్కడికి వెళ్లి చిరుత కళేబరాన్ని వెలికితీశారు. సుమారు రెండేండ్ల వయస్సు ఉన్న ఆడ చిరుతగా గుర్తించారు. అక్కడే పశువైద్యాధికారి రవికుమార్ పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం అటవీ ప్రాంతంలో దహనం చేశారు. కేసు నమోదు చేసి రైతు దూప్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఫారెస్టు అధికారి ఓంకార్ తెలిపారు.

బంగాళా వావ్ వావ్

ఆలూ కుర్మా పూరీలోకి అదిరిపోతుంది. ఆలూ ఫ్రై అన్నిటికీ సరిపోతుంది. పాకశాస్త్రంలో పేరెన్నికగన్న ఈ దుంపకు అందాన్ని పెంపొందించే గుణం ఉంది. ముఖంపై మచ్చలను, మొటిమలను ఆలూ చేత్తో తీసేసినట్టు తొలగించేస్తుంది. అప్పుడు బంగాళా వావ్ వావ్ అని అనకుండా ఉండలేం!

ఆలూలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి దురద, అలర్జీలను దూరం చేస్తాయి. ఇందులో ఉండే పొటాషియం, మాంగనీస్, ఫైబర్, విటమిన్ బి, సి చర్మంపై ట్యాన్‌ని తొలగిస్తాయి. ఆలూ రసంలో కాటన్ బాల్స్‌తో అద్దుకొని.. ముఖంపై పది నిమిషాలపాటు మర్దనా చేయాలి. 20 నిమిషాలాగి గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. దీనివల్ల హైపర్ పిగ్మెంటేషన్ నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఆలుగడ్డలో ఉండే విటమిన్లు, మినరల్స్, పొటాషియం శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఆలూ ఫేస్‌ప్యాక్ వల్ల ముఖంపై మొటిమలు, మచ్చలు మాయమవుతాయి. వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల చర్మ సంబంధిత సమస్యలు తగ్గుముఖం పడతాయి.

అయితే బంగాళదుంప రసాన్ని ఉపయోగించడానికి ముందు.. ప్యాచ్ టెస్ట్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎలాంటి రియాక్షన్స్ లేకపోతే.. ముఖానికి అప్లయ్ చేసుకోవాలని చెబుతున్నారు.



కలిసి చేస్తే.. కలదు సుఖం

ఆలుమగల బంధం సమయంతో ముడిపడి ఉంటుంది. ఇద్దరూ ఎంత ఎక్కువ సమయం కలిసి గడిపితే.. ఆ బంధం అంత చిక్కగా తయారవుతుంది. ఇంటిపని, ఆఫీసు, పిల్లల పెంపకం, ఇతర బాధ్యతల కారణంగా.. దంపతులిద్దరూ ఓ గంటైనా కలిసి గడిపేందుకు వీలు చిక్కకపోవచ్చు. కానీ, ఏ పని చేసినా.. ఇద్దరూ కలిసి చేస్తే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. ఇంటిపని, వర్కవుట్లు, యోగా కలిసి సాధన చేస్తే... శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందం పొందవచ్చు. భాగస్వామితో కలిసి యోగా చేస్తే.. కలిగే యోగాలేంటో చూద్దాం..



- భాగస్వామితో యోగ సాధన ఇద్దరి మధ్య కమ్యూనికేషన్‌ను పెంచుతుంది. పార్ట్‌నర్ శరీర ధర్మాన్ని అర్థం చేసుకునే వీలు దొరుకుతుంది. అంతేకాదు, వివిధ ఆసనాల భంగిమలు.. పెండ్లినాటి తొలి రోజులను గుర్తుకుతెస్తాయి. ఆ మధుర క్షణాలు మళ్లీ మీ మధ్య చిలిపి సంభాషణలకు తెరదీస్తాయి.
- యోగాలో కొన్ని ఆసనాలకు పరస్పర సహకారం అవసరం అవుతుంది. ఈ క్రమంలో శారీరకంగా మరింత చనువు పెరుగుతుంది. దీని ప్రభావం మానసికంగా మీ మధ్య దూరాన్ని చెరిపేస్తుంది.
- యోగా, వాకింగ్ లాంటివి ఒంటరిగా చేస్తున్న క్రమంలో, కొన్నాళ్లకు బోరింగ్ అనిపిస్తుంది. వాయిదాలు మొదలవుతాయి. సాధన కుంటుపడొద్దంటే.. జంటగా యోగ సాధన ప్రారంభించి చూడండి.. ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా, ఇంకెప్పుడెప్పుడు ఆసనాలు వేద్దామా అన్న ఉత్సుకత కలుగుతుంది.
- ప్రతి ఉదయం ఇద్దరూ గడిపిన క్షణాలు.. ఆ రోజంతా మిమ్మల్ని ఫ్రెష్‌గా ఉంచుతాయి. సాధన కొనసాగే కొద్దీ.. ఇద్దరి శరీరాలు మేలైన ఆకృతి సంతరించుకుంటాయి. ఇది ఇద్దరి మధ్యా అనుబంధాన్ని ఇనుమడింపజేస్తుంది.



పదుల ఎకరాలు ఉన్న సంపన్న రైతు కుటుంబం. ఇంటి నిండా వచ్చేపోయే జనం. సందడి వాతావరణం. కాలం చేసిన గాయం.. ఆ కుటుంబాన్ని అతలాకుతలం చేసింది. ఇలాంటి ఒడుదొడుకుల్లో ప్రస్థానం మొదలుపెట్టిన యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇస్కిళ్ల గ్రామానికి చెందిన గుండా మధుసూదన్ ఇప్పుడు ఓ శక్తిగా ఎదిగారు. డాక్టర్ కావాలనుకున్న వ్యక్తి.. పరిస్థితులు తారుమారు కావడంతో బస్సు కండక్టర్ కొలువులో చేరారు. తర్వాత ఎల్ఐసీ అధికారిగా మారారు. ఆపై వ్యాపారిగా ఎదిగారు. తన ప్రతిభకు పట్టుదల జోడించి.. రియల్ రంగంలో ఎదిగారు. సుమధుర గ్రూప్ స్థాపించి.. దక్షిణాదిలోనే అత్యుత్తమ నిర్మాణ సంస్థగా దానిని నిలబెట్టారు. కోరుకున్న లక్ష్యాన్ని అందుకున్న తర్వాత.. సొంత ఊరు అభివృద్ధికి మధుసూదన్ పాటుపడుతున్న వైనం ఎందరికో ఆదర్శం.

ఇస్కిళ్ల శ్రీమంతుడు సుమధుర

పుట్టిన గడ్డరుణం తీర్చుకుంటున్న గుండా మధుసూదన్

నాలుగు పైసలు సంపాదిస్తే చాలు కన్నవారిని మర్చిపోతుంటారు చాలామంది. ఇక సొంత ఊరి చిరునామా గుర్తుంటుంది అంటే ఆశ్చర్యమే! ఇలాంటి రోజుల్లో కన్నవారి ఆశలను నెరవేర్చిన మధుసూదన్ సొంతూరు రుణం తీర్చుకుంటున్నారు. స్వగ్రామం బాగుకు సుమధుర ఫౌండేషన్ స్థాపించి కోట్లాది రూపాయలతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జీవితంలో పైకి ఎదగాలన్న పట్టుదలే





ఆయనను కండక్టర్ నుంచి కన్‌స్ట్రక్షన్ సామ్రాజ్యానికి అధినేతగా మార్చింది. చదువుకునే రోజుల్లో ట్యూషన్లు చెప్పేవారు. డాక్టర్ కావాలని కలలు కన్నారు. వెన్నుతట్టి ప్రోత్సహించిన తండ్రి మరణంతో.. ఆ కల నెరవేరలేదు. కుటుంబం బాగోగులు చూసుకుంటూనే డిగ్రీ చేశారు. అవే బాధ్యతలు అతణ్ని బస్సు కండక్టర్ ఉద్యోగంలో చేరేలా చేశాయి. 'ఇంకేం రైట్ రైట్..' అనుకుంటే ఆయన టికెట్లు ఇవ్వడం దగ్గరే ఆగిపోయేవారు. ఉన్నతంగా ఎదగాలన్న పట్టుదలతో ఎల్ఐసీలో ఉద్యోగం సంపాదించారు. పదోన్నతిపై సికింద్రాబాద్ డివిజన్ ఆఫీస్‌కు వచ్చారు. అలా మారుమూల ప్రాంతం నుంచి మహానగరం చేరుకున్న ఆయన ఆకాశమే హద్దుగా తన ఆలోచనలకు పదునుపెట్టారు.

ఎల్ఐసీ ఉద్యోగం చేస్తూనే సోదరునితో కలిసి మధుసూదన్ కొన్నాళ్లు కిరాణం షాపును నిర్వహించారు. అక్కాచెల్లెళ్ల పెండ్లిళ్లు చేశారు. ఆ సమయంలోనే తమకు ఉన్న 38 ఎకరాల వ్యవసాయ భూమిని, ఎకరా రూ.4వేల చొప్పున మొత్తం రూ.1.20 లక్షలకు విక్రయించాల్సి వచ్చింది. అప్పుడే మధుసూదన్ రియల్ రంగంలోకి ప్రవేశించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ రియల్ ఎస్టేట్ రంగంలో తనకంటూ ఓ స్థానం సాధించుకున్నారు. ఎంతో భద్రత ఉన్న ప్రభుత్వ ఉద్యోగాన్ని సైతం వదిలి ఉన్నతస్థాయికి ఎదగాలన్న ఆయన ఆలోచనకు ప్రతిరూపంగా నేడు సుమధుర సంస్థ నిలిచింది.

తనను ఆర్థికంగా ఉన్నతంగా నిలిపిన సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇవ్వాలనుకున్నారు మధుసూదన్. ఆర్థికంగా స్థిరపడిన తర్వాత తాను పుట్టిపెరిగిన, తన తల్లిదండ్రులు రాజమణి, సత్తయ్యను అక్కున చేర్చుకున్న సొంతూరు ఇస్కిళ్ల అభివృద్ధిపై దృష్టిసారించారు. సుమధుర ఫౌండేషన్ ద్వారా గ్రామానికి మెరుగులు దిద్దుతున్నారు. సుమారు రూ.2కోట్లు వెచ్చించి ఊళ్లో నూతన పాఠశాల భవనం కట్టించారు. 11వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, సకల సౌకర్యాలతో, ఆధునిక హంగులతో కార్పొరేట్ స్కూల్‌ను తలదన్నేలా బడిని నిర్మింపజేశారు. పాఠశాల ప్రాంగణంలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని కట్టించారు. బడిలో ముగ్గురు వలంటీర్లను, ముగ్గురు హౌస్‌కీపర్స్‌ను ఏర్పాటుచేసి ఫౌండేషన్ ద్వారా వారికి జీతభత్యాలు అందిస్తున్నారు.

ఇస్కిళ్లతోపాటు చుట్టుపక్కల పల్లెల్లోని మహిళల సాధికారత కోసం సుమధుర ఫౌండేషన్ కృతనిశ్చయంతో పనిచేస్తున్నది. ఇక్కడి మహిళలకు కంప్యూటర్, కుట్టుమిషిన్, మగ్గం వర్క్‌లో శిక్షణ ఇస్తున్నది. 40 మంది సభ్యులు రెండు బ్యాచ్‌లుగా ఆరు కోర్సుల్లో ట్రైనింగ్ పొందారు. వారికి వివిధ సంస్థల నుంచి ఆర్డర్లు ఇప్పించి.. ఉపాధి కూడా కల్పిస్తున్నారు మధుసూదన్. అంతేకాదు ఫౌండేషన్ ద్వారా గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఫ్లోరైడ్ బాధ ఉండకూడదని వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. నేరాల నియంత్రణకు గ్రామంలో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు పెట్టించారు. గ్రామంలో సభలు, సమావేశాలు జరుపుకొనేందుకు మీటింగ్ హాల్‌ను కట్టించారు. హైస్కూల్ చదువు కోసం ఇతర గ్రామాలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందజేశారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్ అందిస్తున్నారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంలో సుమధుర ఫౌండేషన్ కీలకంగా పనిచేస్తున్నది. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నది. ఇలా.. సొంతూరు బాగుకోసం అహరహం కృషి చేస్తున్న సుమధుర గ్రూప్ చైర్మన్ గుండా మధుసూదన్ అచ్చంగా రియల్ శ్రీమంతుడే!

... వర్దెల్లి బాపురావు

వాట్సాప్ కాల్ అదుర్స్

హాట్ ఫీచర్

దోస్తులతో, కుటుంబసభ్యులతో వీడియో కాల్స్ మాత్రమే కాదు.. ఆఫీస్ గ్రూప్ మీటింగ్‌లూ వాట్సాప్‌తోనే కానిచ్చేస్తున్నాం. రెగ్యులర్ వీడియో కాల్ చేసింది చాలు.. ఇక మీదట కాస్త వెరైటీగా ప్రయత్నించండి. ఇందుకోసం వాట్సాప్ వీడియో కాల్స్‌లో 'ఏఆర్' ఎఫెక్ట్‌లు తీసుకురానుంది. అగ్మెంటెడ్ రియాలిటీతో మీ వీడియో చాటింగ్ మరింత ఆకట్టుకునేలా మారనుంది. అదెలా అంటే.. మీ లుక్‌ని రియల్‌టైమ్‌లోనే మార్చేయొచ్చన్నమాట! అందుకు 'ఫేషియల్ ఫిల్టర్స్' ఆప్షన్స్ ఉంటాయి. వీడియో కాల్‌కి ముందు వాటిని అప్లయ్ చేయడం ద్వారా మీ స్కిన్ 'కలర్ టోన్' మార్చేయొచ్చు. మీరున్న లొకేషన్, చుట్టూ ఉన్న లైటింగ్‌కు తగినట్టుగా బ్యాక్‌గ్రౌండ్‌లో మార్పులు చేర్పులు చేయొచ్చు. 'బ్యాక్‌గ్రౌండ్ ఎడిటింగ్ టూల్'తో మీ వెనకున్న సీన్ మొత్తాన్నీ మార్చేయొచ్చు! ఉదాహరణకు ఇంట్లో ఉన్నప్పుడు ఆఫీస్ మీటింగ్ కాల్ వచ్చిందే అనుకోండి! అప్పుడు ఆఫీస్ వాతావరణాన్ని ప్రతిబింబించేలా బ్యాక్‌గ్రౌండ్ సెట్ చేసుకోవచ్చు. ఫ్రెండ్స్‌కు సరదాగా కాల్ చేసినప్పుడు.. బీచ్‌లో ఉన్నట్టు బ్యాక్‌గ్రౌండ్‌ను పెట్టుకునే వీలుంది. వీటిని 'ప్రీసెట్ బ్యాక్‌గ్రౌండ్స్'గా పిలుస్తున్నారు. అవన్నీ ఎందుకులే అనుకుంటే.. ఉన్న బ్యాక్‌గ్రౌండ్‌ని బ్లర్ చేసేయొచ్చు. తక్కువ వెలుతురు ఉన్నట్టయితే.. 'లోలైట్ మోడ్'ని సెలెక్ట్ చేసుకొని లైటింగ్ అడ్జెస్ట్ చేసుకునే వీలుంది. చివరిగా కాస్త మేకప్ టచ్ అప్ ఇద్దాం అనుకున్నప్పుడు.. 'టచ్ అప్ మోడ్' ఎంచుకుంటే సరి! ఇక వాట్సాప్ కాల్‌లో మీ అందం రెట్టింపవడం ఖాయం. ఇవన్నీ ఎప్పటికప్పుడు మార్చుకోవాల్సిన అవసరం లేదు! 'ప్రీవియస్ సెట్టింగ్స్'ని వాట్సాప్ గుర్తుపెట్టుకుంటుంది. వీడియో కాల్ రాగానే.. ఆటోమేటిక్‌గా సెట్టింగ్స్ సెట్ అయిపోతాయి. యాపిల్ యూజర్లకు ఈ ఫీచర్ బీటా వెర్షన్‌లో అందుబాటులోకి వచ్చింది.

ఆరోగ్య రహస్యాలు చాలా చదువుతుంటాం. కానీ రహస్యమైన ప్రదేశాల ఆరోగ్యం మాత్రం అస్సలు పట్టించుకోం. ముఖ్యంగా ఆడవారు ఇలాంటి విషయాలను తమలో తాము చర్చించుకోవడానికి కూడా ఇష్టపడరు. కానీ చక్కని ఆరోగ్యానికి, సుఖకరమైన జీవనానికి వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరం. మనం ఆ విషయంలో ఎంత శ్రద్ధపెడితే, అంత హాయిగా ఉండొచ్చు. నేటి జీవనశైలి, మారుతున్న వస్త్రధారణ ఆడపిల్లలకు రకరకాల ఇబ్బందుల్ని తెచ్చిపెడుతున్నాయి. వాటి గురించి అవగాహన తెచ్చుకుని, అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటే రహస్యంగా బాధపడాల్సిన విషయాలేమీ ఉండవు.



డాక్టర్ పి. బాలాంబ

సీనియర్ గైనకాలజిస్ట్




రహస్యమే.. కానీ అత్యవసరం!

టైట్...'మిస్'ఫిట్!

ఇటీవలి కాలంలో ఆడపిల్లలు బిగుతైన బట్టలు వేసుకుంటున్నారు. ముఖ్యంగా జీన్స్, లెగ్గింగ్‌ల లాంటివి కాలి నుంచి నడుము భాగం దాకా ఎక్కడికక్కడ పట్టేసి ఉంటున్నాయి. ఇవి వ్యక్తిగత భాగాల ఆరోగ్యం మీద దుష్ప్రభావాన్ని చూపుతాయి. చల్లటి వాతావరణం ఉండే పడమర దేశాల వాళ్లు శరీర ఉష్ణోగ్రతను కాపాడుకోవడం కోసం ఇలా మందంగా, బిగుతుగా ఉండే దుస్తులను వేసుకుంటారు. కానీ మనది ఉష్ణదేశం. ఇక్కడ వేడి వాతావరణం ఉంటుంది. శరీరానికి గాలి ఆడేలా పల్చగా, వదులుగా ఉండే బట్టలు వేసుకోవాలి. ముఖ్యంగా స్త్రీల జననాంగాలు సహజంగా తడిగా ఉంటాయి. కాబట్టి అక్కడ కాస్త పొడిగా ఉంచేందుకు సాయపడేలా వదులైన దుస్తులు వేసుకోవాలి. మన చీరకట్టు వెనక రహస్యం అదే. అయితే ఇటీవల చీర కట్టుకునే వారూ బిగుతైన లోదుస్తులు ధరిస్తున్నారు. దీనివల్ల నష్టమే తప్ప లాభమేం లేదు.

లోదుస్తులు కూడా వదులైనవే ఎంచుకోవాలి. నూలుతో చేసిన వాటిని ధరించాలి. రోజూ రెండుపూటలా వాటిని మార్చుకోవాలి. నిజానికి రాత్రి పూట లోదుస్తులు ధరించకుండా వదిలేయడం మంచిది. దానివల్ల తడిపొడిగా ఉండే వ్యక్తిగత భాగాలకు కొంచెం గాలి తగులుతుంది. తద్వారా ఇన్ఫెక్షన్ల బారినపడకుండా ఉండొచ్చు. ఇటీవల ఇన్ఫెక్షన్ల కారణంగా డాక్టర్ల దగ్గరికి వస్తున్న ఆడపిల్లల సంఖ్య నానాటికీ అధికం అవుతున్నది.

వేడిని శోషించుకునేలా నలుపు, నీలంలాంటి ముదురు రంగుల ప్యాంట్లు ఎక్కువగా ధరించవద్దు. అలాగే లోదుస్తులూ లేత రంగులే వేసుకోవాలి. ఇది కూడా వ్యక్తిగత భాగాల సంరక్షణలో భాగంగానే పరిగణించాలి.



రోజూ శుభ్రంగా...

ఈ మధ్యకాలంలో తామరలాంటి ఇన్ఫెక్షన్లతో వస్తున్న అమ్మాయిల సంఖ్య ఎక్కువగా ఉంటున్నది. వ్యక్తిగత భాగాలతోపాటు, పిరుదుల దగ్గర కూడా వచ్చే ఈ ఇన్ఫెక్షన్లు తీవ్రంగా ఇబ్బంది పెడతాయి. పక్కవారి దుస్తులు ధరించడం వల్ల ఎక్కువగా ఇలాంటి వ్యాధులు సోకుతాయి. కాబట్టి ఎవరి బట్టలు వాళ్లే వేసుకోవడం, రోజూ స్నానం చేయడం ముఖ్యం. అలాగే హాస్టళ్లలో ఉండేవాళ్లయితే అండర్‌వేర్ లాంటివి ఆరేసేటప్పుడు ఎవరికి వాళ్లు ప్రత్యేకంగా, విడిగా ఆరబెట్టుకోవాలి. అప్పుడు ఒకరినుంచి ఒకరికి ఇన్ఫెక్షన్లు సోకకుండా చూసుకోవచ్చు. అలాగే ఇలాంటి సందర్భాల్లో నేరుగా మెడికల్ షాప్‌కి వెళ్లి తెచ్చుకొని క్రీములు వాడుతున్నారు. వాటిలో స్టెరాయిడ్లు ఉంటున్నాయి. దీనివల్ల అప్పటికప్పుడు తగ్గినా తర్వాత అది మందులకు లొంగకుండా తయారవుతుంది.

పిల్లలు భద్రం

చిన్నపిల్లలు... అంటే ఇంకా రజస్వల కాని పిల్లలు... జననేంద్రియాల్లో దురద ఉంది అంటూ వస్తున్నారు. అలాంటి ఇబ్బందులు ఏం ఉన్నా... తప్పకుండా జాగ్రత్త తీసుకోవాలి. వాళ్ల మీద ఏదైనా లైంగిక వేధింపులు జరుగుతున్నాయా అని గమనించాలి. అవసరమైతే ముందు డాక్టర్ దగ్గరికి వెళ్లాలి. బస్సుల్లో అయినా సరే స్కూల్‌కి పంపేటప్పుడు ఆడవాళ్లు అటెండర్‌గా ఉండేవి ఎంచుకుంటే మంచిది.

చిన్నపిల్లలకు కూడా వదులుగా ఉండే లోదుస్తులే వేయాలి. అలాగే ఉదయం స్నానం చేయించాక వేయడంతోపాటు, బడి నుంచి ఇంటికి రాగానే వాటిని మార్చాలి. రాత్రి పూట అసలు వేయకపోవడం మంచిది. ఆ సమయంలో పైజామాల్లాంటి కాటన్ బట్టలు వేయొచ్చు.

అలాగే ఆడపిల్లలు, మహిళలు అందరిలో ప్యాంటీల మీద మరకలు కనిపించడం సహజమే. జననేంద్రియాలు ఆమ్ల స్వభావాన్ని కలిగి ఉంటాయి కనుక ఆ కారణంగా ఈ ప్రాంతంలో ప్యాంటీల రంగు పోతుంది. కనుక ఇలా మరకలు కనిపించడం అన్నది ఆరోగ్యంగా ఉన్నారన్నదానికి చిహ్నమే. కాబట్టి ఈ విషయంలో భయపడనక్కర్లేదు.



రోజూ స్నానం చేయడం, రోజుకు రెండుసార్లు కనీసం లోదుస్తులు మార్చుకోవడం అత్యవసరం.

మూత్రానికి వెళ్లినా శుభ్రంగా నీటితో కడుక్కోవాలి. మల విసర్జన తర్వాత ముందు నుంచి వెనకకు నీళ్లతో శుభ్రపరచుకోవాలి. వెనక నుంచి ముందుకు కడగడం వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది.

వెస్ట్రన్ టాయిలెట్లు వాడటం వల్ల కూడా ఇన్ఫెక్షన్ల ప్రమాదం ఎక్కువ. కాబట్టి ఈ టాయిలెట్ వాడాక ప్రతి ఒక్కరూ కమోడ్‌పై భాగాన్ని టిష్యూతో శుభ్రం చేయాలి. చేతులు కడుక్కోవాలి. చాలామంది వెస్ట్రన్ టాయిలెట్ల విషయంలో ఇది పాటించరు. ఇక, పబ్లిక్ టాయిలెట్ల సంగతి చెప్పనే అక్కర్లేదు.



ఇటీవల వెజైనల్ వాష్‌ల పేరుతో జననాంగాలను శుభ్రపరచుకునేందుకు ప్రత్యేక ద్రవాలు వస్తున్నాయి. సాధారణంగా జననాంగం ఆమ్ల స్వభావాన్ని కలిగి ఉంటుంది. ఇది ఇన్ఫెక్షన్లను దరిచేరనీయకుండా కాపాడుతుంది. కానీ క్షార స్వభావం ఉండే ఈ వాష్‌లు వాడటం వల్ల దాని ఆమ్ల స్వభావం దెబ్బతింటుంది. ఆ ప్రాంతం పొడిబారిపోతుంది. ఇది చాలా ప్రమాదకరం. అక్కడ జిగురు పదార్థం లేకుండా పొడిబారడం వల్ల కలయిక కూడా ఇబ్బందిగా మారుతుంది. కనుక, జననేంద్రియాల బయటి ప్రాంతాన్ని రోజులో ఒక్కసారి సబ్బుతో కడిగితే చాలు. లోపలంతా శరీరమే స్వయంగా శుభ్రపరచుకుంటుంది.




అనవసరంగా యోని ప్రాంతాన్ని అతిగా శుభ్రపరచడం అన్నది ఇన్ఫెక్షన్లకు దారితీస్తున్న ఒక ముఖ్య కారణం. అతిగా కడగడం వల్ల అది దాని సహజ స్వభావాన్ని కోల్పోతుంది.

నెలసరి జాగ్రత్త

నెలసరి సమయంలోనూ వ్యక్తిగత భాగాల పరిశుభ్రత చాలా అవసరం. ప్యాడ్‌లు మార్చుకునే ముందు, ఆ తర్వాత రెండు సార్లూ సబ్బుతో చేతుల్ని శుభ్రపరచుకోవాలి.

ప్యాడ్ లేదా నాప్‌కిన్ మొత్తం తడిసిపోయేదాకా ఆగకూడదు. మోస్తరు స్రావం అవ్వగానే మార్చుకోవాలి. సాధారణ స్రావం అయ్యేవాళ్లు రోజుల్లో మూడు సార్లు (ప్రతి ఏడెనిమిది గంటలకు ఒక సారి) మార్చుకుంటే సరిపోతుంది. కొందరు శుభ్రత పేరుతో రెండు గంటలకోసారి మారుస్తూ ఉంటారు. తీవ్ర రక్తస్రావం అయ్యేవారిలో మినహా అది అనవసరం. పైగా పర్యావరణానికి హాని కూడా. మెన్‌స్ట్రువల్ కప్ వాడినా స్రావాన్ని బట్టి నాలుగు నుంచి ఎనిమిది గంటల మధ్యలో దాన్ని ఖాళీ చేసి శుభ్రపరచుకోవాలి.



ఆ సమయంలో...

కలయిక ముందు .. లేదా కలిశాక ఆ భాగాలను శుభ్రపరచుకోవాలన్న నియమమేం లేదు. వీలైతే రోజుకు రెండు సార్లు సాధారణంగా స్నానం చేసి శుభ్రంగా ఉంటే చాలు.

షుగర్ వ్యాధి ఉన్నవాళ్లలో రక్తంలో చక్కెర స్థాయులు అదుపు తప్పినప్పుడు వ్యక్తిగత భాగాల్లో ఫంగల్ ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి. భర్తకు ఉంటే భార్యకు, భార్యకు ఉంటే భర్తకు ఇవి సంక్రమిస్తుంటాయి. నిజానికి మగవాళ్లతో పోలిస్తే స్త్రీలలో ఆ భాగపు చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. కాబట్టి వీళ్లకే ఎక్కువగా ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి. అలాంటి సందర్భాల్లో కండోమ్‌లాంటివి వాడటం మంచిది. అయితే ఆడవాళ్లలో కనిపించే చాలా రకాలు రీప్రొడక్టివ్ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లే. కొంతమంది వాటిని సుఖవ్యాధులుగా పొరబడుతుంటారు. అది నిజం కాదు. అసలు ఆ సమస్య ఏమిటన్నది తప్పకుండా డాక్టర్‌ని సంప్రదించి తెలుసుకొని సరైన మందులు వాడాలి.

జహీరాబాద్‌కు ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ

- ఎన్‌ఐసీడీపీ కింద కేంద్రం మంజూరు
- 1.74 లక్షల మందికి ఉపాధి కల్పన
- దేశవ్యాప్తంగా 12 కేటాయింపు ›10
- కేంద్ర క్యాబినెట్ ఆమోదం

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

నిపుణ Guide to Excellence — పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

గురువారం THURSDAY 29.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 85 ‖ వెల (Price) రూ.6.50 | ఏకాదశి

గురువారం, సూర్యోదయం: 6-02, సూర్యాస్తమయం: 6-32. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: ఏకాదశి రాత్రి 1-38 వరకు. నక్షత్రం: ఆరుద్ర సాయంత్రం 4-40 వరకు. వర్జ్యం: తెల్లవారుజామున 5-18 నుంచి మర్నాడు ఉదయం 6-59 వరకు. రాహుకాలం: పగలు 1-50 నుంచి పగలు 3-23 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-12 నుంచి ఉదయం 11-01 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-11 నుంచి సాయంత్రం 4-01 వరకు. అమృతకాలం: ఉదయం 6-20 నుంచి ఉదయం 7-59 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

అవి సాక్ష్యాలు కానేకావు!



విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

- ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియాకు బెయిల్ మంజూరు చేస్తూ మేము 'బెయిల్ అనేది నియమం.. జైలు అనేది మినహాయింపు' అనే సిద్ధాంతాన్ని ఉటంకించాం. పీఎంఎల్‌ఏ సెక్షన్ కింద ఈడీ నమోదు చేసే మనీలాండరింగ్ కేసుల్లోనూ ఈ నియమం వర్తిస్తుంది.
- వ్యక్తి స్వేచ్ఛ అనేది ఎప్పటికీ ఒక నియమమే. దాన్ని కోల్పోవడం అనేది మినహాయింపుగానే ఉండాలి. ఆ స్వేచ్ఛను కోల్పోవాల్సి వస్తే.. అది చట్టబద్ధంగానే జరుగాలి.
- పీఎంఎల్‌ఏ కేసుల్లో 2 నిబంధనలను (ట్విన్ టెస్టులు) సంతృప్తిపరిస్తే బెయిల్ ఇవ్వొచ్చు. (నిందితుడు నేరం చేయలేదు. బెయిల్ ఇచ్చినా నేరం చేసే అవకాశం లేదు)
- కస్టడీలో ఉన్నప్పుడు సాధారణంగా అధికారులు నిందితుల నుంచి వాంగ్మూలాల్ని తీసుకుంటారు. అందులో కొన్ని ఇతరులపై చేసే నేరారోపణలుగా ఉంటాయి. అలాంటి సందర్భాల్లో వాటిని సాక్ష్యంగా పరిగణించి కేసులు నమోదు చేయడం సరికాదు.
- వాటిని సాక్ష్యాధారాలుగా ఆమోదిస్తే, అది న్యాయ నిబంధనలకు విరుద్ధమే అవుతుంది.

కస్టడీలోని నిందితులు ఇచ్చే నేరారోపణ వాంగ్మూలాలను ఎవిడెన్స్‌గా తీసుకోవద్దు

వాటిని ఆధారాలుగా కోర్టులు పరిగణించొద్దు

పీఎంఎల్‌ఏ కేసుల్లో సుప్రీంకోర్టు కీలక తీర్పు

ఈడీ కేసులకూ 'బెయిల్ రూల్': ధర్మాసనం

తాజా తీర్పుతో 'ఢిల్లీ మద్యం పాలసీ కేసు' నీరుగారినట్టే అంటున్న న్యాయ నిపుణులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదుచేసే మనీలాండరింగ్ కేసుల్లోనూ (పీఎంఎల్‌ఏ కేసులు) 'బెయిల్ నియమం' వర్తిస్తుందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. కస్టడీ సమయంలో నిందితులు చేసే నేరారోపణలు సాక్ష్యాలు కాబోవని, ఎట్టిపరిస్థితుల్లో వాటిని కీలక ఆధారాలుగా పరిగణించి కేసులు నమోదు చేయవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు అక్రమ మైనింగ్‌కు సంబంధించిన కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ సన్నిహితుడు ప్రేమ్ ప్రకాశ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. కస్టడీలోని నిందితులు ఇచ్చే నేరారోపణల వాంగ్మూలాలు సాక్ష్యాలుగా చెల్లవంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పడంతో 'ఢిల్లీ మద్యం పాలసీ' కేసు మొత్తంగా నీరుగారిపోయినట్టేనని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మద్యం ›7వ పేజీలో



శంషాబాద్ విమానాశ్రయం వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న కవిత





బెయిల్ అనంతరం బుధవారం బంజారాహిల్స్‌లోని ఇంటికి చేరుకున్న కుమార్తె కవితను హత్తుకుని భావోద్వేగానికి గురైన తల్లి శోభమ్మ. రాఖీ పౌర్ణమి రోజున జైలులో ఉన్న కారణంగా సోదరుడు కేటీఆర్‌కు రాఖీ కట్టలేకపోయిన కవిత.. ఇంటికి చేరుకోగానే రాఖీ కట్టారు. కేటీఆర్ ఈ ఫొటోను ఎక్స్‌లో షేర్ చేస్తూ రాఖీ వేడుకలకు ఇప్పుడు పరిపూర్ణత లభించిందని పేర్కొన్నారు.

పోరాటం ఆగదు

ఏ తప్పూ చేయకున్నా రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే నాపై కేసు పెట్టారు. ఈ విషయం అందరికీ తెలుసు. నా విడుదల కోసం వేచి చూసిన తెలంగాణ సమాజానికి వినమ్రంగా చేతులెత్తి నమస్కరిస్తున్నా. అంతిమ విజయం సాధించే దాకా పోరాడతా. ప్రజాక్షేత్రంలో మరింత బలంగా పనిచేస్తా.

- కల్వకుంట్ల కవిత

ఉద్దేశపూర్వకంగా నాపై కేసులు.. నిజం నిలకడగా తెలుస్తుంది

కేసీఆర్ నాయకత్వంలో ఇంకా బలంగా పనిచేస్తా: కవిత

కవితకు స్వాగతం పలికిన బీఆర్‌ఎస్ శ్రేణులు, జాగృతి నేతలు

ఎయిర్‌పోర్టు, ఇంటివద్దకు తరలివచ్చిన నేతలు, అభిమానులు

తల్లికి పాదాభివందనం చేసి, అన్నకు రాఖీ కట్టి.. భావోద్వేగం

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా తనపై ఉద్దేశపూర్వకంగా మోపిన కేసులో కడిగిన ముత్యంలా సంపూర్ణంగా బయటికి వస్తానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉన్నదని, అంతిమ విజయం సాధించేవరకు అన్ని వేదికల మీద పోరాటం కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు. బుధవారం ఢిల్లీ నుంచి హైదరాబాద్ బయలుదేరే ముందు, హైదరాబాద్‌లోని ఇంటికి చేరుకొన్న ఆమె మీడియాతో మాట్లాడారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని అన్నారు. నిజం నిలకడగా తెలుస్తుందని చెప్పారు. కుటుంబానికి, సమాజానికి తనను ఎంతో కాలం దూరం చేయలేరని తేల్చిచెప్పారు. ఏ తప్పూ చేయకపోయినా రాజకీయ కక్షసాధింపులో భాగంగా తనపై కేసు నమోదు చేశారనే విషయం ప్రతి ఒక్కరికి తెలిసిపోయిందని వెల్లడించారు. ఎట్టి ›2వ పేజీలో

ఇదేం ద్వంద్వనీతి?



బీఆర్‌ఎస్ నేతలే లక్ష్యంగా కూల్చివేతలు

ఒవైసీ మెడికల్ కాలేజీకి సమయం ఇస్తామన్న సీఎం, హైడ్రా కమిషనర్

ఎమ్మెల్యే మర్రికి చెందిన ఎంఎల్‌ఆర్‌ఐటీకి రెవెన్యూశాఖ మరోసారి నోటీసులు

ఏడు రోజుల్లో ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు కూల్చివేయాలని హెచ్చరిక

111 జీవో పరిధిలోనూ నోటీసులు జారీచేస్తున్న స్థానిక సంస్థలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): 'ఒక రాజును గెలిపించుటలో ఒరిగిన నరకంఠాలెన్నో!'.. హైదరాబాద్‌లో సాగుతున్న కూల్చివేతల పర్వం దాశరథి పాటను గుర్తుచేస్తున్నది. గీతానుసారంగా పురుడుపోసుకున్నాయని చెప్తున్న ఈ కూల్చివేతలు ఎన్ని హైడ్రామాలు సృష్టించినా చివరకు బీఆర్‌ఎస్ నేతల నిర్మాణాల మజిలీ చేరే దాకా విశ్రమించేలా కనిపించటం లేదు. కాకపోతే ఈ మధ్యలో పేదోళ్ల గూడుపై బుల్డోజర్ల దాడులు. రాజు సంతృప్తి చెందేవరకు ఇంకెంత మంది సామాన్యులు బజారున పడాల్సి వస్తుందోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా జంట జలాశయాల పరిధిలోని ప్రభుత్వ పెద్దల సౌధాల గుట్టురట్టయినా ఏ ఒక్కరూ అటువైపు కన్నెత్తి చూడకపోవటం.. ఒవైసీ వైద్య కళాశాలకు 'హితో'ధికంగా గడువు ఇవ్వడం ఒకవంతైతే.. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులకు వరుసగా నోటీసులు జారీ చేస్తుండటంతో పాటు జన్వాడ ఫాంహౌస్ దగ్గర చోటుచేసుకుంటున్న నాటకీయ పరిణామాలు మరోవంతు. ఈ నేపథ్యంలో హైడ్రా కూల్చివేతలను గమనిస్తే ప్రతి నిర్మాణంలోనూ రాజకీయం దాగున్నదనే వాస్తవం అర్థమవుతున్నది.

లోటస్‌పాండ్ కూల్చివేతలతో మొదలు

హైడ్రా ఇటీవల ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో 18 కూల్చివేతలు చేపట్టినట్టు వెల్లడించింది. అందులో తొలిసారి జూన్ 27న లోటస్‌పాండ్ వద్ద కూల్చివేతలు చేపట్టారు. జూలై 1, 4, 5, 14వ తేదీల్లోనూ పలుచోట్ల ›5వ పేజీలో

నా కుటుంబసభ్యుల నిర్మాణాలున్నా కూల్చేస్తా

బఫర్ జోన్‌లో ఉంటే నాకు వివరాలివ్వండి ›5

ఓల్డ్ సిటీ కాదు.. ఏ సిటీకైనా వచ్చి కూలగొడతారు

పార్టీలతో సంబంధం లేకుండా కూల్చివేతలు: సీఎం

రుజువు ఇదిగో కూల్చేది ఎప్పుడు?

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ భూముల్లో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి సొంతిల్లు?

ఆక్రమణలను ఎప్పుడు కూల్చేస్తారు? ›5

సీఎం రేవంత్ రెడ్డికి నెటిజన్ల సూటి ప్రశ్న

అక్రమ నిర్మాణంపై సోషల్‌మీడియాలో చర్చ



నిబంధనలకు లోబడే కూల్చివేతలు ఉండాలి

- ఆధారాలు పరిశీలించాకే చర్యలు
- హైడ్రాకు స్పష్టంచేసిన హైకోర్టు
- మర్రి, మారుతి విద్యాసంస్థలకు ఊరట
- కూల్చివేత నోటీసులను రద్దుచేసి, షోకాజ్ నోటీసులుగా మార్చిన కోర్టు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతకు హైడ్రా చేపడుతున్న చర్యలన్నీ చట్ట నిబంధనలకు అనుగుణంగా ఉండాలని హైకోర్టు తేల్చిచెప్పింది. మర్రి, మారుతి ఎడ్యుకేషన్ సొసైటీ విద్యాసంస్థల నిర్మాణాలను కూల్చివేసేందుకు 7 రోజుల గడువుతో తాహసీల్దార్ ఇచ్చిన నోటీసులను రద్దుచేసి, వాటిని షోకాజ్ నోటీసులుగా సవరించింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై నోటిఫికేషన్లు జారీచేసి, ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని, వారు చూపించే ఆధారాలను పరిశీలించాకే ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మర్రి, మారుతి ఎడ్యుకేషన్ సొసైటీల పిటిషన్లు పరిష్కారమైనట్టు ప్రకటిస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం దుండిగల్ (ప్రస్తుతం మేడ్చల్ ›5వ పేజీలో



సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు బుధవారం భూమి పూజ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

రూపురేఖలు మార్చి ఏర్పాటు చేస్తాం

జేఎన్‌టీయూ ఫైన్‌ఆర్ట్స్‌కు బాధ్యతలు

మేధావుల సూచనతోనే సెక్రటేరియట్ ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం పెడ్తున్నం

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ భూమి పూజలో సీఎం రేవంత్



హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): సచివాలయ ప్రాంగణంలో డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మిలియన్ మార్చ్ తరహాలో లక్షలాది తెలంగాణ బిడ్డల సమక్షంలో విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దసరా వరకు మంచి రోజులు లేకపోవడంతో భూమి పూజ ముందుగా చేస్తున్నామని వివరించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేరళ పర్యటనలో ఉండటం, మంత్రులకు ఇతర కార్యక్రమాలు ఉండటంతో హాజరుకాలేదని తెలిపారు. రాష్ట్ర పాలనకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఇక్కడే జరుగుతాయని అందుకే సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు ›5వ పేజీలో



గునపాలు దించిన చేతులతో విగ్రహమా?

అది తెలంగాణ తల్లికే అవమానం

గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెట్టినట్టే ఉంటది

తెలంగాణకు అక్కరకురాని బొమ్మలను తొలగించి తీరుతం: కేటీఆర్ ›5

మాస్కో సదస్సుకు కేటీఆర్

ఆహ్వానించిన స్కోల్‌కోవ్ సంస్థ

ఫెస్టివల్ ఆఫ్ ఫ్యూచర్ సదస్సులో ప్రసంగించాలని లేఖ

వచ్చే 5 నుంచి 7 వరకు సదస్సు

›3

మాఫీ కాకపోతే రైతే బాధ్యుడా?



కుటుంబ నిర్ధారణ సర్వే ఉద్దేశం ఇదేనా? ›10

సందేహాలు వ్యక్తంచేస్తున్న రైతు సంఘాలు

రైతు స్వయంగా కుటుంబాన్ని ధ్రువీకరిస్తేనే మాఫీ

అందులో ఏ ఒక్కరూ ఐటీ చెల్లించినా మాఫీ బంద్

రేషన్‌కార్డు లేని 2 లక్షల మంది రైతులకు కోత

సీఎం లెక్కల్లో రేషన్‌కార్డు లేనివారు 6.36 లక్షలు

కుటుంబ సర్వే చేస్తున్నది 4.24 లక్షల మందికే

ఆ 4 లక్షల్లోనూ ఎందరికి వస్తుందో!

కొనుగోలు కేంద్రాలు పెట్టరా?



మార్క్‌ఫెడ్ సెంటర్ల ఏర్పాటులో ఇంత నిర్లక్ష్యమా?

పప్పు దినుసుల రైతుల ఆశలు అడియాసలైనయ్

పెసర క్వింటాల్‌పై 2500 నష్టపోతున్నరు ›3

సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ



షాబాద్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే కాలె యాదయ్య వాహనంపై కోడిగుడ్లతో దాడి చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ›9

కాలె యాదయ్యపై కోడిగుడ్లతో దాడి

చేవెళ్ల ఎమ్మెల్యేకు కాంగ్రెస్ శ్రేణుల నుంచే నిరసన.. 'కల్యాణలక్ష్మి' పంపిణీలో అడ్డగింత

కోల్‌కతా ఘటన భయానకం

- **హత్యాచారం ఘటనపై రాష్ట్రపతి ముర్ము ఆవేదన**
- **మహిళలపై నేరాలపై ఇప్పటికైనా దేశం మేల్కోనాలని సూచన**



న్యూఢిల్లీ, ఆగస్టు 28: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన తీవ్ర భయానకమైనదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ ఘటన పట్ల తనతో పాటు దేశం ఆగ్రహంగా ఉందన్నారు. ఇప్పటివరకు జరిగింది చాలని, మహిళలపై జరిగే నేరాలపై దేశం మేల్కోనాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కోల్‌కతా ఘటనపై బుధవారం 'పీటీఐ'కి రాసిన వ్యాసంలో తన అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కోల్‌కతాలో విద్యార్థులు, వైద్యులు, ప్రజలు నిరసనలు తెలియజేస్తుంటే, నేరస్థులు వేరే చోట్ల సంచరిస్తూనే ఉన్నారని, బాధితుల్లో కేజీ చదివే చిన్నారులూ ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'భవిష్యత్తులో నిర్భయ తరహా ఘటన పునరావృతం కాదని హామీ ఇవ్వగలరా?' అని ఇటీవల రక్షాబంధన్ సందర్భంగా తనను కలిసిన స్కూల్ పిల్లలు అమాయకంగా అడిగారని ఆమె గుర్తు చేసుకున్నారు. మహిళలపై నేరాల వక్రబుద్ధి పట్ల దేశం మేల్కోనాలని, మహిళలు తక్కువ శక్తివంతులని, తక్కువ సమర్థులని, తక్కువ జ్ఞానం కలిగిన వారనే ఆలోచనావిధానాన్ని ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందని బుధవారం ఆమె పేర్కొన్నారు. ఇటువంటి ఆలోచనలు ఉన్న వారు స్త్రీని ఒక వస్తువుగా చూస్తారని అన్నారు. భయం నుంచి స్వేచ్ఛను పొందే మార్గంలో మన ఆడబిడ్డలకు అడ్డంకులు తొలగించేందుకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు.

నిర్భయంగా నిజం వైపు నిలవండి

మీడియా నిర్భయంగా పని చేయాలని, నిజం వైపు నిలబడాలని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. పీటీఐ 77వ వార్షికోత్సవాన్ని ఉద్దేశించి ఆమె తన సందేశాన్ని ఇచ్చారు. మీడియా ఎప్పుడూ గౌరవం పోగొట్టుకోవద్దని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని పేర్కొన్నారు.

రాత్రిపూట పెట్రోలింగ్ చేపట్టాలి

దవాఖానల్లో సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించాలి

వైద్యుల భద్రతపై రాష్ట్రాలకు కేంద్రం సూచనలు

న్యూఢిల్లీ: దవాఖానల్లో వైద్యుల భద్రత, వారిపై దాడులు, హింసను నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ప్రభుత్వం బుధవారం రాష్ట్రాలకు పలు సూచనలు చేసింది. లోపాలను గుర్తించి, తగిన చర్యలు తీసుకొనేందుకు జిల్లా దవాఖానల్లో సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించాలని, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ చేపట్టాలని, పెద్ద దవాఖానల వద్ద నియంత్రిత యాక్సెస్ ఉండాలని పేర్కొన్నది. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ చేపట్టిన నేపథ్యంలో కేంద్రం ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. వైద్యుల భద్రతకు సంబంధించి తాము నియమించిన నేషనల్ టాస్క్ ఫోర్స్(ఎన్‌టీఎఫ్) ప్రొటోకాల్‌ను రూపొందించేంత వరకు విధి నిర్వహణ సమయంలో భద్రతపై వైద్యుల ఆందోళనలను పరిష్కరించేందుకు రాష్ట్రాల్లో తగిన చర్యలు ఉండేలా చూడాలని న్యాయస్థానం కేంద్ర ఆరోగ్య శాఖను ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి నేతృత్వంలో ఎన్‌టీఎఫ్ మంగళవారం తొలి భేటీ జరిగింది. బుధవారం జరిగిన వర్చువల్ సమావేశానికి కేంద్ర హోం, ఆరోగ్య శాఖ కార్యదర్శులతోపాటు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, కేంద్ర ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది భద్రతకు సంబంధించి 26 రాష్ట్రాలు/యూటీల్లో ఇప్పటికే చట్టాలు ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. ఇతర రాష్ట్రాలు కూడా అలాంటి చట్టాలు చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ కోరినట్టు కేంద్రం విడుదల చేసిన ఓ ప్రకటన పేర్కొన్నది. బ్లైండ్ స్పాట్‌ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వైద్య సిబ్బంది కోసం 112 హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏకీకృతం చేయాలని రాష్ట్రాల అధికారులను మోహన్ కోరారు. ఇంకేమైనా కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని అపూర్వ చంద్ర రాష్ట్రాలకు సూచించారు. హాస్పిటల్స్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, రెగ్యులర్‌గా సెక్యూరిటీ, ఫైర్ డ్రిల్స్ నిర్వహించాలన్నారు.



దల్జీత్ సింగ్ | రజ్వీందర్

సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్‌కు కొత్త చీఫ్‌లు

న్యూఢిల్లీ: కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా రజ్వీందర్ సింగ్ భట్టి, సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) చీఫ్‌గా దల్జీత్ సింగ్ చౌదరి నియమితులయ్యారు. సిబ్బంది వ్యవహారాల శాఖ బుధవారం ఈ మేరకు ఆదేశాలను జారీ చేసింది. భట్టి 1990 బ్యాచ్ బీహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి. ఆయన వచ్చే ఏడాది సెప్టెంబరు 30 వరకు పదవిలో కొనసాగుతారు. చౌదరి 1990 బ్యాచ్ యూపీ క్యాడర్ ఐపీఎస్ అధికారి. ఆయన వచ్చే ఏడాది నవంబరు 30 వరకు బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా కొనసాగుతారు.

నన్ను అనర్హురాలిగా ప్రకటించే

అధికారం యూపీఎస్సీకి లేదు

ఆరోపణలు ఖండించిన ఖేద్కర్

ముంబై (నమస్తే తెలంగాణ): ఒకసారి ప్రొబేషనర్‌గా ఎంపికై, నియమించిన తర్వాత తన అభ్యర్థిత్వాన్ని తొలగించే అధికారం యూపీఎస్సీకి లేదని మాజీ ఐఏఎస్ ట్రైనీ అధికారిణి పూజా ఖేద్కర్ వాదించారు. తనపై ఢిల్లీ హైకోర్టులో యూపీఎస్సీ దాఖలు చేసిన కేసుపై ఆమె ఈ విధంగా స్పందించారు. 'అఖిల భారత సర్వీసుల చట్టం–1954, సీఎస్ఈ 2022 నిబంధనల్లోని ప్రొబేషనర్ రూల్స్ నెం.19 ప్రకారం డీఓపీటీ(వ్యక్తిగత, శిక్షణ విభాగం) మాత్రమే చర్యలు తీసుకోవచ్చు' అని ఆమె తెలిపారు. యూపీఎస్సీకి తన పేరును తప్పుగా లేదా మోసం చేసే విధంగా చెప్పలేదని ఆమె పేర్కొన్నారు.

ఉరికొయ్యకు విద్యార్థులు!

- **దేశంలో మొత్తం ఆత్మహత్యల కంటే రెట్టింపు పెరుగుదల రేటు**
- **జనాభా వృద్ధిరేటు కంటే ఎక్కువే**
- **ఐసీ3 ఇన్‌స్టిట్యూట్ నివేదిక**

న్యూఢిల్లీ: పలు కారణాలతో దేశంలో ఆత్మహత్యలు చేసుకొంటున్న విద్యార్థుల సంఖ్య ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నది. జనాభా పెరుగుదల రేటు, దేశవ్యాప్తంగా మొత్తం ఆత్మహత్యల రేటును కూడా ఇది దాటేస్తున్నదని జాతీయ నేర గణాంకాల సంస్థ డాటా ఆధారంగా ఐసీ3 ఇన్‌స్టిట్యూట్ బుధవారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఏడాదికి దేశంలో మొత్తం బలవన్మరణాలు 2 శాతం పెరగ్గా, విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళనకరంగా 4 శాతం మేర పెరిగాయి. నమోదు కాని విద్యార్థుల ఆత్మహత్యలు ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని నివేదిక తెలిపింది.

- విద్యార్థుల ఆత్మహత్యల వార్షిక పెరుగుదల రేటు 4%
- మొత్తం ఆత్మహత్యల పెరుగుదల 2%

విద్యార్థుల బలవన్మరణాలు ఏ రాష్ట్రాల్లో ఎక్కువ?

1.మహారాష్ట్ర, 2.తమిళనాడు 3.మధ్యప్రదేశ్
(ఈ 3 రాష్ట్రాల్లోనే 1/3 వంతు)

- దక్షిణాది రాష్ట్రాలు, యూటీల్లో కలిపి–29%

ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తే నెలకు రూ.8 లక్షల సంపాదన

ఇన్‌ఫ్లుయెన్సర్లకు యూపీ ప్రభుత్వం ఆఫర్

లక్నో: ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, విజయాలకు ప్రచారం కల్పించేందుకు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను యూపీ సర్కారు రంగంలోకి దించనుంది. ఈ మేరకు నూతన సోషల్‌మీడియా పాలసీని రూపొందించింది. దీని ప్రకారం.. ప్రభుత్వ పథకాలకు ప్రచారం కల్పించడం ద్వారా ఇన్‌ఫ్లుయెన్సర్లు నెలకు రూ.8 లక్షల వరకు ఆర్జించవచ్చు. దీనిపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సర్కారుకు ఓటమి తప్పదని, దీన్నుంచి ఏ సోషల్‌మీడియా వారియర్ కూడా రక్షించలేరని స్పష్టంచేశాయి. మరోవైపు, సోషల్‌మీడియాలో దేశ వ్యతిరేక పోస్టులు పెట్టేవారికి మూడేళ్ల జైలు శిక్ష నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష విధించేలా నూతన పాలసీలో నిబంధనలు పొందుపరిచారు.

బెంగాల్ తగలబడితే ఢిల్లీనూ తగలబడుతుంది!

- అస్సాం, ఒడిశా, జార్ఖండ్, బీహార్ సైతం..
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యలు
- కోల్‌కతా ఘటనపై 16 రోజులుగా సీబీఐ దర్యాప్తు చేస్తున్నా న్యాయం ఎక్కడని ప్రశ్న

కోల్‌కతా, ఆగస్టు 28: 'బెంగాల్ తగలబడితే, తర్వాత అస్సాం, బీహార్, జార్ఖండ్, ఒడిశా, ఢిల్లీ కూడా తగలబడతాయి అనే విషయం గుర్తుంచుకోండి' అంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌లో తాజా ఘటనలను ఉద్దేశించి బుధవారం కోల్‌కతాలో తృణమూల్ విద్యార్థి విభాగం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మమత వ్యాఖ్యలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా స్పందించారు. 'దీదీ, అస్సాంను బెదిరించేందుకు ఎంత ధైర్యం? మాపై కళ్లు ఎర్రవి చేసి చూడకండి. మీ విఫల రాజకీయాలతో దేశాన్ని తగలబెట్టేందుకు ప్రయత్నించకండి' అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాజ్యాంగ పదవిలో ఉండి మమతా బెనర్జీ దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు బీజేపీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సుకాంత మజుందార్ లేఖ రాశారు. 'నేను ఎప్పుడూ ప్రతీకారాన్ని కోరుకోలేదు. కానీ ఇప్పుడు ఏది అవసరమైతే అది చేయండి' అని అమిత్ షాను కోరారు.

రేపిస్టులకు ఉరిశిక్ష పడేలా చట్టాల సవరణ: మమత

అత్యాచార ఘటనలను తమ ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించబోదని, రేపిస్టులకు ఉరిశిక్ష పడేలా ప్రస్తుతం ఉన్న చట్టాలను సవరిస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. వచ్చే వారమే అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని, దీనిని గవర్నర్ ఆమోదించకపోతే రాజ్‌భవన్ ముందు తానే ధర్నాకు దిగుతానని తెలిపారు. ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు తిరిగి విధుల్లో చేరాలని ఆమె కోరారు. హత్యాచార ఘటనలో సీబీఐ విచారణ చేపట్టి 16 రోజులు గడుస్తున్నప్పటికీ న్యాయం ఎక్కడ జరిగిందని ఆమె ప్రశ్నించారు.



టీఎంసీ ఛాత్ర పరిషద్ వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న మమతా బెనర్జీ

ఉద్రిక్తంగా బెంగాల్ బంద్

విద్యార్థులపై పోలీసుల చర్యలకు నిరసనగా బీజేపీ పిలుపునిచ్చిన 12 గంటల బెంగాల్ బంద్ బుధవారం ఉద్రిక్తతలతో ముగిసింది. దుకాణాలు, రోడ్లను మూసేందుకు ప్రయత్నించిన బీజేపీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. పలు రైల్వే స్టేషన్లలో బీజేపీ కార్యకర్తలు రైళ్లను అడ్డుకున్నారు. అక్కడక్కడ బీజేపీ కార్యకర్తలు, తృణమూల్ కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. మాజీ ఎంపీలు రూపా గంగూలీ, లాకెట్ ఛటర్జీ, రాజ్యసభ ఎంపీ సామిక్ భట్టాచార్య తదితర బీజేపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

డాక్టర్ సందీప్ ఘోష్ ఐఎంఏ సభ్యత్వం సస్పెన్షన్

న్యూఢిల్లీ: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్ సభ్యత్వాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) బుధవారం సస్పెండ్ చేసింది. జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో సీబీఐ దర్యాప్తు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఘోష్ ఐఎంఏ కోల్‌కతా శాఖ ఉపాధ్యక్షుడు కూడా. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోకన్ ఏర్పాటు చేసిన కమిటీ ఈ హత్యాచారం, అనంతర పరిణామాలను తనంతట తాను పరిశీలించిందని ఘోష్‌కు పంపిన ఐఎంఏ ఆర్డర్ పేర్కొంది. కొన్ని వైద్యుల సంఘాలు కూడా ఘోష్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసినట్లు పేర్కొంది. దీంతో ఐఎంఏ క్రమశిక్షణ సంఘం ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది.

డీఎంకే ఎంపీకి 908 కోట్ల జరిమానా

ఫెమా కేసులో ఈడీ నోటీసు

చెన్నై: డీఎంకే ఎంపీ ఎస్ జగద్రక్షకన్, ఆయన కుటుంబ సభ్యులకు ఈడీ రూ.908 కోట్ల జరిమానా విధించింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై 2020 సెప్టెంబరులో దర్యాప్తు నిర్వహించినట్లు ఈడీ నోటిఫికేషన్ తెలిపింది. జగద్రక్షకన్, ఆయన కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న రూ.89.19 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. వీరు విదేశీ సంస్థల్లో అక్రమంగా పెట్టుబడులు పెట్టారని ఆరోపిస్తూ 2021 డిసెంబరులో ఈడీ ఫిర్యాదును దాఖలు చేసింది. జగద్రక్షకన్ 2017లో సింగపూర్‌లోని ఓ బూటకపు కంపెనీలో రూ.42 కోట్ల మేరకు పెట్టుబడి పెట్టారని ఆరోపించింది.

72 దరఖాస్తులు క్యూలో ఉన్నా..

- **ఖర్గే కుటుంబ ట్రస్టుకు అక్రమంగా భూకేటాయింపు**
- **కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు**

న్యూఢిల్లీ: కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి పెచ్చరిల్లిపోయిందని, ఒక్కొక్కటిగా అక్రమాల వ్యవహారాలు బయటకొస్తున్నాయని బీజేపీ ఆరోపించింది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కుటుంబానికి చెందిన ట్రస్టుకు ప్రభుత్వం అక్రమంగా భూ కేటాయింపు చేసిందని పేర్కొన్నది. బీజేపీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది బుధవారం మీడియాతో మాట్లాడుతూ వేలం నిర్వహించకుండా భూ కేటాయింపు జరిగిందని ఆరోపించారు. 'కొంత భూమి కేటాయించాలని సాంఘిక న్యాయం, సంక్షేమ విభాగం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 14న కోరినా కేటాయించలేదు. 72 దరఖాస్తులు క్యూలో ఉన్నప్పటికీ ఖర్గే కుటుంబానికి భూమి కేటాయించారు' అని ఆయన ఆరోపించారు. ఈ–వేలం ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు.

డీకే తెరచాటు రాజకీయం!

- **కర్ణాటక డిప్యూటీ ముఖ్యమంత్రి శివకుమార్‌తో బీజేపీ ఎమ్మెల్సీ ఏహెచ్ విశ్వనాథ్ భేటీ**
- **ఇటీవల ముడా స్కామ్‌ను బయటపెట్టిన వ్యక్తితో డీకే సమావేశమవడంపై చర్చ**



బెంగళూరు: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ముడా స్కామ్ ఆరోపణల్లో చిక్కుకున్న వేళ.. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో బీజేపీ ఎమ్మెల్సీ ఏహెచ్ విశ్వనాథ్ మంగళవారం భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. మైసూర్‌లో సిద్ధరామయ్య భార్యకు అక్రమంగా భూములు కేటాయించారన్న ఆరోపణల అంశం గతకొద్ది కాలంగా రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న విషయం తెలిసిందే. వాల్మీకి స్కామ్, పలు ఇతర అంశాలతో పాటు ఈ వ్యవహారం సీఎం సిద్ధరామయ్య కుర్చీకి ఎసరు పెట్టే అవకాశం ఉందని, ఇదే జరిగితే ఈసారి ఎలాగైనా సీఎం పీఠం దక్కించుకొనేందుకు డీకే శివకుమార్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్న చర్చ కూడా నడుస్తున్నది. ఇలాంటి సమయంలో ముడా అంశంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా విమర్శించడంతోపాటు ముడా స్కామ్‌పై ఇటీవల మీడియాతో మాట్లాడిన విశ్వనాథ్ డీకేతో భేటీ కావడం వెనుక ఉద్దేశాలు, రాజకీయ ఎత్తుగడలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

సిద్ధరామయ్యపై విశ్వనాథ్ అసంతృప్తి!

సిద్ధరామయ్యపై ఎమ్మెల్సీ విశ్వనాథ్‌కు తీవ్ర అసంతృప్తి ఉన్నది. విశ్వనాథ్ కూడా కురుబ సామాజికవర్గానికి చెందిన వ్యక్తే. గతంలో కాంగ్రెస్ నుంచి మైసూర్ ఎంపీ టికెట్ కోసం ప్రయత్నించారు. ఇందుకు ఆయన సిద్ధరామయ్యతో పలుమార్లు భేటీ అయినా టికెట్ దక్కలేదు. ఇదే విశ్వనాథ్ ముడా స్కామ్ అంశాన్ని బయటపెట్టేందుకు దారితీసిందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పుడు డీకేతో భేటీ కావడం వెనుక ఉద్దేశాలు, తిరిగి కాంగ్రెస్‌లోకి అతని రాకకు సంబంధించి చర్చ ప్రారంభమైంది.

డీకే వర్గానికి ఊరటగా ముడా స్కాం

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బెంగళూరు రూరల్ నుంచి డీకే సోదరుడు, బెంగళూరు నార్త్, మైసూర్ స్థానాల్లో పోటీచేసిన వొక్కళిక కమ్యూనిటీ అభ్యర్థులు ఓటమి పాలవడంతో డిప్యూటీ సీఎంకు ఎదురుదెబ్బ తగిలినట్టు అయింది. దీంతో కేఎన్ రాజన్న వంటి సిద్ధరామయ్య సన్నిహితులు మరికొంత మందికి డిప్యూటీ సీఎం పదవులు ఇవ్వాలనే డిమాండ్‌ను తీసుకురావడం డీకే వర్గానికి ఇబ్బందికరంగా మారింది. ఇలాంటి సమయంలో ముడా స్కామ్ అంశాన్ని విశ్వనాథ్ లేవనెత్తడం డీకేకు ఊరటనిచ్చినట్టు అయిందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

ఆయన వద్ద ఒరిజినల్ పత్రాలు

శివకుమార్‌తో భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని, గ్రాంట్లు, అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించేందుకు వచ్చానని విశ్వనాథ్ చెబుతున్నారు. తన మీటింగ్‌లకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాతో పంచుకొనే డీకే.. మంగళవారం విశ్వనాథ్‌తో జరిగిన భేటీ ఫొటోలను షేర్ చేయలేదు. ఈ భేటీలో డీకే, విశ్వనాథ్‌లకు సన్నిహితుడైన మైసూర్ జిల్లా మాజీ ఇన్‌చార్జి మంత్రి ఎస్‌టీ సోమశేఖర్ ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతున్నది. ఆయన వద్ద ముడా భూ కేటాయింపులకు సంబంధించి ఒరిజినల్ పత్రాలు ఉన్నాయనే ప్రచారం ఉన్నది.

భారత్‌లో 19.3% తగ్గిన వాయు కాలుష్యం

ఏడాది పెరిగిన ప్రజల సగటు ఆయుర్దాయం: నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 28: దేశంలో వాయు కాలుష్యం 2022లో 19.3 శాతం తగ్గింది. ఆ ఏడాది ప్రపంచంలో బంగ్లాదేశ్ తర్వాత భారత్‌లోనే వాయు కాలుష్యం అధికంగా తగ్గిందని, దీంతో భారతీయుల సగటు ఆయుర్దాయం ఏడాదిపాటు పెరిగిందని షికాగో యూనివర్సిటీలోని ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ (ఎపిక్) తాజాగా విడుదల చేసిన 'ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్–2024' నివేదికలో వెల్లడించింది. 2021తో పోలిస్తే 2022లో భారత్‌లో కాలుష్య రేణువుల (పీఎం 2.5) స్థాయిలు క్యూబిక్ మీటర్‌కు 9 మైక్రో గ్రాములు తగ్గాయని, ముఖ్యంగా బెంగాల్, జార్ఖండ్‌లోని పలు జిల్లాల్లో పీఎం 2.5 స్థాయిలు గణనీయంగా క్యూబిక్ మీటర్‌కు 20 మైక్రో గ్రాముల మేరకు క్షీణించాయని స్పష్టం చేసింది. భారత్‌లో ఇంకా 42 శాతం మంది ప్రజలు జాతీయ ప్రమాణం (క్యూబిక్ మీటర్‌కు 40 మైక్రో గ్రాములు) కంటే పీఎం 2.5 స్థాయి అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే నివసిస్తున్నట్టు తెలిపింది.

అవి సాక్ష్యాలు కానేకావు!

> మొదటిపేజీ తరువాయి...

కేసులో కస్టడీలోని నిందితులు ఇచ్చిన నేరారోపణ వాంగ్మూలాలను ఆధారంగా చేసుకొనే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను అదుపులోకి తీసుకొన్నట్టు ఈడీ, సీబీఐ కోర్టుకు తెలిపింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్లు.. సాక్ష్యాలు, ఆధారాలు ఎలా అవుతాయని నిలదీసింది. విచారణ సరైన పద్ధతిలో జరిగిందా? అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తూ.. మంగళవారం కవితకు బెయిల్ మంజూరు చేసింది. కస్టడీలోని నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలనే సాక్ష్యాలుగా చేసుకొని 'ఢిల్లీ మద్యం పాలసీ' కేసు దర్యాప్తు జరిగిందని ఈడీ, సీబీఐ వ్యాఖ్యలతో స్పష్టమైంది. నిందితుల వాంగ్మూలాలు చెల్లవంటూ సుప్రీం తాజా వ్యాఖ్యలను బట్టి అర్థమవుతున్నది. వీటన్నింటినీ విశ్లేషిస్తే.. 'ఢిల్లీ మద్యం పాలసీ కేసు' నీరుగారిపోవడం తప్ప మరో మార్గం లేదని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అందుకే బెయిల్ మంజూరు

అక్రమ మైనింగ్ కేసులో అరెస్టయిన ప్రేమ్ ప్రకాశ్.. ఈ వ్యవహారంలో నేరం చేసినట్లు గానీ.. బెయిల్‌పై బయటికొస్తే అతను సాక్షులను ప్రభావితం చేస్తాడన్నట్టు గానీ చెప్పడానికి ప్రాథమిక ఆధారాల్లేవని న్యాయస్థానం అభిప్రాయపడింది. దీంతో అతడికి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు వెల్లడించింది.

వచ్చే నెల 2 వరకు

పాస్‌పోర్ట్ సేవా పోర్టల్ సేవల నిలిపివేత

న్యూఢిల్లీ: పాస్‌పోర్ట్ సేవా పోర్టల్‌కు నేటి రాత్రి 8 గంటల నుంచి వచ్చే నెల 2న ఉదయం 6 గంటల వరకు టెక్నికల్ మెయింటెనెన్స్ జరుగుతుంది. ఈ సమయంలో దీని సేవలు ప్రజలకు అందుబాటులో ఉండవు. ఈ నెల 30వ తేదీకి షెడ్యూల్ అయిన అన్ని అపాయింట్‌మెంట్లను అధికారులు రద్దు చేశారు. రీషెడ్యూల్డ్ అపాయింట్‌మెంట్స్‌కు సంబంధించిన వివరాలు దరఖాస్తుదారులకు ఎస్ఎంఎస్ ద్వారా నోటిఫికేషన్‌ను పంపిస్తారు. ఈ సమయంలో ఎంఈఏ/ఆర్‌పీఓ/బీఓఐ/ఐఎస్‌పీ/డీఓపీ/పోలీసు అధికారులకు కూడా ఈ పోర్టల్ సేవలు అందుబాటులో ఉండవు.



దెయ్యాలకు లాంగ్ జంప్ పోటీలు!

- **నిర్వహించిన యమ ధర్మరాజు, చిత్రగుప్తుడు**
- **కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో రోడ్ల దుస్థితిపై వినూత్న నిరసన**

ఉడుపి: నరుల ప్రాణాలు హరించే యమ ధర్మరాజు, మానవుల పాపపుణ్యాల చిట్టా రాసివుంచే చిత్రగుప్తుడు కాంగ్రెస్ పాలనలోని కర్ణాటకలో రోడ్ల పరిస్థితిని చెక్ చేసేందుకు భూమిపైకి వచ్చారు! రహదారుల దుస్థితిని తెలిపేందుకు ఉడుపిలో కొంత మంది వినూత్నంగా నిరసన చేపట్టారు. ప్రాణాంతకంగా తయారైన రోడ్లపై భారీగా ఏర్పడిన గుంతల వద్ద 'దెయ్యాల'కు లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. ఎంత దూరం దూకారో టేపులు పెట్టి కొలిచారు. ఈ వీడియోపై నెటిజన్లు పలు విధాలుగా స్పందించారు. రోడ్డు నిండా గుంతలు ఉండటంతో కొందరు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ పోటీలు నిర్వహించారు.



గుజరాత్‌లో భారీ వర్షాల ధాటికి వడోదరలోని ఓ రోడ్డు ఇలా ముక్కలు ముక్కలైంది. 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' వద్దకు వెళ్లే ఈ రోడ్డుపై తారు చాలా భాగం వరకు పెచ్చులుగా లేచిపోయింది. దీంతో ఆ రోడ్డుపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మరోవైపు గుజరాత్‌లో వర్షం కారణంగా గత మూడు రోజుల వ్యవధిలో 26 మంది మరణించారు.



ఓం పర్వతంపై మొదటిసారి మంచు మాయం

వాహన కాలుష్యమే కారణం!

పితోరాఘడ్: గత వారం ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం ఓం పర్వతంపై మంచు పూర్తిగా మాయం కావడం సందర్శకులను ఆశ్చర్యానికి గురి చేసింది. గత అయిదేండ్లలో హిమాలయాల ఎగువ ప్రాంతంలో కొద్దిపాటి వర్షాలు, కొద్దిగా మంచు కురవడం, వాహన కాలుష్యం పెరుగుదల, భూతాపం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని నిపుణులు తెలిపారు. అయితే సోమవారం రాత్రి ఈ పర్వతంపై మంచు కురిసింది. వ్యాస్ లోయలో 14 వేల అడుగుల ఎత్తులో ఉండే ఓం పర్వతంపై హిందీ పదం 'ఓం' ఆకారంలో సహజంగా మంచు ఏర్పడుతుంది. ఈ కారణంగా ఈ పర్వతానికి ఆ పేరు వచ్చింది. హిమాలయాల్లోని జోలింగ్‌కాంగ్‌ను ప్రధాని గతేడాది అక్టోబర్‌లో సందర్శించిన తర్వాత పర్యాటకుల తాకిడి పది రెట్లు పెరగడం కూడా తాజా పరిస్థితికి కారణమని నిపుణులు వాపోయారు.

నదిలోకి 50 ఆవుల్ని తోసేసిన ఆకతాయిలు

20 గోవుల మృత్యువాత

సాత్నా (మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లోని సాత్నా జిల్లాలో కొందరు ఆకతాయిలు సుమారు 50 గోవుల్ని నదిలోకి తోసేశారు. ఈ ఘటనలో సుమారు 20 ఆవులు చనిపోయినట్టు తెలిసింది. నిందితులు ఆవుల్ని నదిలోకి తోస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు నలుగురు నిందితులపై భారతీయ న్యాయ్ సంహిత (బీఎన్ఎస్) కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఆకతాయిలు దాదాపు 50 ఆవులను నదిలోకి తోసేశారు. వీటిలో 20 వరకు చనిపోగా, మిగిలిన వాటి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రుజువు ఇదిగో.. కూల్చేదెప్పుడో!

- దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ భూముల్లో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి సొంతిల్లు?
- ఆక్రమణలను ఎప్పుడు కూల్చేస్తారు?
- రేవంత్ రెడ్డికి నెటిజన్ల సూటి ప్రశ్న
- అక్రమ నిర్మాణంపై సోషల్‌మీడియాలో చర్చ



దుర్గంచెరువు బఫర్ జోన్‌లో సీఎం రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): చెరువుల ఆక్రమణలపై కన్నెర్ర చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు నెటిజన్లు సూటిప్రశ్నలు సంధిస్తున్నారు. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో 'చెరువులు, కుంటలను ఆక్రమించి నా కుటుంబసభ్యుల నిర్మాణాలు ఉన్నా నిలబడి కూల్చివేస్తా' అని స్పష్టం చేశారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి దుర్గం చెరువును ఆక్రమించుకొని నిర్మించిన ఇంటి వివరాలను నెటిజన్లు వెలుగులోకి తెచ్చారు. 2000 సంవత్సరంలో భారీ వరదలు వస్తే.. ఈ చెరువు వరద నీరు ప్రవహించి ఏకంగా 9 కాలనీలు నీట మునిగాయి. దీంతో అప్పట్లోనే దుర్గం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్‌ను నిర్ధారిస్తూ హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. కానీ చెరువు బఫర్‌జోన్, ఎఫ్టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇందులోనే సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ప్లాట్ నంబర్ 54, 55లో భారీ భవంతిని నిర్మించుకోవటమే ఇప్పుడు ప్రధాన చర్చకు కారణమైంది. మరి ఈ ఇంటినీ కూల్చివేస్తారా? అని నెటిజన్లు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సంపన్నుల కబ్జా భవంతులను తొలి ప్రాధాన్యంగా కూల్చాలని డిమాండ్ చేస్తున్నారు. చెరువుకు సంబంధించిన పూర్తి ఆధారాలతో సోషల్‌మీడియా వేదికగా పంచుకోగా.. సీఎం, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

టీడీపీ, కాంగ్రెస్ పాలనలో చెరువుల అన్యాక్రాంతం

బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి కేబుల్ బ్రిడ్జిని దుర్గం చెరువుపై నిర్మించగా, కాంగ్రెస్, టీడీపీ పాలనలోనే చెరువులు అన్యాక్రాంతం అయ్యాయని నెటిజన్లు చెప్తున్నారు. అందుకు తిరుపతిరెడ్డి ఇల్లే నిదర్శనం అని పేర్కొంటున్నారు. దుర్గం చెరువు దాదాపు 85 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉండగా.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ప్రాంతాలను పూడ్చివేసి కాలనీలు, రెసిడెన్షియల్ ప్రాజెక్టులను నిర్మించటం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. అమర్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ, కావూరి హిల్స్, కల్యాణ్‌నగర్, బృందావన్ కాలనీ, హెక్టార్ గార్డెన్ వంటి కాలనీలన్నీ 2000లో వరదలోనే మునిగాయని ఇరిగేషన్‌శాఖ గుర్తించింది. ఈ క్రమంలో చెరువు భూముల్లో నిర్మించిన భవనాలను వ్యతిరేకిస్తూ కొందరూ కోర్టును ఆశ్రయించగా.. ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతుల్లేని భవనాలను ఇరిగేషన్, రెవెన్యూ, హుడా అధికారులు తొలగించారు. ఆ తర్వాత కోర్టు ఆదేశాలతో ఆక్రమణలపై చర్యలు నిలిచిపోయాయి. కానీ ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, రెవెన్యూశాఖ అధికారులు ఇచ్చిన ఆధారాలతో ఈ భూములు రెసిడెన్షియల్ కార్యాకలాపాలకు అనుకూలం కాదని, రిక్రియేషనల్ జోన్‌గా మార్చాలని అప్పట్లోనే హైకోర్టు ఆదేశించింది.

సామాన్యుడిపైనే హైడ్రా ప్రతాపం

చెరువులు, కుంటలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల విషయంలో దూకుడుగా వ్యవహరిస్తున్న హైడ్రా.. సామాన్యుడు నిర్మించుకున్న ఇండ్ల పైనే ప్రతాపం చూపుతున్నదన్న విమర్శలు ఎదుర్కొంటున్నది. సామాన్యుడు నిర్మించుకునే, బిల్డర్లు, డెవలపర్లు చేసే తప్పిదాలతో కలల సౌధాలు కండ్ల ముందే పేకమేడల్లా కూలిపోతుంటే గుండెలు బాదుకొని కన్నీరు మున్నీరు అవుతున్నారు. రాజకీయ పలుకుబడితో చెరువులు, జలవనరులను చెరబట్టిన సంపన్న వర్గాల నిర్మాణాలను కూడా కూల్చివేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.5°c	22.5°c
మెదక్	33.2°c	21.5°c
నిజామాబాద్	32.3°c	24.0°c
రంగారెడ్డి	32.1°c	23.2°c
కరీంనగర్	32.0°c	25.0°c
ఖమ్మం	32.0°c	24.0°c
మహబూబ్‌నగర్	31.0°c	22.2°c
నల్లగొండ	30.0°c	24.4°c
హైదరాబాద్	30.0°c	23.3°c
వరంగల్	29.0°c	25.0°c

రేపటి నుంచి భారీ వర్షాలు!

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 30 నుంచి 2వ తేదీ వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువచ్చని అంచనా వేసింది. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం,ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ,సిద్దిపేట జిల్లాల్లో వర్షా లు పడొచ్చని పేర్కొన్నది. ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది.

'అగ్రిఫుడ్'లో మహిళల భాగస్వామ్యం

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో అగ్రిఫుడ్ వ్యవస్థల్లో మహిళలు, చిన్న తరహా పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఉన్న అవకాశాలపై ఐక్యరాజ్యసమితి అధ్యయనం చేపట్టనున్నది. ఐక్యరాజ్య సమితి అండర్ సెక్రటరీ జనరల్ ఆర్మిడా సల్సియాహ్ బుధవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. భేటీలో టీజీఐఐసీ సీఈవో మధుసూదన్, ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం డైరెక్టర్ అఖిల్, లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

గునపాలు దించిన చేతులతో విగ్రహమా?

- అది తెలంగాణ తల్లికే అవమానం
- గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెట్టినట్టే ఉంటది
- తెలంగాణకు అక్కరకురాని బొమ్మలను తొలగిస్తాం
- తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్ఠిస్తాం : మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమం గుండెల్లో గునపాలు దించిన చేతులతో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడం అంటే అది తెలంగాణ తల్లికి అవమానమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. గాంధీ విగ్రహం గాడ్సే పెడితే ఎట్లుంటదో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం పెడితే కూడా అట్లుంటుందని ఎద్దేవాచేశారు. తెలంగాణకు అక్కరకురాని వాళ్ల బొమ్మలను తొలగిస్తామని, తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్టిస్తామని బుధవారం ఎక్స్‌వేదికగా కేటీఆర్ తేల్చిచెప్పారు. 'సోనియాగాంధీని దయ్యం, పిశాచి, బలిదేవత అన్న నువ్వా రాజీవ్‌గాంధీ మీద ప్రేమ ఒలకబోసేది' అని ఆయన రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. దొడ్డి దారిన టీపీసీసీ ప్రెసిడెంట్ అయ్యి ఇవాళ రాజీవ్‌గాంధీ మీద రేవంత్‌రెడ్డి ఒలకబోస్తున్న కపట ప్రేమ అందరికీ తెలుసునని పేర్కొన్నారు. సీఎం ఆలోచనల్లో కుసంస్కారం.. మాటలు అష్టవికారం అని ఎద్దేవా చేశారు. తెలంగాణ తల్లి కోసం నిర్ణయించిన స్థలంలో కాంగ్రెస్ నాయకుల విగ్రహాలేమిటని అడిగితే కారుకూతలు కూస్తావా? అని మండిపడ్డారు.

డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

మొదటిపేజీ తరువాయి...

చేస్తున్నామని చెప్పారు. ప్రజల అభిమతానికి తగినట్టు తెలంగాణ తల్లి విగ్రహం రూపొందించే బాధ్యతను జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ విభాగం కళాశాల ప్రిన్సిపాల్‌కు అప్పగించామని వెల్లడించారు. నెక్లెస్‌రోడ్, ట్యాంక్‌బండ్ చుట్టుపక్కల దేశం, రాష్ట్రం కోసం ఎంతో చేసిన అంబేద్కర్, ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, అంజయ్య, కాకా వెంకటస్వామి విగ్రహాలు, జైపాల్ రెడ్డి సమాధి ఉన్నాయని, వీటిమధ్య రాజీవ్‌గాంధీ విగ్రహం లేకపోవడం లోటుగా కనిపించిందని అన్నారు. అందుకే సచివాలయం ఎదుట మేధావుల సూచన మేరకు రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• కాంగ్రెస్ 'హైడ్రా'కు మద్దతుగా బీజేపీ ఫ్లెక్సీ



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా సంస్థకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ, సీఎం రేవంత్‌రెడ్డిని అపరభగీరథుడిగా కీర్తిస్తూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బుధవారం బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చర్చనీయాంశంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఒకరినొకరు పొగుడుతూ ఫ్లెక్సీలు పెట్టుకోవడమేంటనే చర్చలు మొదలయ్యాయి. ఒకే ఫ్లెక్సీలో కాంగ్రెస్ సీఎం రేవంత్, బీజేపీ నాయకుల ఫొటోలు చూసి రాజకీయాల్లో ఇదేం బంధమోనని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. – హుస్నాబాద్

బదిలీలు, పదోన్నతుల్లో తప్పులు సవరించండి

హైదరాబాద్, ఆగస్టు28 (నమస్తే తెలంగాణ): గురుకుల సొసైటీ బదిలీలు, పదోన్నతులలో జరిగిన తప్పులను సవరించాలని ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. డిస్‌లొకేట్, 317 జీవో బాధిత ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరింది. ఈ మేరకు సీఎంవో, మంత్రులకు, సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి అసోసియేషన్ అధ్యక్షుడు కూకుట్ల యాదయ్య, జనరల్ సెక్రటరీ పాపిరెడ్డి, ట్రెజరర్ బసవయ్య బుధవారం వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులకు సమస్యలు విన్నవించారు. మొత్తంగా బదిలీలు, పదోన్నతులపై సమగ్ర విచారణ జరపాలని, నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నా కుటుంబసభ్యుల నిర్మాణాలున్నా కూల్చేస్తా

- పార్టీలతో సంబంధం లేకుండా హైడ్రా కూల్చివేతలు
- ఓల్డ్ సిటీ కాదు.. ఏ సిటీకైనా వచ్చి కూలగొడతారు
- మీడియాతోచిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రుణమాఫీ జరగలేదని ధర్నాలు చేసేది బీఆర్ఎస్ కార్యకర్తలేనని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాము 27 రోజుల్లో రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. టెక్నికల్ అంశాలతో రుణమాఫీ జరగనివారు కలెక్టర్‌కు వివరాలు ఇవ్వాలని సూచించారు. రుణమాఫీ కానీ వారి వివరాలను మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కూడా ఇవ్వొచ్చని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.13,329 కోట్లు రుణమాఫీ చేసిందని వివరించారు. ప్రభుత్వం చేస్తున్న పనులకు, పార్టీలో చేరికలకు సంబంధం లేదని స్పష్టంచేశారు. తమకు పూర్తి మెజార్టీ ఉన్నదని, ఎవరినో భయపెట్టి చేర్చుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రభుత్వ విధానాలు నచ్చి వస్తే చేర్చుకుంటామని పేర్కొన్నారు.

ఓల్డ్ సిటీ కాదు.. ఏ సిటీకైనా వస్తాం

ప్రజల ప్రయోజనం కోసమే హైడ్రాను ఏర్పాటు చేశామని రేవంత్ అన్నారు. చెరువుల్లో నిర్మాణాలు ఉంటే ఎంతటి వారైనా వదిలేది లేదని స్పష్టంచేశారు. పార్టీలతో సంబంధం లేకుండా హైడ్రా తన పని తాను చేసుకుంటూ పోతుందని తేల్చిచెప్పారు. ఓల్డ్ సిటీ కాదు.. ఏ సిటీ అయిన వెనక్కి తగ్గేదే లేదని తెలిపారు. యుద్ధ ప్రాతిపాదికన కూల్చివేతలు పూర్తిచేస్తామని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో తన కుటుంబసభ్యుల భవనాలు ఉంటే వివరాలు ఇవ్వాలని, దగ్గరుండి వాటిని కూల్చివేయిస్తానని చెప్పారు. రాజకీయ నాయకులు, సినీహీరోలు ప్రజలకు రోల్‌మాడల్‌గా ఉండాలని సూచించారు. చెరువుల కబ్జాపై నిజనిర్ధారణ కమిటీ వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ఈ కమిటీకి హరీశ్‌రావు నేతృత్వం వహించినా స్వాగతిస్తామని అన్నారు. చెరువు శిఖం భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, వ్యవసాయం చేసుకుంటే ఇబ్బంది లేదని తెలిపారు.

మనీశ్‌సిసోడియాకు 16 నెలల తర్వాత బెయిల్ రాగా, కేజ్రీవాల్ ఇంకా జైలులోనే ఉన్నారని, కవితకు మాత్రం 5 నెలల్లోనే ఎలా బెయిల్ వచ్చిందని ప్రశ్నించారు. తాము ఇచ్చిన హామీల అమలుపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

తాగునీటి వివరాలివ్వండి

తెలంగాణ, ఏపీకి కేఆర్‌ఎంబీ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ):తెలంగాణ, ఏపీలో జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా ఉన్న జనాభాతోపాటు ఏడాదిపాటు తాగునీటి కోసం ఎన్ని నీళ్లు అవసరమన్న వివరాలను ప్రాజెక్టులవారీగా అందజేయాలని కేఆర్‌ఎంబీ తెలుగు రాష్ట్రాలకు సూచించింది. తెలంగాణ, ఏపీకి బుధవారం ప్రత్యేకంగా లేఖ రాసింది. ఏపీ పునర్విభజన చట్టానికి అనుగుణంగా తాగు, సాగునీటి వివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సి ఉన్నదని తెలిపింది. 2024–25కు సంబంధించి జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్ఎస్ టెయిల్ పాండ్, పులిచింతల, ప్రకాశం బరాజ్‌ల కింద తాగునీటిని పొందుతున్న జనాభా వివరాలను అందజేయాలని కోరింది. సెప్టెంబర్ 15లోగా వివరాలను అందజేయాలని ఇరు రాష్ట్రాలకు స్పష్టం చేసింది.

జన్వాడలో రెండో రోజూ హైడ్రామా

- ఫాంహౌస్ ముందు ఫిరంగి నాలాను సర్వే చేసిన అధికారులు
- కూల్చేస్తారని జోరుగా ప్రచారం
- గుమిగూడిన ప్రజలు.. ఉత్కంఠ
- ఉన్నతాధికారులకు నివేదికిస్తాం
- డిప్యూటీ సర్వేయర్ రత్నకుమార్



జన్వాడ ఫాంహౌస్ వద్ద పోలీసుల బందోబస్తు

మణికొండ, ఆగస్టు 28 : నగర శివారు ప్రాంతంలోని శంకర్‌పల్లి మండలం జన్వాడ ఫాంహౌస్ ముందు ఉన్న చారిత్రక బుల్కాపూర్ ఫిరంగి నాలాపై నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు బుధవారం సంయుక్తంగా సర్వే చేశారు. దాదాపు రెండు గంటలపాటు జన్వాడ గ్రామ రెవెన్యూ పరిధిలోని బుల్కాపూర్ నాలా సరిహద్దు వరకు డీజీపీఎస్ మిషన్ డిజిటల్ సర్వేను గ్రామ నక్ష ప్రకారం జిల్లా డిప్యూటీ సర్వేయర్ రత్నకుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తేజ, సర్వేయర్ సాయికుమార్ నేతృత్వంలో చేపట్టారు. ప్రదీప్‌రెడ్డికి చెందిన పాంహౌస్ ప్రధాన గేటు ముందు సర్వే మిషన్‌తో కొలతలు తీసుకున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 18 నుంచి 20 మీటర్ల వెడల్పు ఉండాల్సిన నాలా అన్ని చోట్లా 4 నుంచి 6 మీటర్ల వరకే ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు. నాలా బఫర్‌జోన్ చాలా వరకు అంతటా ఆక్రమించినట్టు వెల్లడించారు. బుల్కాపూర్ నుంచి మొత్తంగా నాలా 21 కిలోమీటర్ల వరకు ఉంటుందని, నాలా సరిహద్దులను చుట్టుపక్కల ఉన్న సర్వే నంబర్లలోని పట్టా భూమి విస్తీర్ణంతో కలిసి పూర్తిగా కొలతలు నిర్ధారిస్తామని తెలిపారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కూల్చివేస్తారంటూ ప్రచారం..

వారం నుంచీ ప్రదీప్‌రెడ్డికి చెందిన ఫాంహౌస్‌ను కూల్చివేస్తారని వస్తున్న వార్తల నేపథ్యంలో బుధవారం ఫాంహౌస్ సమీపంలో వందలాది మంది ప్రజలు గుమిగూడారు. ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠతో సర్వే తీరును ఆసక్తిగా గమనించారు. నాలాను కబ్జా చేస్తున్నారని అనేకసార్లు ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు హడావిడిగా వచ్చి సర్వే చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తంచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకే సర్వేకు వచ్చామని, ఎలాంటి కూల్చివేతలు చేయడంలేదని అధికారులు చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. నాలా అంతటా ఆక్రమణకు గురైనట్టే ప్రదీప్‌రెడ్డి ఫాంహౌస్ ప్రధానగేటు ముందు ఉన్నదని, దీనికి అధికారులు ఎందుకు హడావుడి చేస్తున్నారో అర్థంకావడంలేదని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

ఇదేం ద్వంద్వనీతి?

మొదటిపేజీ తరువాయి...

కూల్చివేతలు చేపట్టారు. ఆ తర్వాత ప్రభుత్వం గత నెల 19న హైడ్రా ఏర్పాటు, విధి విధానాలు, పరిధిని వివరిస్తూ జీవో 99ను జారీ చేసింది. ఆపై చేపట్టిన పలు కూల్చివేతల్లో భాగంగా ఈ నెల 18న ఔటర్ రింగు రోడ్డు పరిధి దాటి జీవోలో పొందుపరచని ప్రాంతాలకు కూడా హైడ్రా వెళ్లింది. చిలుకూరు, హిమాయత్‌నగర్, అప్పోజీగూడల్లో నిర్మాణాలను కూల్చివేశారు. అయితే, ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో హిమాయత్‌నగర్, అప్పోజీగూడల్లోని కూల్చివేతల వివరాలను పొందుపరచకపోవటం గమనార్హం. ముఖ్యంగా అప్పోజీగూడలో గండిపేట ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయంటూ కూల్చివేసిన మూడు నిర్మాణాలు.. వాటి పక్కనే ఉన్న వాటిని వదిలివేయటమే హైడ్రా అడుగులపై తీవ్ర సందేహాలకు తావిచ్చింది. అనుమానానికి తగ్గట్టే హైడ్రా తన నివేదికలో ఈ వివరాలను పేర్కొనలేదు. పైగా పరిధి దాటి చేపట్టిన కూల్చివేతలపై హైడ్రా ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు.

ఒవైసీకి అలా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఇలా..

హైడ్రా చివరగా ఈ నెల 24న ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేసింది. అనంతరం ఇతర శాఖలు నోటీసులు ఇవ్వటం మొదలుపెట్టాయి. ఇందులోభాగంగా ఘట్‌కేసర్ మండలం వెంకటాపురంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన విద్యాసంస్థలకు నీటిపారుదల శాఖ అధికారులు నోటీసులు జారీచేశారు. ఇదే క్రమంలో ఒవైసీ బ్రదర్స్‌కు చెందిన వైద్య కళాశాల సలకం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నట్టు సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున వైరల్ కావటంతో మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైడ్రాను ఎదుర్కొనేందుకు 40 వేల మంది విద్యార్థులు ఉన్నారని హెచ్చరించారు. ఇదే సమయంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా జీహెచ్‌ఎంసీని కూల్చివేస్తారా? అని ప్రశ్నించారు. దీంతో హైడ్రా స్వరం మారింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యాసంస్థలకు గడువు ఇస్తామని, అది ఒవైసీ అయినా, మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అయినా ఒకటేనని స్పష్టంచేశారు. తాజాగా బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియా చిట్‌చాట్‌లోనూ ఒవైసీకి చెందిన నిర్మాణానికి గడువు ఇస్తామని చెప్పారు. కానీ బుధవారమే బీఆర్ఎస్‌కు చెందిన మరో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి సంబంధించిన ఎంఎల్‌ఆర్ఐటీ, ఐఏఆర్ఈ విద్యాసంస్థలకు రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేసింది. ఏడు రోజుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలను తొలగించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మరి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన విద్యాసంస్థల్లోనూ వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒవైసీ వైద్య కళాశాలలో విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొన్న హైడ్రా.. ఇక్కడ మాత్రం ఆ అంశాన్ని విస్మరిస్తుందా?

జన్వాడ వైపు పడుతున్న అడుగులు

తాజాగా కూల్చివేతల అడుగులు జన్వాడ వైపు కొనసాగుతున్నాయి. గత రెండు రోజులుగా అక్కడ ఉన్న ఫాంహౌస్ ముందు బుల్కాపూర్ నాలాను సర్వేచేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు అసలు నాలా ఎంత వెడల్పు ఉన్నదనే వివరాలను చెప్పలేకపోతున్నారు. అది ఎంత విస్తీర్ణంలో ఉన్నా నిబంధనల ప్రకారం అక్కడ ఉన్న ప్రహరీగోడ, గేటు మాత్రమే బఫర్‌జోన్ పరిధిలోకి వస్తాయనే అంచనాకు అధికారులు వచ్చారు. దీంతో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియా చిట్‌చాట్‌లో జీవో 111 కొనసాగుతుందని చెప్పారు. అంటే నాలా నిబంధనలు సర్కారు పెద్దల కలను సాకారం చేసే పరిస్థితి లేకపోవడంతో 111 జీవోను తెరపైకి తెస్తున్నారు. ఇదే అమలైతే జన్వాడ ఫాంహౌస్ మాత్రమే దాని పరిధిలోకి వస్తుందా? 111 జీవో పరిధిలో పుట్టగొడుగుల్లా వెలిసిన విద్యాసంస్థల భవనాలు, ఇతర నిర్మాణాలకూ ఇదే సూత్రం వర్తిస్తుందా? అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. సామాన్యులు కూడా సర్పంచుల అనుమతులతో వేల నిర్మాణాలు చేపట్టినందున.. 111 జీవో పరిధిలోని గ్రామాల్లో శిథిలాలు తప్ప ఇంకేం కనిపిస్తాయి? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా సీఎం రేవంత్‌రెడ్డి 111 జీవో అమలులో ఉంటుందని సెలవిస్తుండగా.. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాత్రం 111 జీవో పరిధిలో ఒక్క నిర్మాణాన్నీ కూల్చనివ్వబోమని స్పష్టం చేశారు. సీఎం ఒకలా, మంత్రి ఇంకోలా మాట్లాడటంపై సామాన్యుల్లో సందేహాలు కలుగుతున్నాయి. కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు నిర్మాణాన్ని కూల్చామని మంత్రులు, సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా.. ఇంకా పల్లం రాజు నిర్మాణం ఇంకా పదిలంగా ఎందుకు ఉన్నది? అనేదానికి ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పటం లేదు.

• కృష్ణాకు మళ్లీ మొదలైన వరద



గద్వాల/శ్రీశైలం/నందికొండ, ఆగస్టు 28 : కృష్ణా, తుంగభద్ర నదులకు మళ్లీ వరద మొదలైంది. బుధవారం జూరాలకు 2.44 లక్షల క్యూసెక్కులు రాగా.. 45 గేట్లు ఎత్తి దిగువకు 2,86,740 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 2,14,334 క్యుసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తుండగా నాలుగు గేట్లు తెరిచి 1,12,300 దిగువకు వదులుతున్నారు. కాగా నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద ఉధృతి కొనసాగుతుండడంతో డ్యామ్ 18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. బుధవారం సాగర్‌కు 1,94,758 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా క్రస్ట్ గేట్ల ద్వారా 1,45,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.50 టీఎంసీలు) కాగా ప్రస్తుతం పూర్తి స్థాయిలో నిండింది.

తెలంగాణకు 31 కొత్త ఎఫ్‌ఎం స్టేషన్లు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ ఎఫ్‌ఎం స్టేషన్ల మూడో దశలో భాగంగా తెలంగాణలో 31 స్టేషన్లు ఏర్పాటు కానున్నట్టు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్, కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నల్గొండ, రామగుండం, సూర్యాపేట జిల్లాలకు మూడు చొప్పున రేడియో చానల్స్, నిజామాబాద్ జిల్లాకు 4 చానల్స్ కేటాయించారని పేర్కొన్నారు.

కూల్చివేతలు నిబంధనలకు లోబడి ఉండాలి

మొదటిపేజీ తరువాయి...

మల్కాజిగిరి జిల్లా గండిమైసమ్మ మండలం)లోని 480–483 సర్వే నంబర్లలో మారుతి ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన 10 ఎకరాలు, మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన 17.20 ఎకరాల్లో ఆక్రమణలున్నాయంటూ ఈ నెల 22న గండిమైసమ్మ ఎమ్మార్వో ఇచ్చిన నోటీసులను సవాలు చేస్తూ ఆ రెండు విద్యా సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ జరిపారు. చిన్నదామెర చెరువులో 8.25 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయంటూ తాసిల్దార్ ఇచ్చిన నోటీసును రద్దు చేయాలని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి కోరారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించకుండా తాసిల్దార్ ఏకపక్షంగా నోటీసు ఇచ్చారని పేర్కొంటూ.. చట్టప్రకారం సర్వే నిర్వహించి సరిహద్దులు నిర్ణయించేలా తాసిల్దార్‌కు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మర్రి విద్యాసంస్థల్లో దాదాపు 5 వేల మంది విద్యార్థులు ఉన్నారని, కూల్చివేత చేపడితే వారంతా ఇబ్బందులకు గురౌతారని చెప్పారు. ఆ విద్యా సంస్థల నిర్మాణాలకు 2007లోనే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ ఈవోల నుంచి అనుమతులు పొందారని, ఇప్పుడు వాటిని అక్రమణలని ఏకపక్షంగా చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ.. చిన్నదామెర చెరువులోకి ఆక్రమణదారులు మురుగునీటిని వదులుతున్నారని, అక్కడ ఆక్రమణలు ఉన్నాయని అడ్వకేట్ కమిషన్ నివేదించడంతో ఆ ఆక్రమణలను తొలగించాలని గతంలో ద్విసభ్య ధర్మాసనం ఆదేశించిందని గుర్తుచేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ఆక్రమణలను కూల్చివేయాలని గతంలో సుప్రీంకోర్టు కూడా ఉత్తర్వులు జారీ చేసిందని హైడ్రా తరపు న్యాయవాది కటిక రవీందర్‌రెడ్డి చెప్పారు. ఈ వాదనల అనంతరం జస్టిస్ కే లక్ష్మణ్ స్పందిస్తూ.. హైకోర్టు తోపాటు జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా తాసిల్దార్ 7 రోజుల గడువుతో కూల్చివేత నోటీసులు ఇవ్వడం, ఇప్పుడు కూల్చివేతలకు హైడ్రా రంగంలోకి దిగడంతో ఆ విద్యాసంస్థలు ఆందోళన చెందుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో తాసిల్దార్ ఇచ్చిన నోటీసులను రద్దు చేసి, వాటిని షోకాజ్ నోటీసులుగా మారుస్తున్నామని తెలిపారు. పిటిషనర్లు చూపిన ఆధారాలను పరిశీలించాక చట్ట ప్రకారం హైడ్రా ముందుకువెళ్లాలని స్పష్టం చేస్తూ.. మర్రి, మారుతీ విద్యాసంస్థల పిటిషన్లపై విచారణ ముగిసినట్టు ప్రకటించారు

అప్పటివరకు కూల్చివేతలు చేపట్టొద్దు

ఎమ్మెల్యే పల్లా విద్యా సంస్థల కేసులో హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొర్రాముల (వెంకటాపూర్)లోని నాదం చెరువుకు సంబంధించిన రికార్డులను సమర్పించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉన్నాయంటూ అధికారులు అత్యుత్సాహం చూపుతున్నారని పేర్కొంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్సిటీ, గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, నీలిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మరోసారి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ టీ వినోద్‌కుమార్ బుధవారం విచారణ జరిపారు. పిటిషనర్లు అన్ని అనుమతులు తీసుకుని 17.21 ఎకరాల్లో విద్యాసంస్థలను నిర్మించినట్టు వారి తరపు సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కూల్చివేత చర్యలు చట్టానికి లోబడి ఉండాలని స్పష్టం చేస్తూ ఇటీవల హైకోర్టు వెలువరించిన ఉత్తర్వులకు విరుద్ధంగా అధికారుల చర్యలు ఉన్నాయని, విద్యార్థులకు ఇబ్బందుల్లేకుడా సెలవుల్లోనే కూల్చివేతలు చేపడతామని చెప్పిన హైడ్రా అందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని వివరించారు. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించిన జస్టిస్ వినోద్‌కుమార్.. అప్పటివరకు పిటిషనర్ల నిర్మాణాలను కూల్చరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.



ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసిన సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం

- మాస్కో సదస్సుకు ఆహ్వానించిన స్కోల్‌కోవో సంస్థ
- ఫెస్టివల్ ఆఫ్ ఫ్యూచర్ సదస్సులో ప్రసగించాలని విన్నపం
- వచ్చే 5 నుంచి 7 వరకు మాస్కోలో ప్రతిష్ఠాత్మక సదస్సు
- ఆవిష్కరణల్లో కేటీఆర్ కృషి అద్భుతమని కితాబు




హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరోసారి అరుదైన గౌరవం దక్కింది. రష్యాలోని మాస్కోలో తాము నిర్వహించే ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌లో ప్రసంగించాలని ఆయనకు స్కోల్‌కోవో సంస్థ ఆహ్వానం పంపింది. 'ఫ్యూచరిస్టిక్' అనే అంశంపై భవిష్యత్తు అవకాశాలు, వినియోగించుకునే విధానాలపై ప్రసంగించాలని కేటీఆర్‌కు ప్రత్యేక ఆహ్వానం పంపడం విశేషం. రష్యా ప్రభుత్వం ఆధ్వర్యంలో 2024 సెప్టెంబర్ 5 నుంచి 7 వరకు 'ఫెస్టివల్ ఆఫ్ ది ఫ్యూచర్ పోర్టల్ 2030-2050' లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

కేటీఆర్ కృషి అద్భుతం

తెలంగాణలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించే విషయంలో కేటీఆర్ చేసిన కృషి అద్భుతమని ఆహ్వాన పత్రికలో స్కోల్‌కోవో ఫౌండేషన్ నిర్వాహకులు అభినందించారు. 'మీకు ఉన్న అనుభవాన్ని మాతో పంచుకునేందుకు మిమ్మల్ని ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంచుకున్నాం. మీ రాక మాకు ఎంతో గౌరవం' అని నిర్వాహకులు కేటీఆర్‌ను ప్రశంసించారు.

కార్యక్రమం ద్వారా 2030-2050 ప్రముఖ శాస్త్రవేత్తలు, భవిష్యత్తు శాస్త్రవేత్తలు, కళారంగానికి చెందిన పలు రంగాల ప్రముఖులను ఒక్కచోటుకు తీసుకొచ్చి భవిష్యత్తు తరానికి ఓ వేదికను అందించడమే తమ ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. సదస్సులో ఫ్యూచరాలజిస్టులు, ప్రపంచస్థాయి మేధావులు, శాస్త్రవేత్తలు, టెక్నాలజీ రంగ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తలు పాల్గొంటారు. భవిష్యత్తులో మరింత మెరుగైన అవకాశాలను సృష్టించడంపై చర్చిస్తారు. ఈ వేదిక టెక్నాలజీ, ఆర్థికరంగంలో ఉన్నత అవకాశాలు కల్పించేందుకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. స్టార్టప్ ప్రాజెక్టులను సిద్ధం చేసిన విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సరైన అవకాశాలు కల్పించేందుకు తోడ్పడుతుందని మాస్కో స్కోల్‌కోవో సంస్థ వెల్లడించింది.

లోకం పోకడ



సాగులో ముందడుగు వేయాలి

- సౌర విద్యుత్తుపై రైతులకు అవగాహన కల్పించాలి
- వరంగల్ నగరం నిరంతర సుస్థిరాభివృద్ధి సాధించాలి
- వరంగల్ జిల్లా పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సులో బోటులో ప్రయాణిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క, అధికారులు

వరంగల్/ములుగు, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వ్యవసాయ రంగంలో తెలంగాణ ముందుండాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. పీఎం కుసుమ్ యోజన ద్వారా సౌర విద్యుత్తును వినియోగించుకునేందుకు కేంద్రప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. సౌర విద్యుత్తుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వరంగల్ చారిత్రక, వారసత్వ నగరమని, కాకతీయ రాజుల సామ్రాజ్య నగరంగా వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నదని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం నగరంలో పర్యటించారు. ములుగు జిల్లా లక్నవరం నుంచి ఉదయం రోడ్డు మార్గంలో వరంగల్ నిట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. చారిత్రక, వారసత్వ సంపద కలిగిన వరంగల్ నగరం మరింత సుస్థిరాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. వరంగల్‌లో వందల ఏండ్ల నాటి వారసత్వ కట్టడాలు అద్భుతంగా ఉన్నాయని, కాకతీయుల కాలంనాటి శిల్ప సంపద అపూర్వమని, నాటి కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని పేర్కొన్నారు. రామప్ప, వేయి స్తంభాల దేవాలయం వంటి ఎన్నో అత్భుత కట్టడాలను చూడటం మరిచిపోలేని అనుభూతినిచ్చిందని చెప్పారు. హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో ప్రధాన అర్చకుకుడు గంగు ఉపేంద్రశర్మ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అక్కడి నుంచి భద్రకాళీ అలయానికి వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఖిలావరంగల్‌లోని కాకతీయుల రాజధానిగా ఉన్న చారిత్రక ప్రాంతానికి వెళ్లారు. అక్కడ కాకతీయ రాజుల కాలం నాటి శిల్ప సంపదను, కట్టడాలను తిలకించారు. పురవస్తు శాఖ అధికారులు అక్కడి కట్టడాల గురించి గవర్నర్‌కు వివరించారు. కవులు, రచయితలు, క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు, జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాలలో అవార్డులు పోందిన 40 మందితో గవర్నర్ చర్చా గోష్టి నిర్వహించారు. అనంతరం వారితో కలిసి గవర్నర్ భోజనం చేశారు. హనుమకొండలోని రెడ్‌క్రాస్ సంస్థ భవనాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించారు. అక్కడ తలసేమియా బాధిత పిల్లలను పరామర్శించారు. కొత్తగా నిర్మించిన రెడ్‌క్రాస్ సంస్థ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శాసన మండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాశ్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, గ్రేటర్ వరంగల్ మేయర్ సుధారాణి, ఎమ్మెల్సీలు బస్వరాజ్ సారయ్య, తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కేఆర్ నాగరాజు, కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం పాల్గొన్నారు.

ఒక గ్రామాన్ని దత్తత తీసుకుంటా: గవర్నర్

బుధవారం ఉదయం మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి లక్నవరం సరస్సులో గవర్నర్ స్పీడ్ బోటు షికారు చేశారు. ములుగు జిల్లాలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించారు. గవర్నర్ పర్యటనకు సహకరించిన కలెక్టర్, పోలీసులు, ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తిరుగు ప్రయాణంలో గవర్నర్ ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాను సందర్శించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. విషపురుగు కాటుకు గురైన కానిస్టేబుల్‌ను పరామర్శించారు.

- మాట నిలబెట్టుకున్న కేటీఆర్



కేటీఆర్ మరోసారి మంచి మనసు చాటుకున్నారు. ప్రేమోన్మాది చేతిలో తల్లిదండ్రులను కోల్పోయిన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం 16చింతలతండాకు చెందిన దీపిక, మదన్‌కు రూ.5 లక్షల సాయం చేస్తానని వారిని పరామర్శించిన సందర్భంగా మాటిచ్చారు. మాట ప్రకారం.. రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దంపతుల ద్వారా బుధవారం నర్సంపేటలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. - చెన్నారావుపేట

- మోదీ ఫ్లెక్సీ దహనం..



మద్యం పాలసీ కేసులో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మోదీనేనని ఆరోపిస్తూ బుధవారం ఆయన ఫ్లెక్సీని బీఆర్ఎస్ కార్యకర్తలు దహనం చేశారు. కవితకు బెయిల్ మంజూరు కావడంతో రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు వరంగల్ మండిబజార్‌లో స్వీట్లు పంచారు. -గిర్మాజీపేట

బదిలీలు, పదోన్నతుల్లో తప్పులు సవరించండి

- డిస్‌లొకేట్, 317 బాధితులకు న్యాయం చేయండి
- ఏటీజీఆర్ఈఐఈడబ్ల్యూ అసోసియేషన్ డిమాండ్
- సీఎంవోలో ఉన్నతాధికారులకు వినతిపత్రం

హైదరాబాద్, ఆగస్టు28 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో ఇటీవల చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో అనేక తప్పులు దొర్లాయని, ఫలితంగా టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వాటిని సవరించాలని ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏటీజీఆర్ఈఐఈడబ్ల్యూఏ) డిమాండ్ చేసింది. డిస్‌లొకేట్, 317 జీవో బాధిత ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు, పలువురు మంత్రులకు, సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి అసోసియేషన్ అధ్యక్షుడు కూకుట్ల యాదయ్య, జనరల్ సెక్రటరీ పాపిరెడ్డి, ట్రెజరర్ బసవయ్య బుధవారం వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులకు సమస్యలు విన్నవించారు. అన్ని సొసైటీల్లో జీవో 80 ప్రకారం వెబ్ కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తే, అందుకు విరుద్ధంగా సోషల్ వెల్ఫేర్ సొసైటీ మాన్యువల్ కౌన్సిలింగ్ చేపట్టిందని, ఫలితంగా గందరగోళం నెలకొన్నదని తెలిపారు. కామన్ సీనియార్టీ జాబితా వల్ల అనేక మంది టీచర్లు డిస్‌లొకేట్ అయ్యారని, సబ్ కమిటీ నివేదిక రాకముందే 317 జీవో ద్వారా ఉద్యోగులను రిలీవ్ చేశారని వాపోయారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టులకు ప్రమోషన్లు కల్పించారని తెలిపారు. మొత్తంగా బదిలీలు, పదోన్నతులపై సమగ్ర విచారణ జరపాలని, నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కొనుగోలు కేంద్రాలు పెట్టరా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

- మార్క్‌ఫెడ్ సెంటర్ల ఏర్పాటులో ఇంత నిర్లక్ష్యమా?
- పప్పు దినుసుల రైతుల ఆశలు అడియాసలైనయ్
- పెసర క్వింటాల్‌పై 2500 నష్టపోతున్నరు
- ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపాటు



హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు తక్కువ ధరకు పంటను అమ్ముకోవాల్సి వస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం బహిరంగ లేఖ రాశారు. పప్పు దినుసుల సాగుతో మెరుగైన లాభాలు సాధించవచ్చనుకున్న రైతుల ఆశలు అడియాసలయ్యానని చెప్పారు. 'కేంద్రం ఈ ఏడాది క్వింటాలు పెసరకు మద్దతు ధర రూ.8,682 ప్రకటించినా ఆ ధరకు ఎవరూ కొంటలేరు. చేసేది లేక రైతులు వ్యాపారులకు రూ.6,000 నుంచి రూ.6,500కే అమ్ముకుంటున్నరు. దీంతో క్వింటాల్‌పై రూ.2,500 పైగా నష్టపోతున్నరు' అని లేఖలో పేర్కొన్నారు. వ్యాపారులు మద్దతు ధరకు పంట కొనుగోలు చేయని పరిస్థితుల్లో గత కేసీఆర్ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. దీంతో మార్కెట్‌లో పోటీ ఏర్పడి వ్యాపారులు కూడా ఎక్కువ చెల్లించి కొనుగోలు చేశారని చెప్పారు. ఈ సంవత్సరం మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. 'ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం పెసర రైతులకు శాపంగా మారింది. ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, నారాయణపేట, సూర్యపేట తదితర జిల్లాల రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నరు' అని తెలిపారు. రుణమాఫీ, రైతుబంధును అటకెక్కించారని, వరికి రూ.500 బోనస్ మాటను బోగస్ చేశారని, ఇప్పుడు మద్దతు ధరకు కొనుగోలు బాధ్యతను విస్మరించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి వ్యవసాయ, రైతు వ్యతిరేక విధానాలను వీడాలని, మార్క్‌ఫెడ్ కేంద్రాలు పెట్టి పెసర దిగుబడులు కొనాలని డిమాండ్ చేశారు.

కొడంగల్‌లో బడుల మూత సిగ్గుచేటు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఉపాధ్యాయులు లేక పాఠశాల మూతపడటం సిగ్గుచేటని హరీశ్‌రావు బుధవారం ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. 15 రోజుల నుంచి పాఠశాల నడవకున్నా ఎవరూ పట్టించుకోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

'**ప్రతి మండలంలో** ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని మ్యానిఫెస్టోలో చెప్పి, ఇప్పుడు ఉన్న ప్రభుత్వ స్కూళ్లను మూతపడేలా చేస్తున్నారు. పేద పిల్లలకు ప్రాథమిక విద్యను దూరం చేస్తున్నారు. పాఠశాలలు మూతపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? విద్యాశాఖ సీఎం వద్దే ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నట్టు?' అంటూ ప్రశ్నించారు. తక్షణమే వలంటీర్లను నియమించి పాఠశాలలను మూతపడకుండా చూడాలని డిమాండ్ చేశారు.

రేవంత్ సీఎం కావడం మోదీ చాయిస్

- చరిత్రలో పరమ చెత్త కేసుల్లో లిక్కర్ కేసు ఒకటి
- నిరాధార కేసు అని మొదటి నుంచి చెబుతున్నా పట్టించుకోని సీబీఐ, ఈడీ
- కవిత కడిగిన ముత్యంలా బయటకు వచ్చారు
- ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : రేవంత్‌రెడ్డి సీఎం కావడం ప్రధాని మోదీ చాయిసేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ మోదీకి బీటీమ్‌గా పనిచేస్తున్నదని, మోదీ దగ్గర రేవంత్‌కు ఉన్న ప్రాధాన్యత కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు లేదని తెలిపారు. బుధవారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. చరిత్రలో సీబీఐ, ఈడీ నమోదు చేసిన వాటిల్లో లిక్కర్ కేసు పరమ చెత్తదని వ్యాఖ్యానించారు. కోర్టులో సాక్ష్యాలపై న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సీబీఐ, ఈడీ తరపు న్యాయవాదులు తటపటాయించడం చూస్తుంటే రాజకీయపరంగా పెట్టించిన కేసు అనేది మరోసారి నిర్ధారణ అయిందని తెలిపారు. ఈ కేసు నిరాధారమైనదని బీఆర్ఎస్ తరపున తాము మొదటి నుంచి చెబుతున్నామని పేర్కొన్నారు. ఎవరో చెప్పారని అరెస్టు చేసి జైలులో పెట్టినప్పటికీ కోర్టులో కవితకు న్యాయం జరిగిందన్నారు. తాము ఊహించినట్టుగానే కవిత కడిగిన ముత్యంలా బయటకు వచ్చారని, చిన్న ఆధారం లేకుండా, ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా, కేవలం రాజకీయ ఒత్తిళ్లతో సీబీఐ, ఈడీ చేసిన ప్రయత్నమని బహిరంగంగా అర్థం అవుతుందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్, కేజ్రీవాల్‌ను ఇబ్బంది పెట్టడానికే ఈ కేసు పెట్టారని ఆరోపించారు. నోట్ల కట్టలతో, వీడియోలతో పట్టపగలు దొంగగా దొరికి అధికారం చలాయిస్తున్న వారికి నిరాధార కేసులో కవిత బెయిల్‌పై వస్తే ఏడుపెందుకని ప్రశ్నించారు. లిక్కర్ కేసులో రాహుల్, రేవంత్ తొలి నుంచి విరుద్ధంగా మాట్లాడుతున్నారని, ఢిల్లీలో లిక్కర్ కేసు ఫేక్ అని రాహుల్ అంటే.. అదే కేసుపై తెలంగాణలో రేవంత్ మాత్రం కుంభకోణం అంటాడని, ఇదేం కాంగ్రెస్సో, వారేం నాయకులో అర్థం కావడం లేదని మండిపడ్డారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలపై మాట్లాడని బీజేపీ ఇంకా రాష్ట్రంలో బీఆర్ఎస్సే అధికారంలో ఉన్నట్టు భావిస్తున్నదని, అందుకే తమ పార్టీపైనే దాడి చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దీని ద్వారా వారి బలహీనతలు, వారి ఐక్యత అర్థం అవుతుందని అన్నారు. కర్ణాటకలోని వాల్మీకి కుంభకోణంలో టీ కాంగ్రెస్ నేతల ప్రమేయం ఉన్నా బీజేపీ నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.



సొంత గడ్డలో ఘనస్వాగతం

• చెల్లికి అండగా అన్న..



ఆనందంతో కవితను హత్తుకున్న కేటీఆర్

• స్వాగతం పలుకుతున్న సంతోష్..



శంషాబాద్ విమానాశ్రయంలో కవిత వెంట వస్తున్న సంతోష్‌కుమార్. చిత్రంలో కేటీఆర్, కవిత భర్త అనిల్, కుమారుడు ఆదిత్య తదితరులు

• ఇరుగు దిష్టి.. పొరుగు దిష్టి పోవాలని..



ఇంటికి చేరుకున్న కవితకు దిష్టి తీస్తున్న మహిళ

• వ్యవసాయ కూలీల సంబురం



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆత్మకూరు(ఎం) మండలంలోని రాఘవాపురం శివారులో బుధవారం పొలం వద్ద రైతులు, వ్యవసాయ కూలీలు సంబురాలు జరుపుకొన్నారు. వరి పొలంలో కలుపు తీసేందుకు వచ్చిన మహిళా కూలీలు బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి స్వీట్లు పంచుకున్నారు. – ఆత్మకూరు(ఎం)



బంజారాహిల్స్‌లోని ఇంటి వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న కవిత

• పార్టీ శ్రేణులతో ర్యాలీగా ఇంటికి..



పార్టీ కార్యకర్తలతో కలిసి శంషాబాద్ విమానాశ్రయం నుంచి ర్యాలీగా ఇంటికి వెళ్తున్న కవిత

కష్ట కాలంలో అన్నీ తానై..

అనుక్షణం కవితకు తోడుగా నిలిచిన కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): అన్న అంటే అమ్మ+నాన్న అని కేటీఆర్ రుజువు చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు రంగం సిద్ధమైన క్షణం నుంచి జైలు నుంచి ఆమె బెయిల్‌పై విడుదలయ్యే వరకు అనుక్షణం కేటీఆర్ తోడుగా నిలిచారు. ఒక అన్నగా తన బాధ్యతలను సంపూర్ణంగా నిర్వర్తించారు. కవితకు సంబంధించిన లీగల్ వ్యవహారాలన్నీ దగ్గరుండి చూసుకోవడమే కాకుండా మధ్యమధ్యలో తీహార్ జైలుకు వెళ్లి తన చెల్లికి భరోసానిచ్చారు. కోర్టులో బెయిల్ కోసం కృషి చేయడం నుంచి కుటుంబాన్ని ధైర్యంగా ఉంచడం వరకు.. కవిత ఎపిసోడ్‌లో కేటీఆర్ పోషించిన పాత్రకు ప్రశంసలు దక్కుతున్నాయి.

మదినిండా సంతోషం

మాజీ ఎంపీ సంతోష్‌కుమార్

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): 'సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. మీరు ఇల్లు చేరిన సందర్భంలో సంతోషంతో మది ఉప్పొంగుతున్నది' అని మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత బుధవారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోగానే ఆయన తన కుటుంబ సభ్యులతో వెళ్లి స్వాగతం పలికారు. ఆమెను స్వాగతించే ఉద్విగ్న దృశ్యాలను తన ఎక్స్‌వేదికగా షేర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన 'మీరు ఇంటికి చేరడం సంతోషంగా ఉన్నది. క్లిష్ట సమయాల్లో ధైర్యం, పట్టుసడలని నిబ్బరం మీ వెంటే ఆశాదీపంగా ఉన్నాయి' అని పేర్కొన్నారు.

బీజేపీతో బీఆర్ఎస్ రాజీ పడలేదు

రాజీ అయితే కవిత భాష అలా ఉండేది కాదు: టీజీ వెంకటేశ్

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): బీజేపీతో బీఆర్ఎస్ రాజీ పడలేదని మాజీ మంత్రి, బీజేపీ నేత టీజీ వెంకటేశ్ స్పష్టం చేశారు. బుధవారం తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం అనేది హాస్యాస్పదమని అన్నారు. విలీనమే అంటే ఇంత తతంగం ఉండేది కాదని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజీలేదని, రాజీ ఉంటే బెయిల్‌పై విడుదలైన తరువాత కవిత భాష అలా ఉండేది కాదని చెప్పారు.

• కిక్కిరిసిన శంషాబాద్



కవితకు స్వాగతం పలకడానికి శంషాబాద్ విమానాశ్రయానికి భారీగా వచ్చిన అభిమానులు, కార్యకర్తలు

వసంత విహార్‌లో కోలాహలం

• కవితను కలిసేందుకు వచ్చిన బీఆర్ఎస్ నేతలతో సందడి
• ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : ఢిల్లీలోని వసంత విహార్ బీఆర్ఎస్ శ్రేణులతో కోలాహలంగా మారింది. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మంగళవారం సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో తీహార్ జైలు నుంచి విడుదలైన ఆమె నేరుగా ఢిల్లీలోని బీఆర్ఎస్ కార్యాలయమైన తెలంగాణ భవన్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కొందరు ఎమ్మెల్సీలు, పార్టీ శ్రేణులు వసంత విహార్‌లోని పార్టీ కార్యాలయంలోనే బసచేశారు. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ఆమె బయలుదేరుతారనే విషయాన్ని తెలుసుకున్న పార్టీ శ్రేణులు, నాయకులు, వివిధ వర్గాల ప్రముఖులు తెలంగాణ భవన్‌కు చేరుకోవడంతో అక్కడ అంతా సందడిగా మారింది.

అన్నతో ఆనందం.. కొడుకుతో వాత్సల్యం

తన అన్న కేటీఆర్, కొడుకు ఆదిత్యతో కవిత కొద్దిసేపు సరదాగా గడిపారు. ఉదయం నుంచే ఆమెను కలిసేందుకు పార్టీ శ్రేణులు పోటీపడ్డారు. హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలను ఆమె పేరుపేరునా పలకరించారు. ఆమెతో వారు ఫొటోలు దిగారు. తనను కలిసిన జాతీయ మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు ముచ్చటించారు. తరువాత సీబీఐ చార్జిషీట్‌పై వర్చువల్ విచారణలో పాల్గొన్నారు. అనంతరం భర్త అనిల్‌రావు, కొడుకు ఆదిత్య, అన్న కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీలు దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శంభీపూర్ రాజు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, పాడి కౌశిక్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, అనిల్ జాదవ్, బీ లక్ష్మారెడ్డి, ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నన్నపునేని నరేందర్, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, కర్నె ప్రభాకర్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గజ్జెల నగేశ్, కే వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, వై సతీశ్‌రెడ్డి తదితరులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం కేటీఆర్ సహా నేతలంతా ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు.

కాంగ్రెస్, బీజేపీ విమర్శలు అర్థంలేనివి

ఆడబిడ్డ బెయిల్‌పై రాజకీయాలొద్దు: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవిత బెయిల్ అంశంపై రాజకీయాలు వద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హితవు పలికారు. రాజకీయాలు చేయాలనుకుంటే కేసీఆర్, కేటీఆర్‌పై పోరాడాలని కాంగ్రెస్, బీజేపీ నాయకులకు సూచించారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కవితపై వచ్చిన ఆరోపణలపై కోర్టునిర్ణయం తీసుకుంటుందని, కాంగ్రెస్, బీజేపీ నేతలు అర్థంలేని విమర్శలు మానుకోవాలని కూనంనేని సూచించారు. చెరువులు, ప్రభుత్వ భూములు, వక్ఫ్, దేవాదాయ భూములలో కబ్జాలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైడ్రా అంటే ఆక్రమణదారులకు భయం పుట్టాలని, కూల్చివేతలు చేపట్టే ముందు పేద, మధ్యతరగతి ప్రజలకు పునరావాసం కల్పించాలని కోరారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.

బెయిల్‌పై నీచ రాజకీయాలు

• మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవితకు బెయిల్ విషయంలో కాంగ్రెస్, బీజేపీలు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాయని, ఆ రెండు పార్టీలది అనైతిక వాదన అని, రాజకీయం కోసం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులపై బురద జల్లుతున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఢిల్లీ మద్యం పాలసీ విషయంలో కవిత మీద మోపిన అభియోగాలకు ఎలాంటి నైతికత లేదని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం రాజకీయ కక్షతో మోపిన కేసు ఇదని, జాతీయ స్థాయిలో పరస్పర విరుద్ధ సిద్ధాంతాలు, అభిప్రాయాలతో ఉన్న రెండు రాజకీయ పార్టీలు, రాష్ట్రంలో మాత్రం ఒక్కటిగా పని చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రమంత్రి హోదాలో బండి సంజయ్, ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రకటనలు సిగ్గుచేటు అని విమర్శించారు. కాంగ్రెస్ అధిష్ఠానం రేవంత్ వ్యాఖ్యల విషయంలో స్పందించాలని కోరారు. మనీశ్ సిసోడియా బెయిల్, కేజ్రీవాల్ అరెస్ట్ విషయంలో నిందితులకు మద్దతు పలికిన కాంగ్రెస్.. కవిత బెయిల్ విషయంలో మాత్రం నీచ రాజకీయాలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

పోరాటం ఆగదు

మొదటిపేజీ తరువాయి...

పరిస్థితుల్లో వెనడుగువేసే ప్రసక్తే లేదని తెలిపారు. తన విడుదల కోసం వేచిచూసిన తెలంగాణ సమాజానికి ఆమె వినమ్రంగా చేతులెత్తి మొక్కారు. అంతిమ విజయం సాధించే దాకా నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని పేర్కొన్నారు. అనంతరం హైదరాబాద్‌లో తన ఇంటి వద్ద కూడా కవిత మాట్లాడారు. న్యాయం, ధర్మం గెలుస్తుందని అన్నారు. ప్రజాక్షేత్రంలో ఇంకా బలంగా పనిచేస్తామని, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అనేక పోరాటాల్లో పాల్గొంటానని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న కవిత. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కవితకు అపూర్వ స్వాగతం

ఐదున్నర నెలల తర్వాత హైదరాబాద్‌లో అడుగుపెట్టిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు అపూర్వ స్వాగతం లభించింది. మంగళవారం జైలు నుంచి విడుదలైన కవిత బుధవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి బయలుదేరి సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. కవిత వెంట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సోదరుడు కేటీఆర్, భర్త అనిల్, కుమారుడు ఆదిత్య నగరానికి చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆమెకు వేల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, జాగృతి నాయకులు, మహిళా నాయకులు, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, కుటుంబసభ్యులు, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఇతర ప్రముఖులు స్వాగతం పలికారు. జై తెలంగాణ, జై కవితక్క, జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తించారు. చాలా రోజుల తర్వాత ఆమెను చూసిన బీఆర్ఎస్ శ్రేణులు, జాగృతి నాయకులు, మహిళలు భావోద్వేగానికి గురయ్యారు. అభిమానులు పూలవర్షం కురిపించారు. వారికి పిడికిలెత్తి జై తెలంగాణ అంటూ కవిత అభివాదం చేశారు. వేల మంది వందల కార్లతో శంషాబాద్ నుంచి బంజారాహిల్స్ ఇంటికి చేరుకున్నారు. ఢిల్లీ నుంచి ఆమె వెంటవచ్చిన వారిలో రాజ్యసభసభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సునీతాలక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాజీమంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శేరి సుభాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ గుప్తా, బాల్క సుమన్, పైలట్ రోహిత్‌రెడ్డి, కే వాసుదేవరెడ్డి తదితులు ఉన్నారు.

తల్లికి పాదాభివందనం చేసి..

రాత్రి ఏడు గంటల సమయంలో కవిత ఇంటికి చేరుకున్నారు. ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు. గులాబీ పూల వర్షం కురిపించారు. పార్టీ నాయకులు ఎదురుగా వెళ్లి స్వాగతం పలికారు. బాణాసంచా కాల్చారు. లంబాడీ మహిళలు తమ సంప్రదాయ నృత్యాన్ని చేశారు. ఇంటి వద్ద కూడా కవిత జై తెలంగాణ అని నినదించారు. అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కవితకు దిష్టి తీసి ఇంట్లోకి ఆహ్వానించారు. ఇంట్లోకి రాగానే పూజగదిలో దేవుడికి సాష్టాంగ నమస్కారం చేశారు. తల్లి శోభమ్మకు పాదాభివందనం చేశారు. ఆ సమయంలో ఇరువురు భావోద్వేగానికి గురయ్యారు. కవితను పరామర్శించడానికి కేటీఆర్ సతీమణి శైలిమ, హరీశ్‌రావు సతీమణి శ్రీనిత, ఇతర బంధువులు పెద్దఎత్తున తరలివచ్చారు.

కేటీఆర్‌కు రాఖీ కట్టిన కవిత

హైదరాబాద్‌లో ఇంటికి చేరుకున్న అనంతరం తన అన్న కేటీఆర్‌కు కవిత రాఖీ కట్టారు. రాఖీ పండుగ రోజున కవిత జైల్లో ఉండి రాఖీ కట్టలేకపోయారు. దీంతో ఇంటికి చేరుకోగానే రాఖీ కట్టి, స్వీట్ తినిపించారు. ఈ సందర్భంగా కవిత భావోద్వేగానికి గురయ్యారు. ఆమెను కేటీఆర్ అలింగనం చేసుకొని ధైర్యం చెప్పారు. ఈ ఫొటోను కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ.. 'ఇప్పుడు రాఖీపండుగకు సంపూర్ణత చేకూరింది' అని పేర్కొన్నారు. కవితను ఇంటి వద్ద కలిసినవారిలో పార్టీ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ముఠా గోపాల్, మాజీమంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పద్మా దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దేవీప్రసాద్, చెరుకు సుధాకర్, గజ్జెల నగేశ్, పల్లె రవి, మన్నె గోవర్ధన్‌రెడ్డి, మేడే రాజీవ్‌సాగర్, భిక్షపతి, జాగృతి నాయకులు నవీన్ ఆచారి, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు, భారత జాగృతి నాయకులు ఉన్నారు. కవిత హైదరాబాద్ రాక సందర్భంగా ఫైటర్‌కు స్వాగతం అంటూ నగరం మొత్తం కవిత ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులను ఏర్పాటు చేశారు.

మరో రికార్డుకు నిఫ్టీ

ముంబై, ఆగస్టు 28: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా పదోరోజు లాభాల్లో ముగిశాయి. ఐటీ, టెక్, హెల్త్‌కేర్ సూచీలకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ సూచీలు కదం తొక్కడం కలిసొచ్చింది. ముఖ్యంగా నిఫ్టీ మరో చారిత్రక గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. 34.60 పాయింట్లు అందుకొని 25,052 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 73.80 పాయింట్లు అందుకొని 81,785.56 వద్ద ముగిసింది. ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, ఇండస్ ఇండ్ బ్యాంక్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

ఎస్బీఐ బలోపేతమే లక్ష్యం

బ్యాంక్ కొత్త చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం సారథ్య బాధ్యతలు స్వీకరించిన తెలంగాణ బిడ్డ



న్యూఢిల్లీ, ఆగస్టు 28: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) సారథ్య బాధ్యతలను తెలంగాణ బిడ్డ చల్లా శ్రీనివాసులు శెట్టి స్వీకరించారు. ఎస్బీఐ చైర్మన్‌గా మంగళవారం సాయంత్రం దినేశ్ ఖారా పదవీ విరమణ చేసిన నేపథ్యంలో బుధవారం ఆయన స్థానంలోకి శ్రీనివాసులు శెట్టి వచ్చారు. ఎస్బీఐని అత్యంత విలువైన ఆర్థిక సంస్థగా నిలుపుతామని, మరిన్ని లాభాలను సాధించేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా తన సందేశంలో శెట్టి పేర్కొన్నారు. బ్యాంక్ 50 కోట్ల కుపైగా కస్టమర్లకు సేవలందిస్తుండటం గర్వకారణమన్నారు. గడిచిన దశాబ్ద కాలంలో మార్కెట్ విలువపరంగా ఎస్బీఐ 17 స్థానాలు ఎగబాకి 35వ స్థానానికి చేరినట్టు గుర్తుచేశారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఎస్బీఐ లాభం 22 శాతం వృద్ధితో రూ.61,077 కోట్లుగా నమోదైన విషయం తెలిసిందే. కాగా, ఎస్బీఐకి శెట్టి 27వ చైర్మన్. 1965 సెప్టెంబర్ 26న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్ జిల్లా (ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల్ జిల్లా)లోగల పెద్దపోతులపాడు గ్రామంలో ఆయన జన్మించారు.

36 ఏండ్లుగా..

ఎస్బీఐలో శ్రీనివాసులు శెట్టి దాదాపు 36 ఏండ్లుగా కొనసాగుతున్నారు. అగ్రికల్చర్‌లో బ్యాచ్‌లర్ ఆఫ్ సైన్స్‌ను అభ్యసించిన శెట్టి.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకర్స్ సర్టిఫైడ్ అసోసియేట్. ఇక 1988లో ఎస్బీఐ బరోడా శాఖలో ప్రొబెషనరీ ఆఫీసర్‌గా శెట్టి బ్యాంకింగ్ కెరియర్‌ను ప్రారంభించారు. వివిధ శాఖల్లో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగారు. ఇలా ఎస్బీఐ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) స్థాయికి వచ్చారు. ఈ క్రమంలోనే ఎస్బీఐ ఎండీల్లో సీనియర్‌గా ఉండటంతో శ్రీనివాసులు శెట్టి చేతికే ఇప్పుడు బ్యాంక్ పగ్గాలు దక్కాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పలు టాస్క్ ఫోర్స్‌లు/కమిటీలకూ ఈయన నేతృత్వం వహించారు. ఎస్బీఐ రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ పోర్ట్‌ఫోలియోలనూ చూశారు.

విశేష అనుభవం

గడిచిన మూడున్నర దశాబ్దాలకుపైగా కాలంలో ప్రతీ విభాగంలో తన నైపుణ్యం, ప్రతిభలతో శెట్టి మెప్పించారు. కార్పొరేట్ క్రెడిట్, రిటైల్, డిజిటల్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, డెవలప్డ్ మార్కెట్ల బ్యాంకింగ్‌లలో విశేష అనుభవాన్ని గడించారు. స్ట్రెస్డ్ అసెట్స్ రిజల్యూషన్ గ్రూప్ డిప్యూటీ ఎండీగా, కార్పొరేట్ అకౌంట్స్ గ్రూప్‌లో జీఎం-సీజీఎంగా, ఇండోర్‌లోని కమర్షియల్ బ్రాంచ్‌లో డిప్యూటీ జీఎంగా, న్యూయార్క్ ఎస్బీఐ శాఖ ఉపాధ్యక్షుడు, అందులోని సిండికేషన్స్ అధిపతిగా విధులు నిర్వర్తించారు. దీంతో శెట్టి ఆధ్వర్యంలో ఎస్బీఐ మరింత పురోగమించగలదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయిప్పుడు.

ఐవోసీ తాత్కాలిక చైర్మన్‌గా సతీశ్



న్యూఢిల్లీ, ఆగస్టు 28: ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లకు కేంద్ర ప్రభుత్వం బుధవారం తాత్కాలిక చైర్మన్‌లను ప్రకటించింది. ఈ సంస్థలకు పూర్తిస్థాయిలో చైర్మన్లను నియమించే ప్రక్రియ ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలోనే కేంద్రం ఈ మధ్యంతర నిర్ణయం తీసుకున్నది. కాగా, ఐవోసీ మార్కెటింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సతీశ్ కుమార్ వడుగూరిని ఆ సంస్థ తాత్కాలిక చైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర చమురు మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అలాగే హెచ్‌పీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా ఉన్న రజ్నీశ్ నారంగ్‌ను ఆ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా నియమిస్తూ ఆర్డర్ ఇచ్చింది. సెప్టెంబర్ 1 నుంచి మూడు నెలలపాటు వీరిరువురు ఈ పదవుల్లో ఉండనున్నారు. ఈ నెలాఖరున ఐవోసీ చైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య, హెచ్‌పీసీఎల్ చైర్మన్ పుష్ప కుమార్ జోషి పదవీ విరమణ పొందుతున్నారు. ఈ క్రమంలోనే వారి స్థానంలో సతీశ్, రజ్నీశ్‌లను తీసుకొస్తున్నారు.

అపోలోతో అవెస్తజెన్ దోస్తీ

చెన్నై, ఆగస్టు 28: లైఫ్ సైన్సెస్ కంపెనీ అవెస్తజెన్ లిమిటెడ్, అపోలో హాస్పిటల్స్ గ్రూప్‌లో భాగమైన అపోలో ఆయుర్వేద్ కలిసి ఓ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేశాయి. ఇందులోభాగంగా మెడికల్ ఫుడ్, ఇతర ఆహార పదార్థాలను తయారు చేయనున్నాయి. అవెస్తఆయుర్వేద్ అనే ఉమ్మడి బ్రాండ్ కింద వీటిని మార్కెట్‌లో విక్రయించనున్నారు. తమ ఈ భాగస్వామ్యం మెడికల్ ఫుడ్, డైటరీ సప్లిమెంట్స్ మార్కెట్‌లో గొప్ప ముందడుగు కాగలదని అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతా రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్‌లో జీక్యూజీ వాటా పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: ప్రైవేట్ ఈక్విటీ సంస్థ జీక్యూజీ పార్ట్‌నర్స్..జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్‌లో తన వాటాను 5.17 శాతానికి పెంచుకున్నది. రూ.433 కోట్లతో 0.43 శాతం వాటాను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసింది. దీంతో ప్రస్తుతం 4.74 శాతంగా ఉన్న వాటా 5.17 శాతానికి చేరుకున్నది. ఈ నెల 23న ముగిసిన కంపెనీ షేరు ధర రూ.95.85 ఆధారంగా రూ.433 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసింది. ప్రస్తుతం కంపెనీ ఢిల్లీ, హైదరాబాద్, గోవాలో విమానాశ్రయాలను నిర్వహిస్తున్నది.

నైపుణ్యంపై నజర్

- వచ్చే నాలుగేండ్లలో 50వేల మందికి శిక్షణ
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): జాతీయ చిన్నతరహా పరిశ్రమల కార్పొరేషన్ (ఎన్ఎస్ఐసీ) సహకారంతో వచ్చే 3-4 ఏండ్లలో 50వేల మంది యువతకు వివిధ విభాగాల్లో నైపుణ్య శిక్షణను అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. ఎన్ఎస్ఐసీ, తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య శాఖల మధ్య నైపుణ్య శిక్షణకు సంబంధించి బుధవారం సచివాలయంలో ఓ అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నైపుణ్యాభివృద్ధి వల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మెరుగైన మానవ వనరులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇక ఈ ఒప్పందంతో ముడి సరుకు కొనుగోలు, ఉత్పత్తుల విక్రయాల్లో చిన్న పరిశ్రమలకు ఎన్ఎస్ఐసీ సహకరిస్తుందని వివరించారు. జాతీయ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంలోనూ కృషి చేస్తుందన్నారు. అత్యధిక ఉపాధి అవకాశాలను చిన్న పరిశ్రమల ద్వారానే పెంపొందించడం సాధ్యమవుతుందని, అందుకే తమ ప్రభుత్వం వాటి వృద్ధి, విస్తరణల కోసం పాటుపడుతున్నదని చెప్పుకొచ్చారు. కాగా, జిల్లా స్థాయిలో నైపుణ్యాభివృద్ధిపట్ల ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తామని మంత్రి తెలిపారు. దీని కోసం తేజస్ (తెలంగాణ ఎంటర్‌ప్రెన్యూర్స్ జర్నీ ఫర్ యాస్పిరేషన్స్ అండ్ అచీవింగ్ సక్సెస్) పేరిట ఓ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు వెల్లడించారు. ఎన్ఎస్ఐసీ చైర్మన్ సుభ్రాంశు శేఖర్ ఆచార్య, తెలంగాణ పరిశ్రమల శాఖ కమిషనర్ మల్సూర్, టీ-వర్క్స్ సీఈవో జోగిందర్ తనికెళ్ల, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శ్రీకాంత్ నాగప్ప తదితరులు ఈ ఎంవోయూ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టెక్నో పెయింట్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

హైదరాబాద్, ఆగస్టు 28: పెయింట్స్ రంగంలో ఉన్న టెక్నో పెయింట్స్..హైదరాబాద్‌లో తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. 2,100 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో రెండు వందలకు పైగా ఉత్పత్తులను ఆఫర్ చేస్తున్నట్లు టెక్నో పెయింట్స్ సీఎండీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే ఏడాదికాలంలో అన్ని మెట్రో నగరాల్లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన ప్లాంట్లో ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించినట్లు, దేశీయంగా డిమాండ్ అధికంగా ఉండనుండటంతో ఈ యూనిట్ సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

సౌత్ ట్రిపుల్ ఆర్‌లో మరిన్ని మార్పులు

- రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా అలైన్‌మెంట్ ఉండాలని సీఎం సూచనలు
- రేడియల్ రోడ్ల భూసేకరణ వేగవంతానికి ఆదేశాలు



హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగు రోడ్డు దక్షిణ భాగం అలైన్‌మెంట్ రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగ అలైన్‌మెంట్‌లో మరిన్ని మార్పులను సూచించారు. వాటికి అనుగుణంగా మార్పులు చేసి తుది రూపునిస్తే కార్యాచరణ ప్రారంభించవచ్చని చెప్పారు. ఈమేరకు బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం, రేడియల్ రోడ్ల నిర్మాణం, డ్రైపోర్ట్‌ను సీపోర్ట్‌కు అనుసంధానించే గ్రీన్ ఫీల్డ్ రహదారిపై అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఫోర్త్ సిటీ అభివృద్ధికి అనుగుణంగా అలైన్‌మెంట్ ఉండాలని సూచించారు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించే రేడియల్ రోడ్ల భూ సేకరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. డ్రైపోర్ట్ నిర్మాణం విషయంలో మచిలీపట్నం, కాకినాడ రేవులను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. రైలు, జల మార్గంతో కూడిన ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్‌పైనా అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లు, ఫోర్త్ సిటీలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ సమీకరణ, సేకరణ విషయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓఆర్ఆర్ -ఆర్ఆర్ఆర్ మధ్య రావిర్యాల నుంచి అమన్‌గల్ వరకు నిర్మించే రహదారిలో మూడు చోట్ల ఉన్న అటవీ ప్రాంతాలను నైట్ సఫారీలుగా మార్చే అంశంపై కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ఫోర్త్ సిటీలోని పరిశ్రమలకు అటవీ ప్రాంతాలను అనుసంధానిస్తే అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందంటూ అమెరికాలోని యాపిల్ పార్క్‌ను ఉదహరించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాస రాజు, సీఎస్ శాంతి కుమారి పాల్గొన్నారు.

'విద్యుత్తు ఉద్యమం పార్టీలకు గుణపాఠం'

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు ఉద్యమ అమరవీరులు ఎస్ రామకృష్ణ, జీ విష్ణువర్ధన్, వీ బాలస్వామికి వివిధ వామపక్ష పార్టీల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ప్రజా వ్యతిరేక పాలన సాగించే ఏ ప్రభుత్వమైనా ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వామపక్షాలు హెచ్చరించాయి. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో నియంతలాగా వ్యవహరించే పాలకులకు 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్తు ఉద్యమం ఒక గుణపాఠమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లా వెంకటరెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాస్, సీపీఎం నేతలు డీజీ నర్సింహారావు, జూలకంటి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాకర్ల పేరుతో డబ్బులు వసూళ్లు

తిరుమలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): తిరుమలలో కొత్త రకం మోసం వెలుగుచూసింది. లాకర్ల పేరుతో భక్తుల నుంచి డబ్బులు గుంజుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తిలక్‌గా గుర్తించారు. తిరుమలకు వచ్చే భక్తులు తమ వస్తువులను భద్రపర్చుకోవడానికి లాకర్లను తీసుకుంటుంటారు. అయితే తనకు తాను టీటీడీ ఉద్యోగిగా చెప్పుకునే తిలక్ భక్తులకు ఫోన్ చేసి గడువులోగా లాకర్లు ఖాళీ చేయలేదని, ఫైన్ కట్టాలని బెదిరించడం మొదలుపెట్టాడు. ఇలాగే ఓ మహిళా భక్తురాలికి ఫోన్ రావడంతో అనుమానం వచ్చిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు తిలక్‌ను అదుపులోకి తీసుకున్నారు. భక్తుల వివరాలు తిలక్ చేతిలోకి ఎలా వెళ్లాయన్నదానిపై దర్యాప్తు చేస్తున్నారు.

స్కూళ్ల శుభ్రతకు సింగరేణి నిధులు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): సర్కారు బడుల పరిశుభ్రతకు సింగరేణి సంస్థ నిధులను ఖర్చుచేయనున్నారు. ఈ సంస్థ ద్వారా డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టుకు(డీఎంఎఫ్‌టీ) సమకూరిన నిధులను వినియోగించనున్నారు. నెలకు రూ.13 కోట్లను సింగరేణి సంస్థ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఖాతాల్లో జమచేయనుంది. రాష్ట్రంలోని 26,287 స్కూళ్లకు నెలకు రూ.13.61కోట్లు కానుండగా, 10 నెలలకు రూ.136.10 కోట్లు ఖర్చుచేస్తారు. తాజాగా మూడు నెలలకు సంబంధించి రూ.40.83 కోట్లను విడుదల చేయాలని మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టరేట్ అధికారులు సింగరేణి సంస్థ సీఎండీకి లేఖ రాశారు. డీఎంఎఫ్‌టీ నిధులను మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లోనే ఖర్చుచేయాల్సి ఉండగా, నిబంధనలను అతిక్రమించి సర్కారు రాష్ట్రవ్యాప్తంగా ఖర్చుచేస్తుంది.

జూనియర్ గెస్ట్ లెక్చరర్ల కొనసాగింపు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని 1,654 మంది గెస్ట్ లెక్చరర్లు, 449 కాంట్రాక్ట్, 53 పార్ట్ టైం హవర్లీ, 43 పార్ట్ టైం కన్సాలిడేట్, 3 మినిమం టైం స్కేల్ లెక్చరర్లు, 78 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగిస్తూ ఆర్థిక శాఖ జీవో విడుదల చేసింది. ఈ సందర్భంగా గెస్ట్ లెక్చరర్ల సంఘం హర్షం వ్యక్తం చేసింది.

'ఆలిండియా ఎస్టీ' ఎక్సైజ్ కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ఆలిండియా ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఎక్సైజ్) కార్యవర్గం ఎన్నిక బుధవారం హైదరాబాద్‌లోని అబ్కారీ భవన్‌లో జరిగింది. అధ్యక్షుడిగా రంగారెడ్డి ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్, ప్రధాన కార్యదర్శిగా మేడ్చల్ ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్ కుమార్, కోశాధికారిగా కే శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

టీహబ్‌లో బోయింగ్ ఇన్నోవేషన్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ఏరోస్పేస్ టెక్నాలజీలో ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు టీహబ్ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఏరోస్పేస్ కంపెనీ బోయింగ్, బోయింగ్ వర్సిటీతో కలిసి ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. వివరాలకు https://bit.ly/ 3yjnNp3లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

గాజులరామారంలో గాల్లో కాల్పులు

- పెట్రోల్ చోరీకి బైకర్ యత్నం
- దొంగలు అనుకొని అడ్డుకున్న బార్ సిబ్బంది
- ఇరువర్గాల మధ్య అర్ధరాత్రి బాహాబాహీ



కుత్బుల్లాపూర్, ఆగస్టు 28: తుపాకీతో గాల్లో కాల్పులు జరిపిన ఘటన అర్ధరాత్రి గాజులరామారంలో సంచలనం సృష్టించింది. పెట్రోల్ చోరీ ఘటన ఇరువర్గాల బాహాబాహికి కారణమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి తన కొడుకు, మహిళతో కలిసి నిజాంపేట్ నుంచి గాజులరామారం వైపునకు మంగళవారం అర్ధరాత్రి 2 గంటలకు బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. మధ్యలో గాజులరామారం ఎల్ఎన్ బార్ వద్దకు రాగానే బైక్‌లో పెట్రోల్ అయిపోయింది. దీంతో రోడ్డుపక్కనే పార్క్ చేసి ఉన్న మరో బైక్ నుంచి పెట్రోల్ తీసేందుకు ప్రయత్నిస్తుండగా బార్ సిబ్బంది చూసి దొంగలు అనుకొని వారించారు. అంతేకాకుండా బార్ సిబ్బంది ద్విచక్రవాహనదారుడిపై దాడికి పాల్పడ్డారు. దీంతో సదరు మహిళ తనకు తెలిసిన మల్లంపేట్‌కు చెందిన నరేశ్‌కు ఫోన్ చేయగా హుటాహుటిన తన అనుచరులతో కలిసి కారులో ఎల్ఎన్ బార్ వద్దకు వచ్చాడు. బార్ సిబ్బందితో వాగ్వాదానికి దిగడంతో ఇరువర్గాలు బాహాబాహీకి పాల్పడ్డాయి. దీంతో నరేశ్ తన కారులో ఉన్న తుపాకీని తీసి గాల్లో మూడు రౌండ్లు కాల్చడంతో అక్కడి నుంచి అందరూ పరారయ్యారు. బార్‌లో పని చేసే జగద్గిరిగుట్టకు చెందిన అఖిలేశ్ బుధవారం నరేశ్‌తోపాటు ఇతర వ్యక్తులపై జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఫోన్ల ట్యాపింగ్ కేసులో కోర్టుకు భుజంగరావు

నాంపల్లి కోర్టులు, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న అదనపు ఎస్పీ భుజంగరావు ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై కొనసాగుతున్న నేపథ్యంలో బుధవారం ఆయన ఒక్కరే నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ అధికారి ప్రణీత్‌కుమార్ అలియాస్ దుగ్యాల ప్రణీత్ రావు, మేకల తిరుపతన్న, రాధాకిషన్‌రావును జైలు అధికారులు కోర్టుకు హాజరుపర్చలేదు. దీంతో తదుపరి విచారణను వచ్చే నెల 9కి వాయిదా వేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ రోజున రిమాండ్ ఖైదీలను తప్పకుండా కోర్టు ఎదుట హాజరుపర్చాలని పేర్కొన్నది.

హైకోర్టును ఆశ్రయించిన తిరుపతన్న

ఈ కేసులో అదనపు ఎస్పీ తిరుపతన్న బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. విచారణను సెప్టెంబర్ 4కు వాయిదా వేసింది.